ఆకలి



894.8271
BEE

బీనా

B

ఆ ము ఖ ం

కావ్యంలో ఒకటి రెండు చోట్ల లభించే సూచనలను బట్టి-కావ్యనాయిక పేరు రాజ్యద అనీ, నాయకుడి పేరు రాజా అనీ అనుకోవచ్చు. అలాగే అనుకొందాం.

రాజా రాజ్యదలు ప్రేమికులు.

వారి ప్రేమ మరీ గాఢం కావడం రాజ్యద తండ్రికి ఇష్టం లేదని రాజా అనుమానం. రాజ్యద వాళ్ల అవ్వకు తోడుగా తీర్థయాత్రలకు పంపివేయ బడడం అతడి అనుమానాన్ని ఇంకా బలపరిచింది.

రాజ్యద తండ్రి అయిష్టతకు కారణం ఏమిటో తెలీదు. వర్గభేదం కావచ్చు, వర్ణభేదం కావచ్చు. మానవుడు సోషలిస్టు కావడానికి ఈ రెండు భేదాలూ నిరోధకాలే. ఈ భేదాలను నిర్మూలించకుండా సోషలిస్టు వ్యవస్థను నిర్మించడం సాధ్యం కాదు.

ఈ ప్రేమికులు ఇలాంటి భేదా లన్నిటికీ అతీతులు. రాజ్యద తనతో ఆత్మైక్యం పొందిన అనురక్త కనుక, ఆమె తండ్రి చూపే అయిష్టత రాజాను అంతగా బాధించలేదు. కాని - ఆయన కల్పించిన ఈ ఎడబాటే వారిని వియోగ బాధకూ, విరహవ్యధకూ గురిచేసింది.

ఆమె వాళ్ల అవ్వకు తోడుగా తీర్థయాత్రలు చేస్తూవుంది. ఆమెకు ఒక చిరునామా అంటూ ఏమీ లేదు. క్షణం విశ్రాంతీ లేదు. అతడు ఇంటి వద్దనే కూర్చున్నాడు. ఏమి తోచక గత స్మృతులతో గడుపుతాడు. ప్రేమలేఖలు వ్రాస్తాడు. ఏ అడ్రసు కని వేస్తాడు? అప్పుడప్పుడు సాంఘిక రాజకీయ కార్య క్రమాలలో పాల్గొంటూ వుంటాడు. ఏమైనా, వియోగ బాధ ఎలా తప్పుతుంది?

అవ్వ సేవించే పుణ్యక్షేత్రాల సంఖ్య రోజు రోజుకూ పెరిగిపోతూ వుంటుంది. శ్రీశైలం వెళితే - మరి మహానందో, ఓంకారమో అనిపిస్తుంది.

అహోబిలం దగ్గరలోనే వుంది కదా అనిపిస్తుంది. ఆ విధంగా ప్రతి వూరూ, ప్రతి వీధీ ఒక పుణ్యక్షేత్రమే అయి కూర్చుంటుంది. కావ్యంలో కొద్ది స్థలాల పేర్లు మాత్రమే కనిపిస్తున్నా, అవ్వ యాత్రాప్రణాళిక ఇలా తయారయిం దని మనం ఊహించవచ్చు. ఏ క్షేత్రాన్నీ, ఏ దేవతనూ వదులుకో లేదు. రాజ్యదకు ఇదంతా ఒక పిచ్చి. ఈ ఎడబాటుకు అంతెక్కడ? ఎప్పుడు? ఎంత ఘోర మైన పరిస్థితి!

ఇలాంటి పరిస్థితిలో, పరి పరి విధాలుగా పోయే మనస్సుతో, ప్రేమి కులు వ్రాసుకొన్న ప్రేమలేఖలే ఈ శివాలకలు!

కావడానికి ఇవి ప్రేమ లేఖలే అయినా - అప్పటప్పటి తమ తమ మన స్థితిని బట్టి వీటిలో సమాజం, రాజకీయం, మానవుడు, మతం, దేవుడు, భక్తి, క్షేత్రం, ఆచారం, కర్మ, పునర్జన్మ, మోక్షం వగైరా అనేక ఆధునిక సమస్యలను, ఘర్షణలను గురించిన విమర్శలు వుంటై. ఒక లేఖలోని విషయా లనే తరువాతి లేఖలలో మళ్లీ చెప్పడం కూడ జరుగుతుంది. ప్రేమలేఖ లంటేనే మనోభావాల పునరుక్తులు కదా!

వారిద్దరూ ప్రేమ తపోధనులు కనుక, వారి మనోభావాల నుంచి అభివ్యక్తాలైన సూక్తులు లేదా సూక్తాల వంటివి ఉపేక్షింపరానివి. కనుకనే, ఈ ఆలోచ నామృతాన్ని తనివితీర ఆస్వాదించి, మానవ సమాజాన్ని మూఢత్వం నుంచి ఉద్ధరించి, హేతువాదబద్ధంగా ప్రగతి పథంలో నడిపించి, సర్వసమగ్రమైన సోషలిస్టు వ్యవస్థకు నిర్మాతలు కావలసిందిగా రసజ్ఞ యువతను అర్థిస్తున్నాను.

శివాలకలు - ప్రేమ లేఖలు

ఈ కావ్యం ఇద్దరు ప్రేమికుల మధ్య నడిచిన ప్రేమ లేఖల సంపుటి. ఇందులో అతడు వ్రాసినవే ఎక్కువ. ఆమెవి కొద్ది

ఇందులో కొన్ని కొన్ని లేఖలు "ఫ్రీ వెర్సులో ప్రేమలేఖలు", "ముద్దులలో అద్దరికి" అన్న పేర్లతో కొన్ని కొన్ని మిత్ర పత్రికలలో ఇది వరకు ప్రకటించబడి నట్టివి. కొన్ని ఆకాశవాణిలోను, సాహితీ సదస్సులలోను

గానం చేయబడినట్టివి . ఒకేసారి , ఒకే దీక్షతో వ్రాయబడినట్టివి కాకపోయినా , వస్తైక్యం , రసస్థాయి వుండడంవల్ల ఇది కావ్య మయింది .

ఈ లేఖలలో కేవల వియోగ వ్యథాపరితప్తాలైన వాటిని నేను వ్రాసి ఇప్పటికి పదహారు సంవత్సరాలయింది . ఈ లేఖల రచనా , రాగవైశాఖి రచనా సుమారుగా ఒకేసారి ప్రారంభమయం దనవచ్చు . రాగవైశాఖి వచన కావ్యమై , శ్రీ బాపురెడ్డి గారి సలహాపై శ్రీ పట్టాభిరామరెడ్డి గారికి అంకితమై త్వరలోనే ప్రకటితమయింది . ఈ కావ్యం గద్య కవితా రూపాన్ని సంతరించు కొని , దిన దిన ప్రవర్ధమాన మవుతూ , నేటికి పదహారేళ్ల దయింది .

నిజానికి " రాగవైశాఖి " కీ , " గుడిసెలు కాలిపోతున్నై " కూ ఈ శివాలకలే మూలం . దీని నుంచి ఎక్కువ భాగం ప్రేమ రాగ వైశాఖికి పోగా , విమర్శ గుడిసెల్ని వరించింది - అవి రెండూ ముందే ప్రింటు కావడం వల్ల .

శివాలకలు అంటే శివుని యొక్క అలకలు . ముంగురులు . శివుని ముఖం వైపున చెంపలపై వ్రేలాడే వెంట్రుకలు లేక జటలు అని నా భావం .

" అలకలు , ముంగురులు అనడం స్త్రీపరంగానే నేమో ! " అంటూ , నాకేసి అనుమానంగా చూశారు డా . గోపాలరెడ్డి గారు - ఈ పేరు మొదటి సారి విన్నప్పుడు .

" శివుడు మాత్రం సగం స్త్రీయే కదా ? " అన్నాను నేను , అప్పటి కలా తోచి .

పోనీ , జటలే అనకూడదా అంటే - అనవచ్చు . అయితే - శివుడు హిమాలయాలలో వుంటూ దనుకొన్నప్పుడు , అతడి ముఖం భారత దేశం కేసే వుంటుంది కదా ? గంగ ఈ దేశంలోకి దిగింది కనుక , అతడి ముంగురుల నుంచే జారి వుండాలి . ఈ లేఖల నుంచి సహృదయ క్షేత్రాలకు ప్రవహిస్తున్నది ప్రణయగంగ కనుక , ఇవి శివాలకలే కావాలి . తప్పదు .

హర ద్వారం – పద్మశ్రీ

1973 , మార్చి 24 న పూజ్య భారత రాష్ట్రపతి నుంచి సాహిత్యానికి పద్మశ్రీ బిరుదం స్వీకరించి , దేహళి (డిల్లీ) నుంచి హరద్వారంకు బైలుదేరాను నాన్న జ్ఞాపకం వచ్చి .

(ఇందుకు సంబంధించిన వివరాలు కొన్ని గుడిసెలు కాలిపోతున్నై కావ్య సంపుటి యొక్క పీఠికలో ఇచ్చాను. ఆ పీఠికనే ప్రొఫెసర్ దివాకర్ల వారు విప్లవ వేదంగా అభివర్ణించి వున్నారు లోగడ.)

నేను సప్తగోదావరీ సమ్యగంతరంగమైన కోనసీమ వాణ్ని. యమునా గంగా కరకరోపగూహన కేళీ సంపత్సీమలో ప్రయాణం చేస్తున్నాను! గోదావరీ తీరమే గంగాతీరం! వరీ, గోధుమా తేడా తప్పితే - అంతా ఒక్కటే! అదే నీరు, అవే చేలు, చెరకు తోటలు, అవే పశువులు, పేడ కుప్పలు, పిడక పిరమిడ్లు (వాములు), అదే రైతులు, కూలీలు, మామిడి పూత, కోకిల కూత!

మా నాన్న రాజయోగి కనుక, సాక్షాత్తు అరుంధతీ సమేత వశిష్ఠ మహర్షే అని (మా ప్రాంతపు ప్రజలచేతా, మునసబు కరణాలచేతా) అనిపించుకొన్నవాడు కనుక, ఆయన మొదట్లో హరద్వారకు వెళ్లాలనుకొన్నా, తర్వాత ఎందుకు వెళ్లలేదో అప్పు డర్థమయింది నాకు!

చిత్తం పరమేశ్వరాయత్తమైవున్న జీవుడికి - తా నెక్కడుంటే అదే పుణ్యక్షేత్రం. తాను వేసే ప్రతి అడుగూ ఒక పరమాలయం? చేసే ప్రతి పనీ ఒక పూజోపవిధి.

బస్సు దూసుకు పోతూవుంది - యమున వంతెన దాటి, తూర్పు ముఖంగా - లక్నో రోడ్డు నుంచి మళ్లి, ఉత్తరం వైపుగా - మురాద్‌నగర్, మోడీనగర్, మీరట్, ముజ్ఫర్‌నగర్, రూర్కీ, గంగ కాలువ దాటి, గట్టు వెంబడే హరద్వార వైపు!

ఆ మధ్యలో అయిదు పైసల కొక గ్లాసు చొప్పున రెండు గ్లాసుల మంచి నీళ్లు, అర్ధరూపాయికి రెండు సంత్రాలు, పదేసి పైసల చొప్పున నాలుగు లోకాట్‌పళ్లు - రోడ్డు కడ్డంగా అక్కడక్కడ ఒంటిదున్న బళ్లు, మీరట్ ప్రాంతంలో కోటల్లాంటి ఇళ్లు, ఇరుప్రక్కలా ఎర్రపూత మామిడి తోటలు - చుట్టూ అడవులు, కొండలు, మంటల్లాంటి పూల గుత్తులు - ఈ అనుభవా లన్నిటి గుండా పయనిస్తూ, నాలుగు కాలవల లాకు మీదుగా, జ్వాలాపురం దాటి హరద్వార చేరేవరకు నా మనస్సు పరాయత్తంగానే వుంది!

హరద్వారం వెళ్లి నేనేం చెయ్యాలో బస్సులో కూర్చుని చాల దూరం ప్రయాణం చేసిన తర్వాత తట్టింది నా మనస్సుకు.

పద్మశ్రీని నాన్నకు అంకితంచేసి, పద్యాలు వ్రాసి, వాటిని బ్రహ్మ కుండంలో వదులుదాం అన్నది అప్పుడు నాకు తట్టిన భావం.

రమణీయమైన ఆ రూర్కీనగరం బస్ స్టాండులో, లోకాట్ పళ్లు తింటూ కూర్చున్నప్పుడు తట్టిన భావం ఇది నాకు బహుశా! మొత్తం 200 కిలో మీటర్లలోను మూడు వంతులు ప్రయాణం జరిగిపోయిన తర్వాత తట్టిందన్న మాట కిం కర్తవ్యతా భావం!

అప్పుడు అక్కడ మొదలుపెట్టి, బస్సు హరద్వారం చేరేవరకు వ్రాసిన పద్యాలనే నేను బ్రహ్మకుండంలో, గంగాముఖంగా, దీప దొన్నెలో పెట్టి సమర్పించుకొన్నాను నాన్నకు - ఆ సంధ్యా దీపోత్సవ నిత్య సంరంభ శుభ సమయంలో. ఆ పద్యాలు ఇవి:

పల్లయ్య పద్యాలు

ఆదిన్ గొంటి కళాప్రపూర్ణను, ఫెలో
నైనాను; సాహిత్య రా
ధా దేవీ దయ పొంగి వచ్చినది; ప
ద్మశ్రీని చేబట్టి నీ
పాదలన్ ఇవు డుంప దెచ్చితి హర
ద్వారమ్ము: నే డింక నీ
ఆదర్శమ్ము ఫలింప ప్రీతి గొను మ
య్యా! పల్లయార్యా! గురూ!

2

కన్నావయ్యా, శరీరమాత్రము గనే
కా, దాత్మ సంవేద వి
ద్యా న్నా తోడుగ; కోన సీమ మధురో
ద్యానమ్ములన్ ఆమె - వి

వ్వా న్న వ్యోధ - రసాత్మయై , కవితయై
వర్ధిల్లె నాలోన ! నీ
వన్నింటన్ గురు డయ్యా , నీవె శివు డ
య్యా రాజయోగమ్మునన్ !

3

నా చిన్నప్పుడు నీవు శిష్యులకు జ్ఞా
న మ్మిచ్చు నవ్వోళలన్
వాచా చూపెద వప్పు డప్పుడు హర
ద్వార ప్రభామూర్తి ; అ
ప్పే చేతోవని నాటుకొన్న లత ఇ
ప్పీ రీతి వాసంతమై
పూచెన్ ; ఆత్మ ఝరీ విహార మిది , సం
పూర్ణమ్ము తత్ సిద్ధిలో !

4

ఏ రామా రమణీయ జానపద గే
యే శా లయ ప్రాణలై
ఆ రా మమ్ముల , సర్వకాలముల , స
స్య శ్రీలు నర్తించు - తత్
ధీరన్ , తల్లిని నాగమన్ తలప ప్ర
త్యేకమ్ము - గోదావరీ
తీర స్వాంతమె ఆమె , నీకు సదసత్
చిద్రూపమే యౌటచేన్ !

5

అమ్మా లేదిపు డయ్యలేడును , శివై
క్యమై మ్మరిపో ; ఎప్పుడే
నమ్మా అయ్యా అనన్ సదా ఎదా సుధా
హస్తమ్ము మై నోకు ! లో

క మ్మెల్లన్ భవదీయ ధీమయ హృషీ
కమ్మయ్యో కాబోలు ! నా
కమ్మే అయ్యో ప్రతీ లవమ్ము జగతిన్ ,
అవ్యాజ రాగ స్థితిన్ !

ఈ పద్యాలు మరోచోట , మరో విధంగా ప్రకటితమయ్యే అవకాశం లేక ఇక్కడ ఉదాహరించా ననుకొంటారు కొందరు . అందులో నిజం కూడ లేక పోలేదు ! సనాతనత్వం గురించీ , సంప్రదాయం గురించీ గొప్పలు చెప్పుకునే ఈ దేశంలో - ఆ వేమిటో తెలిసిన పెద్దలు కాని , కులద్వేషాలకు అతీతంగా పెరిగిన పత్రికలు కాని ఈనాడు చాల తక్కువ కదా ?

ఈ పద్యాలను ఏ పత్రికకో పంపించక , బ్రహ్మకుండంలో వదిలింది కూడా అందుకే .

హిమాలయాలకు ద్వారం హర ద్వారం . హిమాలయ పర్వత శ్రేణులు ప్రారంభ మయిం దక్కడ నుంచే . అక్కడ సమీపంలోని కొండల వరుసలకే శివాలకలు అని పేరు .

శివుని శిరస్సు మీదికి దూకిన ఆకాశగంగ - అక్కడి నుంచి , అంటే శివుని అలకల నుంచి క్రిందికి జాలు వారి , భారత సమతలం చేరిం దక్కడే - హరద్వారం వద్ద . గంగకు తొలి ఆనకట్ట నిర్మించబడింది కూడ అక్కడే .

హిమాలయ పర్వత శ్రేణు లన్నీ శివుని జటాబంధాలే . ముందున్న ప్రతి జట నుంచీ , ప్రతి వెంట్రుక నుంచీ అనంతమైన ఝరులుగా , వాగులుగా , ధారలుగా ప్రవహించి వచ్చి - హరద్వారం వద్ద కలిసి పూర్ణగంగగా రూపం దిద్దుకొంటుంది దివిజ !

ప్రకృతి సహజ సత్యానికి గంగావతరణ గాథ ఎంతటి రమణీయ రూపకల్పన ! శివాలకల ద్వారా , గంగకు అభిముఖంగా , హృషీకేశం వైపు యాత్ర చెయ్యడం ఎంతటి మధురానుభూతి !

ఈ లేఖ లన్నిటినీ కలిపి , కావ్య రూపంలో ఏ పేరుతో ప్రకటించాలా అనుకొంటున్న సమయంలో - నేను ఈ శివాలకలను చూడడం జరిగింది . ఆ పేరే ఈ కావ్యానికి పెట్టాను .

ఈ కావ్యవస్తువుకూ, ఈ శివాలకలు పేరుకూ బ్రహ్మముడిలా అతికింది! ఇది నా అదృష్టం!

నేను పూర్వం నా "అకాండ తాండవం" గేయ కావ్యంలో సిద్ధాంతీకరించి నట్టు— ఈ సమస్త చైతన్యమూ శివతాండవ కళా విలాసమే! అది సమ్యక్ శృంగార లీలా విన్యాసం!

ఇవి ప్రేమ లేఖలు కనుక ఇందులోని ఒకొక్క లేఖా శివుడికి ఒకొక్క వెంట్రుకే— అది ఎక్కడిదైనా సరే!

ఆధునికులు — ప్రేమ

"కవితా వనితా లతా" అనేది నా కవిత్వ తత్వం. "నగ్న సత్యం వేదాంతం, అలంకృత సత్యం కవిత్వం" అన్నా నొక చోట.

జీవ జగత్తు రస మూలకమైనట్టిది. రసం ద్వారా తప్ప దాన్ని దర్శించ లేం. అందుకే, నా కవితా తత్వాన్ని రస దర్శనం అన్నారొకరు.

ఆధునికులు, ముఖ్యంగా విద్యావంతులైన రచయితలు ఈనాడు ప్రేమ అనే పదాన్ని చూచే హడలిపోతున్నారు. ఎందుకో తెలీదు.

ప్రేమ అంటే ఇంగ్లీషులోని లవ్ అనే పదార్థంగా మాత్రమే తప్ప, మరొక విధంగా తెలియని సెక్సు సాహిత్యం ఒక ప్రక్క కుప్ప తెప్పలుగా వస్తూనే వుంది. మరో ప్రక్క నిరుద్యోగులైన, విఫల మనోరథులైన యువకులు తిట్టు సాహిత్యాన్ని తట్టల కొలదీ తవ్వి తూర్పార బోస్తున్నారు. అదీ, ఇదీ కలిసిన దూగరతో సారస్వత వాతావరణం కలుషితమై పోయి వుంది ఈ నాడు. ఈ కాలుష్యం చుట్టూ పత్రికలు, రేడియోలు, సినీమాలు ఈగల్లా మూగి సొమ్ము చేసుకొంటున్నై.

ఇలాంటి స్థితిలో— "ఇదిగో, ప్రేమ! ఇదిగో, కవిత!" అంటూ నా లాంటి వాడెవడో గొంతెత్తి అరవాలనుకోవడం వట్టి పిచ్చితనమే కావచ్చు. అయినా — అమాయక ప్రజల్ని అజ్ఞానాంధకారంలోకి దింపేస్తూ, వాళ్ళ వివేకాన్నీ, జ్ఞాన దీప్తినీ ఆర్పేస్తూ, వాళ్ళ శ్రమ ఫలితాన్ని దనే దినే తినేస్తూ వున్న

ఈ ధన స్వామిక ప్రచార సాధనాల విషపు కోరల నుంచి ఈ పేద గొర్రెల్ని కాపాడడానికి నే నేమీ చెయ్యలేనా ?

సెక్సు చుట్టూ, చచ్చిన వాళ్ళ చుట్టూ ఎందుకురా ఆ భజన అని అయినా అడగలేనా ?

ఒక ప్రక్క పిచ్చి సెక్సు , ఒక ప్రక్క పచ్చి హింస – ఈ రెండు మహా రోగాలతోనూ తీసుకు చస్తున్న ఆధునికుల మనస్సును మానవతా మాధుర్యం కేసి , మధుర ప్రణయం కేసి మరల్చి , ఆనందం రుచిచూపడం కోసం నా కృషి . ఇదొక్కటే మానవ జాతిని రక్షించగల సిద్ధ మార్గం .

కవుల అహంకారం

నిజంగా కవులైన వాళ్ళకు అహంకారం వుండదు . వాళ్ళు సాధువులు , సత్త్వప్రధానులు . వాల్మీకి , వ్యాసుడు మొదలైన సాహిత్య స్రష్టలు పరమ సాత్వికులు .

సృజన శక్తి లేని వాళ్ళకు , ఏ రాజునో , పార్టీనో ఆశ్రయించి బ్రతక వలసిన వాళ్ళకు మాత్రమే అహంకారం వుంటుందనుకోవచ్చు . అది తెలుగు కవులలో , ముఖ్యంగా పండిత కవులలో మరీ జాస్తిగా వుండడం దురదృష్టం .

ఒక కవి సాక్షాత్తు సరస్వతి చేతనే ఒక తెలుగు కావ్యం వ్రాయించాడట . పోనీ , అదేదో ఒక మౌలికమైన మహా కావ్యమా అంటే , అదీ కాదు . అది మళ్ళీ ఒక నాసిరకపు రామాయణం !

మరో తెలుగు కవి సరస్వతిని " నత్తి దానా " అని ఆక్షేపించాడట ! అతడు తానే సాక్షాత్తు బ్రహ్మ అనుకొని వుంటే , ఒక స్వతంత్ర కావ్యమే నిర్మించ లేక పోయాడా ? వ్యాసుణ్ణి ఆశ్రయించి , అనువదించు కోవలసిన ఖర్మ ఎందుకు పట్టింది ?

ఇంకొక సంస్కృత కవి సరస్వతిని " రండా " అన్నాడట ! అతడి రచనలు కూడ , ఒకటి రెండు తప్ప , అన్నీ వ్యాస వాల్మీకుల నుంచి సంగ్రహించి నట్టివే !

ఇలానే ఎంతో మంది కవులు , వ్యాస వాల్మీకుల గోటికి కూడ సరిపోని వాళ్ళు , అంతేసి అహంకారాన్ని ఎందుకు ప్రదర్శించినట్టు ? నా కనిపిస్తుంది –

అది పాపం వాళ్ళ దోషం కాదు, వాళ్ళున్న సమాజం దోషం అని. అహంకారి అయిన రాజునో, ధనికుడినో, అధికారినో ఆశయించి బ్రతకా లనుకొన్న కవి తన రంగంలో తనంతటి వాడు లేడన్న అహంకారాన్ని ప్రదర్శించక తప్పదు. గారడీ విద్యలను, మోసాలను సైతం వినియోగించుకొన్నా రందుకు చాల మంది కవులు. పోనీ, బ్రతుకు తెరువు కోసం ఏదో చేశా రనుకొన్నా – సరస్వతినే అవమానించడం సాహసం కాదా? అట్టి దుస్సాహసానికి ఒడిగట్టి, వాళ్ళు సాధించిం దేమిటి? మానవాభ్యుదయానికి సొంతంగా ఇవ్వగలిగిం దేమిటి?

ఈ రకమైన మానసిక వైకల్యాలు పూర్వ కవుల్లోనే కాదు, ఇప్పటి కవులలో కూడ వున్నై. పూర్వం ప్రభువులైతే, ఇప్పుడు పార్టీలూ, ఇజాలూ! కవిత వ్రాస్తున్న కవులు బహు తక్కువ.

మానవుడి (నిజానికి, ఏ జీవికైనా సరే) ధ్యేయమైన ఆనందాన్ని సేకరించి, నాదగతం చేసి, అతడికి అందించేదే కవిత. నా కావ్యాలను చదవా లనుకొనే సహృదయులు ముందుగా ఈ సత్యాన్ని గుర్తించాలి. అందుకే ఈ హెచ్చరిక చేస్తున్నాను.

"శరణాగతి" సిద్ధాంతం

ఏ మత సిద్ధాంతమైనా చివరకు ఒక్కటే – అది భగవంతుడికి సంపూర్ణ శరణాగతి.

"నీవే తప్ప ఇతః పరం బెరుగ, మన్నింపన్ దగున్ దీనునిన్" అంటూ అతడి పాదాల మీద పడిపోవడం!

"The doctrine of surrender postulates that God gives guaranteed protection to anyone who clings to His feet, expresses regret and cringes for pardon, whatever be the magnitude of his sins."

(From the Hindu, 26-11-1975)

ఈ సిద్ధాంతమే మానవ సమాజాన్ని నాశనం చేసింది. స్పష్టంగా, ధైర్యంగా ఆలోచించగల వారందరూ ఈ సత్యాన్ని గుర్తించ గలరు.

పురాణ కథల్లో ఏదో ఒక పది మందికి తప్ప, భగవంతుడు నిజంగానే శరణన్న వారికి రక్షణ కల్పించిం దెక్కడ? మతాన్ని వృత్తిగా పెట్టుకొన్న వాళ్ళ మాటలను అలా వుంచితే, సాధారణ మానవుని వాస్తవానుభవం ఏమిటి?

ఈ మూఢ భక్తిని, వ్యర్థ భ్రాంతిని, అజ్ఞానాన్ని అమాయక ప్రజలలో ప్రచారం చేసే వాళ్ల కంటె వంచకు లెవరు?

తాము మాత్రమే భగవంతుని అవతారాల మనో, దూతల మనో, ప్రతినిధుల మనో నమ్మిస్తూ, తమను మించిన వాళ్లు భూత భవిష్యత్తులలో లేరని ప్రకటించు కొనే ప్రవక్తల కంటె గారడీ వాళ్లెవరు? స్వార్థపరు లెవరు?

ఏ మత మైనా చివరికి చెప్పే సిద్ధాంతం ఇదొక్కటే కదా? మరి ఈ మత కలహాలకు ఏమిటి కారణం?

సినీమాలలోని భక్తీ, వెలయాండ్రలోని వలపూ ఎంత వాస్తవమో — సగుణ సాకార దైవం అనబడే వాడొక డున్నా డన్న భావమూ, అతడు ఆర్తజన రక్షకు డన్న విశ్వాసమూ అంతే వాస్తవం.

ఎప్పుడో ఒక ప్రవక్త ఎవడో ఒక రోగికి స్వస్థత కలిగించా డంటే, ఏవో ఒకటి రెండు అద్భుతాలు చేశా డంటే - ఆ మాత్రం ఈ నాడు ప్రతి డాక్టరూ చేస్తున్నాడు, ప్రతి చిన్న బాబా కూడ చేస్తున్నాడు. ఎవరో ఒక పురాణ కావ్యనాయకుడు ఎవడో ఒక ఆశ్రితుడికి, ఒక శరణాగతుడికి అభయం ఇచ్చాడంటే - ఆ మాత్రం నేడు ప్రతి పార్టీ నాయకుడూ, ప్రతి మంత్రీ, ప్రతి అధికారీ చేస్తున్నాడు.

ఈనాడు సమాజాన్ని నిజంగా పట్టిపీడిస్తున్న పీడలు అవి నీతీ, అధిక ధరలూ, దొంగ బజారూ, దోపిడీ దొరలూ కాదు. మానవ జాతి అత్మనే పట్టి, జీవధాతువును పీల్చేస్తున్న చీడలు మత మౌఢ్యమూ, వర్గద్వేషమూ, దైవభక్తీ! ఈ చీడల నుంచి మానవుడు తప్పుకొని, పురుషకారానికి ప్రాధాన్యం ఇచ్చిన తక్షణం తక్కిన పీడలు వాటంతట అవే తొలగి పోతై.

మానవ కల్పితమైన ఈ ఆత్మవంచనకు లోను కావద్దనీ, స్వచ్ఛమైన ప్రేమతోనే పరబ్రహ్మను పొందు మనీ ఉద్బోధిస్తున్నాను నేను. అదే ఈ శివాలకల లోని రసాద్వైత సందేశం.

తన పాత్రనే ప్రార్థించడం

జోసెఫ్ షస్టర్, జెర్రీ సీగెల్ అనబడే ఇద్దరు అమెరికన్ రచయితలు 42 సంవత్సరాల క్రితం సూపర్ మేన్ (అధిమానవుడు) అనే ఒక విచిత్ర పాత్రను సృష్టించారు. ఆ పాత్ర అత్యధిక మైన జనాదరణను పొంది, ప్రచురణ కర్తలకు లక్షలు ఆర్జించిపెట్టింది. అయితే, ఆ పాత్రను సృష్టించిన రచయితలు మాత్రం నిత్య దరిద్రులుగానే వుండిపోయారు —

ఇంత వరకు ఈ వార్తలో (The Hindu, 2-12-1975) పెద్ద విశేషం ఏమీ లేదు. ఇప్పుడా రచయితలు వృద్ధులై పోయారు. ఏ పనీ చెయ్యలేరు. మరి పొట్ట గడిచే దెలా? ఈ ఉదంతాన్ని నే నిక్కడ ఉదాహరిస్తున్న దీ ప్రశ్నకు సమాధానం కోరి కూడ కాదు. మరెందు కంటే, ఆ వార్తలోని —

" They, nearly destitute and worried, are invoking the spirit of Superman for help " అన్న వాక్యాన్ని ఆలోచించగల యువకుల దృష్టికి తేవడానికి.

తాము సృష్టించిన పాత్ర దేవుడై కూర్చుని, తమను కొల్చే వ్యాపార వర్గానికి కనక వర్షమే కురిపించవచ్చు. ఆ వర్షం పాఠకుల వ్యామోహం నుంచి, వ్యాపార దక్షతతో, ప్రబల ప్రచారం ద్వారా వచ్చేది. పాత్ర కేవలం ఊహా జనితం. స్వయంగా దాని కే శక్తీ లేదు. ఏదో కావాలని దాని ముందు దోసిలి పట్టి కూర్చుంటే, అదేమిస్తుంది?

వాల్మీకి, వ్యాసుడు వంటి ఋషులు సృష్టించిన రాముడు, కృష్ణుడు వంటి పాత్రలు కూడ ఇటువంటివే కదా?

పరమాత్మ వేరు, మతం వేరు. మతం లౌకిక మైనట్టిది. ప్రజల్ని సదా మూర్ఖత్వంలో అట్టిపెట్టి వుంచడానికి కొంతమంది మేధావులు సృష్టించిన పాత్ర అది.

" All those who claim to possess spiritual powers are either hoaxers or mentally deranged persons suffering from a neurosis called cryptesthesia "

" Nobody has, nobody had supernatural powers "

(Dr. Kovoor : Sunday chronicle, Oct. 26, 1975.)

"In all psychic, parapsychic and spiritual Phenomena there is a trick and a method behind it all".

దైవిక శక్తులు, ప్రకృత్యతీత శక్తులు ఏ మానవుడికీ వుండవనీ, అట్టి శక్తులను ఎవరైనా ప్రదర్శిస్తే దాని వెనుక ఏదో ఒక గారడీ వుండి వుంటుందనీ డాక్టర్ కోవూర్ అంటున్నాడు. కాదనే వాళ్లు లేరు!

అంకితం కథ

భువన విజయం రాజపీఠంపై శ్రీకృష్ణదేవరాయల వారిని చూస్తూ, అంతటి వైభవం తెలుగు సరస్వతికి ఈ ఆధునిక కాలంలో ఎక్కడైనా వున్నదా అని ముఖం ఇటు తిప్పితే, మనసు అంతకంటె ఎన్నో రెట్లు వైభవంతో సముజ్వలంగా కనిపించేది - ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ అధ్యక్షపీఠంపై డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారు

అయితే, నాటికీ నేటికీ పోలిక ఏమీ లేదు. ఆనాడు రాజ సన్మానం పొందిన కవులు బహుకొద్ది మంది. ఈనాడు గోపాలరెడ్డి గారి సన్మాన సత్కార గౌరవాలను అందుకొంటున్న కవులు, రచయితలు వేలమంది. ఈ సాహితీ సమ్రాట్టుకు "మానవుని మరొక మజిలీ" అనే ఒక అపూర్వమైన గేయ దృశ్య కావ్యాన్ని నేను చాల కాలంక్రితమే అంకిత మిచ్చి వున్నాను.

గోపాలరెడ్డి గారి తర్వాత, నా అనుభవంలో సాహిత్య పోషకులు, సారస్వత మూర్తులు అయిన మహాపురుషులు చాల కొద్దిమంది. అందులో నాకు ఆత్మీయులై, నన్ను ప్రాణ సమానంగా చూసుకునే వారిలో శ్రీ లింగం మాలకొండయ్య గారు సుప్రధానులు. వారికి ఈ శివాలకలు కావ్యాన్ని అంకితం ఇస్తున్నాను.

"కవి, రచయిత, కవి పండిత పోషకుడు, ఆపద్బాంధవుడు, ఆర్తజన రక్షకుడు, మానవతావాది, సమసమాజ నిర్మాణ సమ్యగాశయుడు, ఉదార గుణోదాత్తుడు, పరిపాలనాదక్షుడు, ప్రాజ్ఞుడు అయిన ఎవరైనా ఒక ఉన్నతాధికారి ఈ ప్రజాస్వామిక యుగంలో ఉన్నారా" అని - నారదుణ్ని వాల్మీకి వలె - నన్ను ఎవారైనా అడిగితే, నేను టక్కున జవాబు చెపుతాను "ఉన్నారు, ఆయన శ్రీ లింగం మాలకొండయ్య" అని.

చిన్నతనం నుంచీ - రకరకాల రంగాలలో, రకరకాల హోదాలలో శ్రీ మాల కొండయ్యగారు నిర్వహిస్తూవున్న ప్రజాసంక్షేమ కార్యక్రమాలను, అందిస్తూవున్న సహాయ సహకారాలను గురించి చెప్పాలంటే - ఒక్కొక్కటి ఒకొక్కలఘు కావ్యమై, అన్నీ కలిసి ఒక మహాకావ్యమే అవుతుంది. దాని సంగతి తర్వాత.

అధికార హోదాలో ఆయన పని చేసిన జిల్లాలలోని ప్రజలకు ఆయన సాక్షాత్తు రఘుమహారాజే. ఆయన దానధర్మాలు, జరూరీ అమళ్లు అట్టివి. ఆయన ఎన్నో ఇబ్బందులలో వున్న పరిస్థితిలో, బాపురెడ్డి గారు నన్ను ఆయనకు కవిగా పరిచయం చేసినప్పుడు - ఆయన నాకు చేసిన సహాయం అద్భుత మైనట్టిది. చేత కానీ కూడ లేని రఘువు నుంచి కనక వర్షం పొందిన కౌత్సమహర్షి నే అయాను నే నా తరుణంలో.

ఆయన పుట్టుకతోనే కవి, రచయిత. విద్యార్థిగానే ఎన్నో రచనలు చేశారు. అయితే, గురుతరాలైన పరిపాలనా బాధ్యతల నీడల్లో ఈ సారస్వతాంకురం త్వర త్వరగా ఎదగలేక పోయిం దనవచ్చు. ఈనాటి కది మహత్తర మైన ప్రతిభతో వికసించి, విస్తరించింది. జీవితవలయాలు, మనిషికి మనిషి అన్న రెండు గద్య కావ్య సంపుటాలు ఆయనను అగ్రశ్రేణి ఆధునిక కవిగా లోకానికి అందిచ్చాయి.

మాలకొండయ్యగారు అధికారిగా కంటె - పరోపకారిగా, కరుణాళువుగా, అర్తజన బాంధవుడుగా, సామ్యవాదిగా, మానవతావాద ప్రతిపాదకుడుగా ప్రజలకు ఎక్కువ సన్నిహితులు. ఆయన రచనలలో ఒకొక్క దాని వెనుక ఒకొక్క అనుభవం, చరిత్ర వుంది.

మకుటం లేని మహా భోజుడు, మనస్సు కల మాల్యాద్రి ఆయన.

ప్రకాశం జిల్లా, కనిగిరి తాలూకా, రాళ్ళపల్లి గ్రామం ఆయన జన్మస్థలం. ఆ మండలంలోదే. మాల్యాద్రి. ఆ పేరు మీద కల పేర్లు ఆ ప్రాంతంలో సర్వసాధారణం.

మాల్యాద్రే తెలుగులో మాలకొండ. తన పేరులోని "రెడ్డి" అనే కుల సూచకపదాన్ని తొలగించి స్వచ్ఛమైన తెలుగు "అయ్య" పదాన్ని చేర్చుకో

వడంలోనే మాల కొండయ్యగారి కులమత వర్గాతీత మనస్తత్వం ప్రకటిత మవుతున్నది. మరి, ఆయన గురించి ఏమి వ్రాస్తే పొగడ్త అవుతుంది?

ఆంధ్ర యూనివర్సిటీ వారి నుంచి కళాప్రపూర్ణ గౌరవ డాక్టరేటును అందుకొని, కలకల్లాడుతూ కనిపించడానికైనా జేబులో కాసుల్లేని పేదరికంతో దిక్కుతోచక దిక్కులు చూస్తున్న నాకు - కేవల స్వభావ సిద్ధమైన వితరణ గుణంతో, దయాశీలతతో, సువర్ణధారను కురిపించిన లక్ష్మీస్వరూపుడు మాల కొండయ్యగారు. మహాకవి నారాయణరెడ్డి, మహారచయిత పోతుకూచి సాంబశివ రావు, మిత్రులు బాపురెడ్డి, గిర్‌గ్లాని, జ్ఞానానంద కవి, జిల్లా నాయకులు గణే శ్వరరావు, సత్యనారాయణరావు, రమణయ్య, ప్రభాకరరావు గార్ల వంటి ఆప్తశ్రేణి సహృదయ కోటితో వేదిక క్రిక్కిరిసి వుండగా, మహాసభ మంగ శాశీస్సులతో కిటకిట్లాడుతుండగా - నా స్వగ్రామంలో, నేను పుట్టిన స్థలంలో నాకు మహత్తరమైన సన్మానం జరిగిందంటే, దానికి మూలబ్రహ్మ మాల కొండయ్యగారే.

ఆనాటి నుంచీ ఆయనకు ఒక మంచి కావ్యాన్ని అంకితం ఇవ్వాలను కొంటూ వస్తున్నాను. నేటికి ఆ కోరిక ఫలించింది. ధన్యుణ్ని.

తీర్థయాత్రలు

"కాశికి పోవలెనా, తీర్థం మోసుక రావలెనా?" అంటూ బ్రహ్మం గారు -

"రాలు దేవు లైన రాళులు మింగవా?" అంటూ వేమన గారు-ఇలానే అనేకమంది మనీషులు తీర్థయాత్రలు, విగ్రహారాధనలు వట్టి మూఢ భ్రమ లని ఎంతనొక్కి చెప్పినా - ప్రజల బుర్రల కెక్కలేదు. విగ్రహారాధన చేసే ఆర్షులకే (ఆర్ష సాంప్రదాయకులకే) కాదు, తద్వ్యతిరేకులైన ఇతర మతాల వారికీ ఇదే పిచ్చి:

ఏదో ఒక భావరూపమైన రాతికో, ప్రతిమకో, ఒక గొప్పవాడి ఎముకకో, వెంట్రుకకో, సమాధికో, అతడు పుట్టిన స్థలానికో, కులానికో పూజ చెయ్యడం, అందుకోసం ఎన్ని కష్టాలైనా పడి యాత్రలు చెయ్యడం ఆదిమానవుని అజ్ఞాన లక్షణం. అది మనిషి స్వభావంలో ఒకభాగమై, అతణ్ని పట్టుకొని వదలకుండా వస్తూవుంది ఇప్పటికీ.

వేమన్న చెప్పితేనే వినని ప్రజలు భీమన్న చెపితే వింటారా ?

నేను చెపుతున్న దొక్కటే. ఆరాధన మానవ స్వభావం అయినప్పుడు, ఆరాధించుకోండి. రాతినో, సమాధినో కాక - మీ భార్యనో, భర్తనో, నెచ్చెలినో ఆరాధించుకోండి. అదే రసాద్వైతం. ఈ జీవితంలోనే అది మీకు ఆనందాన్ని రుచి చూపుతుంది.

మీ ముత్తాత ఫొటోకు రోజూ పూజ చేసుకోవా లనుకొంటే, చేసుకోండి, కాని - ఆ ఫొటోకు మూల స్వరూపుడైన ముత్తాత మీరు పెట్టేది తింటాడనో. ఆపదలో ఆదుకొంటా డనో మాత్రం భ్రమించకండి. ముత్తాత లాంటి వాళ్లే పాత అవతార పురుషులూ, ప్రవక్తలూ, దేవతలూ.

మూఢాచారాలకు, మూర్ఖ సంప్రదాయాలకు, మూఢ విశ్వాసాలకూ, మూర్ఖ భక్తికీ ప్రతీక అవ్వ. తద్వ్యతిరేకమైన మనస్తత్వం కలిగి, వాటన్నిటికీ అతీతురాలై, ప్రకృతిలోని ప్రతి లవంలోను సౌందర్యాన్ని దర్శిస్తూ, ప్రతి సౌందర్యాన్ని తన ప్రేమోపాసనకు సమర్పించుకొనే ఆధునిక యువతి రాజ్యద.

ఇప్పుడేం చెయ్యాలి ?

మొన్న ఒక ఆంగ్లపత్రికలో ఒక విశేషం చదివాను : ఒక రైల్లో కిటికీ దగ్గర కూర్చుని ఇద్దరు మనుషులు ప్రయాణం చేస్తున్నారు. ఒకామె కిటి మూసేసింది. వెంటనే రెండో ఆమె తెరిచేసింది !

" ఈ గాలికి చస్తాను " అంటూ మొదటామె కిటికీ మళ్లీ మూసింది.

" గాలి లేక చస్తున్నాను " అంటూ రెండో ఆమె వెంటనే కిటికీ తెరిచేసింది !

ఏమిటి చెయ్యడం ?

ఆ ఇద్దరి వాదాలూ - వాళ్ల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా సరిఅయినవే.

ఈ వివాదం పరిష్కారానికి మూడు మార్గాలున్నై : (1) మధ్యవర్తి పరిష్కారానికి వదలడం. కిటికీ మూయడం, తెరవడంపై అధికారం కల రైలు కండక్టరును తీర్పు చెప్పమంటే - మొదటామె చచ్చేవరకు తెరిచివుంచి, రెండో ఆమె చచ్చేవరకూ మూసివుంచ మన్నా డతడు !

మన సమస్యలకు భగవంతుణ్ని పరిష్కారం అడిగితే - అత డంతకంటె మరేం చెప్పగలడు ?

(2) ఇద్దరూ స్నేహంగా మాట్లాడుకొని, ఒకరి ఇబ్బందిని ఒకరు గుర్తించి, పరస్పర సహకారంతో సర్దుకుపోవడం.

(3) ఒకరు బ్రతకడానికి మరొకరు చావడం తప్పకపోవడం. అప్పుడు ఎవళ్లు బలవంతులైతే వాళ్లు బ్రతకడం జరుగుతుంది. Survival of the fittest !

సృష్టి మొదలైనప్పటి నుంచీ ఇప్పటికీ ఈ మూడో మార్గమే - బలవంతుడే బ్రతకగల్గుతాడు అనే పథకమే - జీవధర్మంగా కొనసాగుతూవుంది. జీవ పథకం నుంచి మానవుడు వేరు కాదుగా ?

బలవంతుడే బ్రతకగల్గుతాడు అనే ఈ పథకం నుంచి మానవుణ్ని రక్షించి, మంచివాడే మనగల్గుతాడు అనే మానవతా ధర్మాన్ని అమలు పరచడానికి మతం గాని, దేవు డనబడే వాడు కాని చేసిం దేమిటి ? బలాధిక్యతకోసం కొట్లాడుకోవడం తప్ప, మరేం లేదు.

పైగా - మతానికో దేవుడు. బలాధిక్యతను పెంపొందించుకొని, తక్కిన మతాలను నాశనం చెయ్యడమే ఏ మతం లక్ష్యమైనా. సర్వమానవ సంక్షేమం కాదు.

వేల సంవత్సరాలుగా ఈ దేవుళ్లనూ, మతాలనూ చూచుకొంటూ వస్తున్నాం. అవన్నీ —

మొక్కితే దేవుళ్లు, తొక్కితే రాళ్లుగా తేలిపోయాయి. అవన్నీ పచ్చి రాజకీయాలు, పిచ్చి భ్రమలు అని స్పష్టమైపోయింది. మానవ పురోభివృద్ధికి ఇవి ఎందుకూ పనికిరావు. సామాన్య ప్రజల్ని అజ్ఞానంలో ఊరడ్రొక్కి వుంచడానికే ఇవి నిరంతరంగా కుట్రపన్నుతున్నాయి. ఇకనైనా, ఈ ప్రజాస్వామిక యుగంలో అయినా, వాటిని వదిలించుకోవడం విజ్ఞాత కాదా ?

ఏ జాతి, ఏ భాష, ఏ రంగు, ఏ మతం, ఏ పద్ధతి పాలన అనే ప్రశ్నలతో నిమిత్తం లేకుండా - ఈనాడు ప్రపంచ దేశాలన్నీ పరస్పర సంప్రతింపుల ద్వారా తమ తమ సమస్యలను పరిష్కరించుకొంటున్నై కదా ?

ఈ సహకార సమన్వయ మార్గం నుంచి మతం అనే చెత్తను తొలగించివేస్తే, మానవ పురో గతి మరీ శీఘ్రగతిని అందుకో గలదు. ఇదీ యువలోకానికి నా ప్రబోధం.

నా ఈ కావ్యలక్ష్యం

కవితకు లక్ష్యం ఆనందం. అయితే - నా రచన లన్నిటిలో వలెనే, ఈ కావ్యంలో కూడ బంగారు నగకు టంకం, రాగి మొదలైన ఉపద్రవ్యాల పొత్తు వలెనే కవితను ప్రబోధం, హెచ్చరిక మొదలైనవి అనుసరించి వుంటై.

కవిత ప్రేమ లాంటిది. తక్కిన ప్రబోధం, హెచ్చరిక వగైరా పెండ్లి, సంసారం వంటివి. పెండ్లిలో ప్రేమ లేదా అంటే - బాధ్యతలూ, విడాకులూ కూడ వుంటై. కవిత పాలెక్కువగా వుంటే కావ్య మవుతుంది. ప్రేమ పాలెక్కువగా వుంటే సంసారం స్వర్గమవుతుంది.

సర్వాంతర్యామి అయిన శక్తి వుంది. అది సజీవశక్తి. దాని పరమ పరమాణువు లన్నీ జీవ బీజాలే. నేతి నేతిగా అన్వేషిస్తూ పోయి, చివరకు మన వాళ్లు దానికి పెట్టిన పేరు పరబ్రహ్మ. ఆత్మకు జనకస్థానం కనుక దానిని పరమాత్మ అని కూడ అన్నారు. సృష్టి స్థితి లయాలు దానిలోనే జరుగు తున్నై. ఒకసారి పుట్టి గిట్టిం దేదీ మళ్లీ అదే పుట్టడం సాధ్యం కాదు. కనుక పునర్జన్మ లేదు. పనీ, ఫలితమూ జీవితంతోడివి. అవే జీవితం. శరీరాన్ని వదలి కర్మ ఆత్మను పట్టివుంటుం దనడం అజ్ఞానం. మానవులలోని హెచ్చు లొచ్చుల్ని, కష్టసుఖాల్ని చూచి, అర్థం కాక ఆదిమానవుడు కల్పించు కొన్నట్టిది కర్మ సిద్ధాంతం. ఈ సోషలిజం రోజుల్లో దానికి స్థానం లేదు.

నేను ఆనంద మనేది ఈ పరబ్రహ్మనే. పుట్టిన ప్రతి జీవి ప్రతి పదార్థమూ మృత్యువుతో తిరిగి పొందేది పరబ్రహ్మనే.

అయితే —

మృత్యువు తరువాత స్పృహ లేదు. కనుక ఆనందానుభూతి లేదు. కనుక అట్టి అనుభూతిని జీవిత కాలంలోనే, ఎరుక వుండగానే రుచి చూడాలని మానవుడు కోరుకుంటాడు. ఈ కోరిక ఎంత గాఢమైతే, తదనుభూతి అంత ప్రగాఢం.

అట్టి ఆనందానుభూతి ఆరాధనలో లభిస్తుంది. అవ్యాజ అనురాగ బద్ధమైన ఆరాధనగా వుండా లది. ఈ కావ్యంలోని రాజా రాజ్యాదలు అట్టి పరస్పరారాధకులు.

ఆరు విలాసాలు

ఈ కావ్యాన్ని ఆరు ప్రకరణాలుగా విభజించాను. వాటిని విలాసాలుగా పేర్కొన్నాను.

శివుడు నిత్య నర్తకుడు. విలాసం అంటే. అతడి నృత్యవిలాసం అనుకోవచ్చు. విలాసం అంటే చిరునామా అనికూడ అనుకోవచ్చు. మహా విశ్వానికి మానవ శరీరాన్ని ఒక చిన్న నకలుగా తీసుకుంటే – యోగ శాస్త్రాన్ని అనుసరించి – శివడు శక్తిని పట్టుకోగల చిరునామాలు ఆరు. ఈ కావ్యాన్ని ఆరు విలాసాలుగా విభజించిం దందుకే.

ఏడవ విలాసం అతడి స్వస్థానమే. ఆమె తన యాత్ర ముగించుకొని, మహా మాయను వదిలేసి, అతణ్ని చేరుకొంటే – ఆ తర్వాత లేఖలు వ్రాసుకునే అవసరమే లేదు. ఈ కావ్యమే లేఖా కావ్యం కనుక, ఈ లేఖా పారంపర్యానికి ముగింపు లేదు కనుక – ఇందులో ఏడవ విలాసానికి అవకాశం లేదు.

ఈ విలాసాల పేర్లలో, విభజనలో కూడ సూత్రప్రాయమైన వ్యంగ్యం వుంది. అభిజ్ఞులు గుర్తించగలరు.

శివం అంటే సోషలిజం అని నా వుద్దేశం. శివుడు ఒక ఆదర్శ సోషలిష్టు. సమస్త లోకాలూ సుఖ సంతోషాలతోవర్ధిల్లడం శివం. అంటే, నేటి మన వుద్దేశంలో అది సోషలిజమేకదా? క్రియా శూన్యమైన జడచేతన నుంచి, క్రమంగా కృషిమంతుడైన జీవుడు, సర్వమానవ సమతా ధర్మాన్ని ప్రవర్తింపజెయ్యడం ఈ కావ్య పరమార్థం.

సోషలిజం అని ఆధునికమైన మాటను వాడుతున్నామే కాని, సమతా ధర్మం ఆర్షమైనట్టిదే. అమలులో మహీపతులూ, మత పెద్దలూ దానిని మట్టిలో పూడ్చేసి మాయం చేసేసినా, ఆదర్శంగా మాత్రం అది అత్యున్నత పీఠం మీదనే వుంది. భారతీయమైన సనాతనధర్మం అంటే ఇదే. ఈ సత్య సుందర

మైన శివమే. మతం, దైవం, భక్తి పేరుతో జరిగిన, జరుగుతున్న మోసాలను గుర్తించి, నిర్మూలించి, తిరిగి ఈ శివాన్ని స్థాపించడమే సోషలిజాన్ని నెలకొల్పడం. కవితను అందిస్తూనే, కాంతాసమ్మితంగా నేను ప్రజలకు చేస్తున్న ఉద్బోధ ఇది.

సందేశా లిచ్చేవాడు ప్రవక్త, ఉద్బోధలు చేసే వాడు రాజకీయుడు. నినాదా లిచ్చే వాడు ఉద్యమకారుడు. పాత్రలు కల్పించేవాడు నాటక కర్త. అచ్ఛమైన కవికి ఈ వేటితోనూ సంబంధం వుండదు. కవి ఇచ్చేది ఆనందం. కవిత నుంచి ఆనందం కోరే ప్రతి హృదయమూ అతడి పాత్రే. అయితే - మౌలికంగా స్వచ్ఛమైన కవి అయివుండి, సృష్టిలోని ప్రతి వస్తువునూ, గుణాన్నీ, ఉద్యమాన్నీ కూడ తన కావ్య సృష్టికి సాధనాలుగా వాడుకో గలిగిన వాడు మహాకవి అవుతాడు. వ్యాస వాల్మీకు లిద్దరే అట్టి వాళ్లు.

ఈ శివాలకలలోని ప్రధానమైన లేఖలు పన్నెండేళ్ల నాటివైనా, ఎక్కువ భాగం శీర్షికలు ఇటీవల వ్రాసినవే. దీని ముద్రణ పూర్తి అయ్యే రోజు వరకు వ్రాస్తున్నట్టివే. అందువల్ల ఎక్కడైనా భావ సమన్వయంలో వరుసక్రమం తప్పినట్టు కనిపిస్తే, సవరించి చూసుకోవలసిందిగా సహృదయులకు మనవి.

నిరంతర న్యూసెన్సు వంటి సమాసాలు కూడ కనిపిస్తై. మోడర్నిటీ కోసం చేసిన ప్రయోగాలవి.

సాంస్కృతిక విప్లవం

సాంస్కృతిక విప్లవం కాంతా సమ్మితంగా సాధించా లనేది నా వుద్దేశం.

పరమాత్మ వున్న దనుకోవడం వేరు. ప్రతి పనికీ ఎవడో ఒక దేవుడి మీద ఆధార పడడం వేరు. వేల, లక్షల సంవత్సరాలుగా ప్రజలలో నాటుకు పోయిన భక్తి అనే ఈ మూఢ ప్రవృత్తిని నిర్మూలించా లంటే - అందుకు దౌర్జన్యం, బలవంతం పనికిరావు. వాస్తవికత, హేతుబద్ధత మీద ఆధార పడిన ప్రణయ మృదు భాషణే అందుకు ఉత్తమమైన సాధనం.

అందుకే - ఈ కావ్యంలో సాంస్కృతిక విప్లవ సాధనకు ప్రేమ లేఖలను సాధనంగా వాడాను.

భక్తి అనే పదం అనేకమైన అర్థాలలో వాడబడు తున్నది. పెద్దల పట్ల గల గౌరవానికి కూడ భక్తి అంటున్నాం. నేను వద్దంటున్నది దైవభక్తి ఒక్కటే.

పరమాత్మ ఒక విశ్వైకజీవ శక్తి. దానికి సమస్త సృష్టి ఏకరూపం. భక్తీ, ప్రార్థనా, సేవా వంటి వాటిని ప్రత్యేకంగా గుర్తించి అభిమానించే సామర్థ్యం దానికి లేదు.

విద్యార్థి ఎంత గట్టిగా కృషిచేస్తే అంత మంచి మార్కులు వస్తై. టీచరుకు సేవచేస్తేనో, లంచం పెడితేనో, ప్రార్థిస్తేనో రావు. అలా వచ్చేవి మార్కులూ కావు, అలా ఇచ్చేవాళ్లు టీచర్లూ కారు.

శరీరం హృదయం, బుద్ధి - మానవుడిలో వుండే ఈ మూడు భాగాలకూ సమానమైన పోషణ జరిగినప్పుడే అది పూర్ణజీవిత మవుతుంది. శరీరానికి అన్నం వలెనే, హృదయానికి ప్రేమ, బుద్ధికి జ్ఞానం అవసరం.

శరీర పోషణ బాధ్యత రాజకీయుడిది. హృదయ పోషణ కృషి కవిది. జ్ఞాన పోషణ విధి శాస్త్రవేత్తది. నేను ఈ కావ్యంలో ఈ త్రివిధ కర్తవ్యాలను స్వీకరించి, ప్రేమ ద్వారా మానవ దృక్పథంలో ఒక మంచి మార్పును సాధించాలని అనుకొన్నాను. నా రచన లన్నిటా కూడ ఇదే లక్ష్యం కనిపిస్తుంది - నిశిత దృష్టికు.

మానవ సమాజాన్ని నేను పులి - నక్క - గొర్రె అనే మూడు తరహాలుగా విభజించి వున్నాను కదా (గుడిసెలు కాలిపోతున్నై కావ్యసంపుటిలో పీఠిక). పులుల, నక్కల బారినుంచి విమోచన పొందడానికి నే నిస్తున్న ఈ రసాద్వైతాన్ని ఆయుధంగా ఉపయోగించుకోవలసిందిగా గొర్రెల్ని కోరు తున్నాను.

గొర్రె లంటే కేవలం కూలీలూ, రైతులూ మాత్రమే కాదు. తొంభై తొమ్మిది శాతం వోటర్లు, కళాకారులు, బుద్ధి జీవులు - అంతా గొర్రెలే, పీడితులే. ఈ అందరూ కావా లనుకొంటే - క్షణంలో సాధించగలరు సాంస్కృతిక విప్లవాన్ని.

హృదయానికి సంబంధించినట్టిది ప్రేమ . ప్రేమ , స్నేహం , అనురాగం , ఆరాధన వంటి హార్దిక అంశలు ఔన్నత్యంలో దైవ భక్తి వలె కనిపిస్తై . ఈ కావ్యంలో అట్టి వాటిని చూచి అపార్థం చేసుకో గూడదు . ప్రేమికుల భావాలు పరమాత్మను స్పృశిస్తూ పోతుంటై . గుర్తించ గలరు .

వైద్యో నారాయణో హరిః

నా జీవితంలో ఆరోగ్యం క్షీణించి " ఇక ఇవే చివరి రోజులు " అనుకొన్న సందర్భాలు రెండు . ఒకటి 1940 లో నేను మమ్మిడివరంలో టీచరుగా వుండగా . అప్పుడు నాకు కొత్త ప్రాణం పోసిన వారు కాకినాడ గాంధీనగరంలోని మునిసిపల్ ఆయుర్వేద వైద్యశాలకు చెందిన డాక్టర్ శ్రీనివాసరావు గారు . శ్రీ గెద్దాడ బ్రహ్మయ్యగారు నన్ను ఆయన వద్దకు తీసుకు వెళ్లి కూర్చోపెట్టగా , ఆయన నా నాడి చూచి నాతో అన్న మొదటి మాట " పర్వాలేదు , బ్రతుకుతావు " అని . ఆ మాటే నాకు అమృత కలశ మయింది .

అంత తీవ్రమైన పరిస్థితీ నాకు మళ్లీ ఇప్పుడు 1965 లో ఏర్పడింది . ఇప్పుడు మళ్లీ నాకు నూతన చైతన్యాన్ని ప్రసాదించిన వారు భాగ్యనగరంలోని గాంధీ ఆస్పత్రికి చెందిన ఫిజిషియన్ డాక్టర్ కుప్పచ్చి కృష్ణమూర్తి (డా . కె . కె . మూర్తి) గారు . ఆయన నన్ను బ్రతికించడం కోసమే విశాఖపట్నం నుంచి భాగ్యనగరం వచ్చారేమో అనిపిస్తుంది నాకు - నాపట్ల ఆయన తీసుకొన్న శ్రద్ధను తలచుకొన్నప్పు డెల్లా .

" ఈ పేషెంటు ఒక మహాకవి . అతడు పేదవాడైతే . అతడి బిల్లు నేను చెల్లిస్తాను " అంటూ ఆర్ . ఎమ్ . ఓ . తో ఖచ్చితంగా చెప్పి , నాకు హోం వార్డులో ఒకటో నెంబరు రూంను అలాటు చేయించి , ఆస్పత్రిలోని టెస్టు లన్నీ చేయించి , సరైన రోగ నిదానంతో ఔషధ నిర్ణయం చేసిన ఆధునిక ధన్వంతరి ఆయన . ఆ సమయంలో ఆయన చేతిలోనే కనుక నేను పడివుండక పోతే - ఈ శివాలికలు కావ్యం ప్రెస్సు దాకా వెళ్లేది కాదు . అందుకే ఈ విషయాన్ని ఇక్కడ ప్రస్తావించడం .

డా . కృష్ణమూర్తిగారిది అమృత హస్తం . ఒక్క నా విషయంలోనే కాదు . ఏ పేషెంటు పట్ల నైనా సరే ఆయన అట్టి శ్రద్ధనే చూపిస్తారు .

ఆయన చిరునవ్వుకే, చేతి స్పర్శకే, మెత్తని మాటకే రోగనివారణ శక్తి వుంది. వైద్య శాస్త్రంలో ఆయనకు తెలియని శాఖ ఏదీ వున్నట్టు లేదు. మానవ శరీరంలోని ప్రతి అణువూ ఆయన పిలిస్తే పలుకుతుంది. మానవత, మానవ సేవ రూపం దాల్చిన దయామూర్తి ఆయన. ఈ సందర్భంలో నా హృదయపూర్వక అభివందనాలను ఆయనకు అర్పిస్తున్నాను.

నేను 1973 లో హరద్వారం, హృషీకేశం వెళ్లినప్పుడు (ఈ శివాలకల పేరును మనస్సుకు తెచ్చిన యాత్ర అది) అక్కడ నా కెంతో తోడ్పడిన మాన్యులు - హృషీకేశంలోని ఆంధ్రాశ్రమం అకౌంటెంటు శ్రీ జి. నారాయణరావు గారికి, శివానందాశ్రమంలోని పార్వతీ కుటీర్ అధిపతి స్వామీ రామానంద గారికి, వారి అసిస్టెంట్లు శ్రీ పంప, శ్రీ గంగిరెడ్డి గార్లకు నేను నమస్కారాలు చెప్పవలసి వుంది. వారి ఆతిథ్యం, ప్రేమ మరుపురానివి.

పుంభావ సరస్వతి

నాకు సరస్వతి తర్వాత పుంభావ సరస్వతి శ్రీ జె. బాపురెడ్డి గారు. నా రచనలలో అనేకం వెలుగు చూడడానికి, గౌరవాలు పొందడానికి కారణం ఆయనే. ఆయన నా బహిః ప్రాణం కనుక ప్రత్యేకంగా కృతజ్ఞత చెప్పనవసరం లేదు.

ఈ కావ్యం ప్రెస్‌లో వుండగా - నా జీవితంలో నన్ను వరించి వచ్చిన అనేక అదృష్టాలలో ఒక ముఖ్యమైనట్టిది— కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఈ సంవత్సరం నాకు లభించిన వార్త. మంచి అవసర సమయంలో లభించిందిది నాకు. అందుకు కేంద్ర సాహిత్య అకాడమీ వారికీ, నాకు అనేక సంవత్సరాలుగా అనేక విధాలుగా తొడ్పడుతూ వున్న ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ కార్యదర్శులు శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికీ నమస్సులు చెప్పుకొంటున్నాను.

శ్రీ రామానుజరావు గారు ఒక సమగ్ర సర్వతోముఖ సాహితీ సంస్థ. ఒక సారస్వతోద్యమ మూర్తి ఆయన.

ముఖ చిత్రాన్ని నిర్మించి ఇచ్చిన మా చిరకాల మిత్రులు, సుప్రసిద్ధ చిత్ర శిల్పులు శ్రీ పి. ఆర్. రాజు గారికి, లలితాప్రెస్ అధిపతులు, ఆర్ష

కవితా చక్రవర్తులు శ్రీ చర్ల గణపతిశాస్త్రిగారికి, ఈ కావ్య ముద్రణకు కొద్దిగా ఆర్థిక సహాయం చేసి, కాగితాన్ని మూల ధరకు లభింప జేసిన ప్రభుత్వం వారికి, సహజ వితరణ శీలురైన శ్రీ ఎ.వి. ఆర్. గారికి, ఇంకా శ్రీ మోదుకూరి జాన్సన్, శ్రీ చిట్టిబాబు, శ్రీ కె. కోటిలింగం, డా. కొలకలూరి ఈనాక్, శ్రీ సాకపేములు, శ్రీ కె. కపాలేశ్వర రావు, శ్రీ సి. ఎల్. మిత్తల్, శ్రీ కె. సంజీవరెడ్డి గార్లకు, శ్రీ డా॥ దాశరథి, శ్రీ డా. నారాయణ రెడ్డి గార్లకు, శ్రీమతులు కె. లలిత, హైమవతి, సరస్వతి గార్లకు — ఇంకా ఎన్నోవిధాలుగా నాకు తోడ్పడిన, తోడ్పడుతున్న అనేకమంది మిత్రులకు నేను ఎంతగానో కృతజ్ఞుణ్ని.

ఇక చదవండి. ఆనందించండి. పురోగమించండి!

హిమానీ,
భాగ్యనగరం

బోయి భీమన్న

జనవరి, 1976

* *

శివాలకలు

...:(o):...

విలాసం ఒకటి

*

నిదిధ్యాసం

లోకం లోని
ఒకొక్క అమ్మా ఒకొక్క ముద్ద పెడితే
తృప్తిగా గడిచిపోతుంది నా జీవితం .

హృదయం లోని
ఒకొక్క కొమ్మా ఒకొక్క ముద్దు పెడితే
నిత్యవసంతమే అవుతుంది నా చరిత్ర .

ఆత్మ లోని
ఒకొక్క బొమ్మా తనిసి తరించేస్తే
ఆనంద బ్రహ్మనే అవుతాను నేను .

ప్రియా ! కాని —
ఆ అమ్మా , ఆ కొమ్మా , ఆ బొమ్మా
ఆ ముగ్గురూ ఒక్క నీవే అయితే ?

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

2. ప్రాపాల్మాలిక

ఏ పనీ చెయ్యాలని లేదు,
పని చేస్తేనే కాని లభించని సుఖాలన్నీ
చేతికి రావాలని కోరిక !

అసలు — కదలాలనే లేదు !
ప్రపంచ సౌందర్యాలన్నీ
పాదాల వద్ద వాలాలని తపన !

ఈ నా బద్ధకానికి కారణం —
ఆదిభిక్షువు వంశంవాణ్ని కనుకనా ?
వంశీధరుని వారసుణ్ని కనుకనా ?
కర్మ చెయ్యి అనే జాతివాణ్ని కానా ?

పుట్టిన క్షణం నుంచీ
ఏదో ఒకపని చేస్తూనే వున్నానే !
నా నుంచి అమూల్యమైన ప్రాణశక్తిని
దోచుకొనే కాదా ఈ భోగ వర్గం
ఇంతగా వొళ్లుమరచి బుసలుకొడుతున్నది ?
మరి, ఇపు డేమి టిలా అయ్యింది నాకు !

బహుశా — ఈ నాస్తబ్ధతకు
ఒకటే కారణం కావచ్చు,
అది —
నీవు దగ్గర లేకపోవడం !

3. పట్టి శూన్యాన్ని

ఇంత శూన్యుడి నేమిటి నేను !
నీవు లేకపోతే , మరేమీ ఉండదు నాకు !
అంతా శూన్యం , ఖాళీ , వట్టి బయలు !
నే నొక్కణ్నే ఎటు చూచినా !

పుస్తకాలు , కుర్చీలు , గోడలు , చిత్రాలు
వాటి నిండా ఏవేవో మూర్తులు ,
వీధిలో జనం , దుకాణాలు , రిక్షాలు , కార్లు
ఎన్నికల నినాదాలు - అంతా వట్టి శూన్యం !

నీ వున్నప్పుడు పుష్కలంగా వెల్లివిరిసే ప్రకృతి
నీవు లేనప్పుడు మ్రోడై పోతుంది చప్పగా !
నీ వొక్కతవే వసంతానంద చేతనవు
నీ రాకపోకల గతులే జీవన్మరణ రతులు !

రూపమూ , రుచీ , కళా , కాంతీ , ఏమీలేని
ఇంత శూన్యుడి నేమిటి నేను !
నీ వుంటే ఉన్నట్టూ , లేకుంటే లేనట్టూ !
నీ పై నే ఆధారపడి ఉంది నా స్థితి అంతా !

అందుకే ఎదురుచూస్తూ కూర్చున్నాను
నన్ను నన్నంతా నీతో నింపేసుకొని
శూన్యాన్ని పూర్ణాన్ని కావాలని !
చూచే దంతా పూర్ణ సౌందర్యమై విరియా లని !

4. నా పుణ్యక్షేత్రాలు

రేయి ప్రమిద నిండా తిమిరతైలం పోసి వెలిగించి,
లక్ష వత్తుల పూజ చేసుకొంటున్నది నింగి!
నింగికి కేలు మోడ్చి నిల్చున్నాను ఈ క్రీనీడలో,
దీపాభిముఖంగా నీ ముఖాన్ని వెతుక్కొంటూ!

స్కూలులో, గృహంలో, ఉద్యానంలో, యాత్రలో
లోకంలో నీ వెప్పుడు ఎక్కడ ఉన్నప్పటికీ
పూజ ఎక్కడ ఉంటే అక్కడ ఉంటావు నీవు!
నీ వెక్కడ ఉంటే అక్కడే ఉంటుంది సిద్ధి!

పూజకు పువ్వూ, సిద్ధికి దీపమూ కనుక
ఈ రెండే నీ వుండే మందిరానికి తలుపులు కనుక
అవెక్కడ ఉంటే అక్కడ ఉంటున్నాను నేను!
నీవు వచ్చేవరకూ నా పుణ్యక్షేత్రాలు అవే!

5. చిరు నామా

నీ చిరునామా చరం
నా చిరునామా స్థిరం
నా ఒక లేఖా అందకపోవచ్చు నీకు,
నా కెన్ని జాబులైనా వ్రాయవచ్చు నీవు!

నా ఉనికి నీకు తెలుసు
అయినా - నా మంచిచెడ్డలు తెలీవు!
నీ ఉనికి నాకు తేలీదు
అయినా - నీ సమాచారం తెలుసు!

ఎంత చిత్రం మన సంబంధం!
నీ - నా మధ్య వ్యాసార్ధం ఎంతో!
నీ యాత్రా పరిధి మొత్తం ఏ మాత్రమో!
మన వియోగానికి ముక్తి ఏ నాటికో!

6. తుపానుపై స్వారీ

ఎవరి చంచల దృక్కులో ఈ చంచరీకాలు !
స్వేచ్ఛగా విహరిస్తున్నై ఈ ఆరామంలో !
అవి చించుకొని వచ్చిన మబ్బు పరదా అంచే
తోటపై వ్రేలాడుతున్న ఆ ఇంద్ర ధనుస్సు !

ఎంతటి క్రూర నిర్బంధం పటాపంచలై పోయిందో —
ఉరుములు , మెరుములు , తుపాను , ప్రళయం !
అపూర్వ స్వేచ్ఛతో విజృంభించింది ప్రకృతి !
ఎంత భయంకరం ఈ సౌందర్యం !

భూమినే బంతిలా ఆడిస్తున్న ఈ స్వాతి పై
స్వారి కదలాలి ఇప్పుడు నేను !
కాక , ఎలా దొరుకుతుంది నాకు నీ ఉనికి ?
దొరక్క , ఎలా అందుతుంది నీకు నా మనికి ?

7. ముసురు పట్టిన మనస్సు

ముసురు పట్టిన చీకటి రాత్రిలా ఉంది మనస్సు !
భావం నిండా ఉరుముతున్నై మేఘాలు ,
కన్నుల నిండా మెరుస్తున్నై ధారలు ,
హృదయం నిండా ప్రవహిస్తున్నది విషాదం !

ఎందుకో ఇంత దుఃఖం మనస్సుకు ,
బహుశా - ఇది దుఃఖం కాదేమో !
అభూత మైన ఒక ఒంటరితనం
భూతంలా పట్టి ఊపేస్తున్నది నన్ను !

ఇది దుఃఖం కాకపోతే , ఆనందమా !
ఏమో — రెండూ ఒకటే పరమ స్థాయిలో ;
ఉరుములు , మెరుములు , వర్షం , తుపాను ,
చుట్టూ చీకటి , భయం , భ్రాంతి !

నా దైన ఒక నీవు నాకున్నా వన్న మెరుపు ,
నీవు దగ్గర లే వన్న పిడుగు ;
లోన గుబులు , బైట ఏవో నీడలు !
మృత్యువు కంటె భయంకర మైన ఒంటరితనం ;

ఎలా వున్నావో తోచని ఆందోళన ,
ఎప్పుడు వస్తావో తెలియని అంధకారం !
చెదిరిన ఊహలు బెదిరిన జనం లా
త్రొక్కుకు పోతున్నై చీకట్లో ఒండొంటిని !

ఉల్లోల కల్లోలంగా ఉంది మనస్సు ;
ఊహలు కూడ గడ్డకట్టుక పోయే
మంచు గుహలాంటి ఈ ఒంటరి తనం
ఇంకా ఎంత కాలమో నాకు !

8. చీకటి వెలుగులు

వెలుగు లేక పోవడం చీకటి
చీకటి లేక పోవడం వెలుగు.

వెలుగును చీకట్లోకి తేగలం
చీకటిని వెలుగులోకి తే లేం,
వ్యక్తిత్వం వెలుగుకు వుంది
చీకటికి లేదు.

వెలుగు స్వయంభువు
అది భూమికి అతీతం,
చీకటి ఒక నీడ
అది భూమి స్వయం ఛాయ.

వెలుగు పరాఙ్ముఖ మైతే
భూమికి తన నీడే తన చీకటి.
వెలుగు ఆరిపోతుంది
ఆరి ఎక్కడికి పోతుంది ?
అక్కడే వుంటుంది.

చీకటి వెలిసి పోతుంది
ఎక్కడికి పోతుంది ?
వచ్చి పోయే పదార్థం కాదది.
అదొక లేని స్థితి
వెలుగు లేని స్థితి.

వెలుగు ఆరిపోయి
చీకటి కూడ వెలిసి పోతే —
ఆ తర్వాత ఏమిటి ?
అలా వదిలేస్తే వ్యంగ్యం,
అది నేనే అంటే వాచ్యం !

9. ఆనంద కేంద్రం

ఈ మామిడికొమ్మ క్రొంజిగురు హస్తం నుంచి
మధువు క్రోలుతున్నది నేను,
నీ కంఠం రుద్ధమై పోతున్నదెందుకో !

ఈ వేపకొమ్మ పూరావాయులు పూల చీర వెనుక
ఎంత చేదైనా ఉండనీ,
నీ పెదవిని తలచుకొంటే పోదా ?

ఈ మల్లెమొగ్గల బుగ్గలు,
ఈ గులాబి పూల గుబ్బలు,
ఏ కొమ్మవైనా ఎంత హాయిగా ఉన్నై !

ఈ కొండ కొమ్మ మొనలు కూడా
పదునెక్కినై ఈ వసంతోదయంలో,
మదన సంవదనం ఈ రాతిమదం !

ఎంత సౌందర్యం, ఎంత శృంగారం, ఎంత రసం
నా చుట్టూ, నా ఒళ్ళో, నా నిండా !
ఎంత ఆనందంలో ఉన్నాను నే నిప్పుడు !

ఈ మాధుర్యా లన్నీ అందరివీ నా ?
ఒక్క నీవే ఇన్ని రూపాలవో !
అందుకే నేమో నాకింత పారవశ్యం !

10. దీర్ఘ రాత్రులు

నీ వలా వెళ్ళావో , లేదో –
ఇలా వచ్చేసింది హేమంతం !
గాఢంగా పట్టేసుకొంది నన్ను తన కౌగిట్లో .

ఏది సూర్యబింబమో , ఏది చంద్రబింబమో
ఏది వెన్నెలో , ఏది పొగమంచో ,
ఏది నిద్రో , ఏది మెలకువో – అంతా చలి !

మరుగుతున్న నీళ్ళకు వెచ్చదనం లేదు,
మంచు నాలికలా కదులుతోంది చలిమంట!
అసూయలా కరుస్తోంది గాలి!

తూర్పుకు చూచి - ప్రొద్దుపొడిచిన సంతోషంతో
పడమటికి చూచేటప్పటి కది కుర్రింకే పోతున్నది
అస్తగిరికి పూర్వగిరి చేసిన గోలు లా!

తూర్పు విసిరిన రవి అనే కంకర్రాయి తగిలి
పడమర ముఖం చిట్లి చిందుతోంది నెత్తురు!
దాని చుట్టూ మూగినై ఈగల్లా మబ్బులు!

నా చుట్టూ వరికుప్పలు, పైరుచేలు, బంతిపూలు,
మంచు దుప్పటి ముసుగు నిండా చలి!
నీవు లేని రాత్రుల కీ దీర్ఘత్వం ఏడవనా?

వెన్నెలతో వెళుతూ అన్నావు—
వసంతంతో వచ్చేస్తా అని!
అందుకే ఇంకా ఈ జీవ న్నిరీక్షణ!

11. భావోత్సేకం

భయంకర మేఘ తరంగాల గర్జనలతో
ఆకాశం ఉద్రూత లూగు తున్నపుడు
చెలరేగిన తుపాను గాలిపై స్వారి కదిలి
నీ నిజసౌందర్యం చూడాలి నేను .

మెరుపు కన్నెల తాండవాల పై
మీన మేషాల ఉరుకులు ,
అట్టహాసాలు , వడగళ్లు , ధారా వృష్టి ,
వరదలు , ఉప్పెనలు , ప్రావృ ణ్మహా విలయం !
సమస్తాన్నీ రెచ్చగొట్టే ఈ ఝంఝూ వాయువులు
నా ప్రాణ వాయువులే కావాలి నాకు !

విశ్వాన్ని చుట్టి , నీకొక ప్రదక్షిణం చేసేసి ,
మళ్ళీ హాయిగా నీ ఒడిలో వాలి ,
నీ ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో పరిమళిస్తూ ,
నీ హృదయంగా స్పందించాలి నేను !

12. ఎవరి చుట్టూ ఎవరు

నే నిక్కడ కూర్చుని
నీ చుట్టూ తిరుగుతున్నాను .
నీవు మీ అవ్వతో
భూమిచుట్టూ తిరుగుతున్నావు .

భూమి చుట్టూ తిరిగేది మరొక టుంది ,
అది జాబిల్లి .
నీ వంటిదే జాల్లి ,
అది నా హృదయం !

నీవూ , జాబిల్లి , నా హృదయమూ
ఈ మూడూ త్రిమూర్తులు !
మళ్ళీ కవిత్వంలోకి జారి పోతున్నా నే—
విజ్ఞానం మీదికి ఎక్కిపోదా మనుకొంటూ !

మన ముగ్గురికీ ఆధార మైన భూమి
సూర్యుడి చుట్టూ తిరుగుతూ వుంది !
వా డొక చండ శాసనుడు !
వాడు తన గ్రహాలతో , ఉపగ్రహాలతో
రాజు వెడలె అన్నట్టు బైలు దేరాడు
పగటి వేషం కట్టి !

ఈ పగటి వేషగాడు
నిజంగా రాజే అనుకొన్నా ,
అత గాడు -
మరి ఏ మహారాజుకు సామంతుడో !
ఏ చక్రవర్తికి బానిసో !
కా కుంటే -
తన అనుచర వర్గంతోపాటు
చెమట్లు కక్కు కొంటూ
ఆ పాల పుంతలో పడి
సెకండుకు పన్నెండు మైళ్ళ చొప్పున
ఎందు కలా పరిగెడ తాడు ?

ఎక్కడి కా పరుగు ?
అభిజిత్తు కోసమా ?
ఆమె చంద్రుడి కోసం
శాశ్వత తపస్సులో మునిగి పోయిన
పరమ సమాధి గత ప్రియురాలు కదా ?

ఆమెను పునః జాగృతను చేసి
చంద్రుడికి అప్పగిం చేసి —
అక్కడితో ఆగి పోతాడో
ఇంకా ముందుకు సాగి పోతాడో తను !

ఈ సూర్యుడు
మరెవరి చుట్టూ తిరుగుతున్నాడో !
ఆ ఎవరు
ఇంకెవరి చుట్టూ తిరుగుతున్నాడో !
ఇలా ఈ తిరగడాలకు
అం తెక్కడో !

దేవీ , రాజ్యదా !
నా ప్రణయ సామ్రాజ్యదా !
ఈ సూర్యుల , అతిసూర్యుల , మహాసూర్యుల ,
ఆ మీద వాళ్ళ, ఆ పై వాళ్ళ ,
ఆ పైని ఇంకేమీ లేదను కొన్న పరమాత్మ కూడ
నిరంతరంగా ప్రదక్షిణలు చేస్తున్న దెవరికి ?

నీవు పుణ్య క్షేత్రాల చుట్టూ తిరుగుతూ వుంటే -
నీ చుట్టూ నేను తిరుగుతూ వుంటే —
నాతో పాటు ఈ సమ స్త విశ్వమూ
తిరుగుతూనే లేదా ?
సమస్తానికీ నేనే కేంద్రం అనుకొంటుంటే
నీవే నాకు కేంద్ర మైనా విప్పుడు !

13. మన మధ్య దూరం

ఎక్కడ ఉండి ఉంటా విప్పుడు నీవు ?
మదుర మీనాక్షి గుడిలోనా ?
పాపనాశం జలపాతం ఒడిలోనా ?

ఎక్కడి దీ అగరు దీప విస్ఫులింగం ?
ఎక్కడి దీ చైతన్య సుధా శీకరం ?
నీ దేహంపై త్రుళ్లిన భక్తిభావ స్పందనమా !

దగ్గర ఉంటే—నా బైటే ఉంటావు నీవు,
దూరంలో ఉంటే-నా లోపలే ఉంటావు నీవు !
నాలో నా నిండా ఉన్నావు నీ విప్పుడు !
ఇప్పుడు మన మధ్య దూరం ఒక పెద్ద జీరో !

14. ముద్దులతో అద్దరికి

అ ద్దరిని నీవు , ఇ ద్దరిని నేను
మ నిద్దరి మధ్యా ఈ వ్యథా తరంగిణి !
ఈ దుర్భర వియోగ తటోపవిష్టుల మై మనం
వేస్తున్నాం తాళం ఈ తరంగ మంజీరాలకు .

ఈ తరంగాలకూ , మన అంత రంగాలకూ
అనుబంధం ఏమిటో !
ఆద్యంతాలు లేని ఈ జీవ స్రవంతికి
తీర ప్రతీరా లెటువంటివో !

ప్రవాహం ఏకతీరం ఎలా అవుద్ది ?
కాక—మనం కలుసుకోవడం ఎలా జరుగుద్ది ?
నీవో , నేనో తెగించి
నది కడ్డపడడం తప్పదో ఏమో !

ఇదిగో—ముద్దులతో పంపుతున్నాను
ఈ లేఖా రూప రాజ హంసలను ,
ఇవి శివాలకల నుంచి జారిన ధారల లా
కలిసి ప్రణయ గంగా లహరే కావా లని !

అనుక్షణం హంస వాహనవై నీవు
నా మానసం లో విహరిస్తూ వుండా లని !

15. అలసి పోయిన దైవం

ఓం నమశ్శివాయ అనుకొంటూ
కళ్ళు తెరిచి నీ ముఖమే చూశాను నేను
గోడ మీది శివుడి పటం ముఖంలో !

సమాధిలో ఉన్న పరమ శివు డతడు ,
సతిపోయి , హైమవతి రాని మధ్య కాలంలోని
ఆత్మీ భూత నిస్సంగ లింగమూర్తి అది !

శివుడిలో అంతర్భూతమై ఉన్న శివ
కోటి మెరుపులు మెరుస్తున్న దతడి ముఖంలో !
అందులో ఏ మెరుపో తళుక్కు మనిపించింది నిన్ను !

బహుశా , అర్చన చేస్తూ ఉండి ఉంటావు నీవు
ఈ సమయంలో ఏ అమృత లింగేశ్వరుడికో
ప్రజ్ఞాన పరమేశ్వరి వై !

లేక—ఉపచారమే చేస్తున్నావో అరుంధతిలా
మునిపల్లెలో అసూయలకు గురై
అలసి పోయిన దైవానికి !

కనిపించే దేన్నీ
ఖాతరు చెయ్యడు మానవుడు ,
దైవమే కానీ , దెయ్యమే కానీ !

తనకు పోటీ వస్తే , ముక్కంటి నైనా సరే
ఎదిరించడమే మానవ నైజం !
ఏ ప్రాణి నైజమైనా అదే !

లేస్తూనే నీ ముఖం చూశాను ,
ఇక నాకు కాలక్షేపాని కేం కొదవ ?

16. ఈ ప్రతిమ లన్నీ

మనం కలిసి ఉన్నప్పు డనే దాన్ని కదా -
ఎక్కడికో వెళ్ళి పోతాను నేను
ఇక చచ్చినా తిరిగి రాను - అని ?

ఎడబాసి ఉన్న ఇప్పు డనుకొంటున్నాను
ఎన్ని కష్టా లైనా భరించ గలను
నిన్ను విడిచి మాత్రం బ్రతక లేను - అని !

నా కోసం తపస్సు చేసుకొంటూ నీవు
నీ కోసం ప్రసాదాలు సేకరిస్తూ నేను
మ నిద్దరం తప్ప మరేముందీ లోకంలో ?

నిన్ను విడిచి యాత్రేమిటి , నా ముఖం
ఈ క్షేత్రాలలో ఇంతమందీ వెదికే దెవర్నో తెలుసా ?
నేను వదిలేసి వచ్చిన నిన్నే !

నీ నుంచి బైలుదేరి , నీ కోసం వెతుకుతూ
ఎంత కాలం సేవిస్తాం ఈ నీ ప్రతిమలను ?
నా యాత్రకు ఆది వలెనే అంతమూ నీవే !

17. మనం ఇద్దరం

మనం కలిసి ఉన్నప్పుడు
రెండు శరీరాలు మాత్రమే మనం,
మనస్సు, ఆత్మ, హృదయం అన్నీ
శరీరంలో లయమై పోతై.

మనం ఎడబాసి ఉన్నప్పుడు
రెండు ఆత్మలం మనం,
మనస్సు, శరీరం, హృదయం అన్నీ
ఆత్మలో కలిసి పోతై.

సంయోగంలో శరీర సుఖం ఉంది!
వియోగంలో ఆత్మోత్తేజం ఉంది,
ఇప్పుడు మన ఇద్దరిదీ ఒకే ఆత్మ!
ప్రణయ మోహనమైన పరమాత్మ!

శివాలకలు

...:(o):...

విలాసం రెండు

*

సృష్టి — కళా సృష్టి

ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరైనా
ఐశ్వర్య గర్విష్ఠులై పొంగడం చూచి నప్పుడు
రాజసూయ వైభవం జ్ఞప్తికి వస్తుంది నాకు :

దాని శిఖరాయమానత మయసభ !
మయ సభ మాయా జూదమై
అరణ్యాల పాలై పోయింది, పాపం !

అది మయసభ దోషం కాదు,
అహంకార గర్వాతిశయ విశేషం అది !

విశ్వ కర్మతో పోటీపడి
అమర పురికి ప్రతిగా
ఒక అమరికా నే సృష్టించినవాడు మయుడు !

అమర - సంస్కృతం
అమరిక - సంస్కృతమే కాదు , తెలుగు కూడ !
అందుకే , అనిపిస్తుంది నాకు —
మయుడు నా వాడు
అమెరికా నా పిత్రార్జితం అని !

నీవు చూసేవుంటావు పత్రికలలో ఈ మధ్య
అమెరికాలో అనేక ప్రాంతాలలో వెలువడిన
మయకళా శిథిలావశేషాల ఫొటోలు
పోల్చుకోనే వుంటావు అందులో
నా సనాతన బహుముఖత్వాన్ని !
ఆ ప్రక్క —
నీ నిత్యాధునాతన లీలా సాహచర్యాన్ని

నే నొక మొరటు పల్లెటూరి రైతును
ఆ నాటి నుంచీ - ఈ నేటికీ కూడ !
నా చుట్టూ మొలకెత్తే , పల్లవించే ,
పరిమళించే , ఫలించే సస్యదేవివి నీవు !
నేను స్థిరం - నీవు చరం
మన చిరునామాల వలె !

కళాప్రమత్తత, రసోన్మత్తత, ఐశ్వర్య మత్తత
ప్రతి వ్యక్తికీ వుంటై జన్మహక్కులై !

హక్కు అమలు జరిగేది శక్తిని బట్టి కనుక —
శక్తి అంటే ఈ నాడు
భుజ బలమో, ధన బలమో కనుక —
కేవలం రసస్పృష్టే మూలబల మైన శిల్పి
బాహ్యాలోకాన్ని ఉపేక్షిస్తాడు కనుక —
హక్కనేది అర్హుడి దాకా రాదు !

శక్తి వుండీ, అన్యాయాలకు గురైన వారికి
పండిన పైరై వుండీ, పురుగులకూ
పశువులకూ దాసోహం అనవలసిన వారికి
అండగా నిల్చిన ప్రజాశిల్పి మయుడు !
సృష్టికి ప్రతి సృష్టి చేసి
కళానందం సమంగా పంచిన నిరామయుడు !

నా కనిపిస్తుంది —
మయుడు నాలో తన్మయుడై ఉన్నాడని !
నీవు అలా అమెరికా వెళితే
ఆ అమృత కళా సువాసనల్ని క్రోలి రా !
అయినా—
మీ అవ్వకదా నీకు లీడరు !

19. తలుపు తట్టిన ఉదయం

ఇంకా ప్రొద్దు పొడవక ముందే
తలుపు కొట్టా రెవరో !
విసుక్కొంటూ లేచి వెళ్లాను ,
కళ్లు నలుపుకొని చూశాను—
"మరిచావా ?" అన్నా డతడు !

"అబ్బే ! ఎక్కడి నుంచి రాక ?
రండి !" అంటూ వెను తిరిగాను,
పుస్తకాల గది చూపాను.

చిరిగిన మాసిన ముతక ఖద్దరులో
ఎవరీ అస్థిపంజరం ?

జ్ఞాపకాల పుటలు వెనక్కి
సెకండుకు శతకాలుగా తిరిగి పోతూ—
పడింది ఒక పుట వద్ద బ్రేకు !
అతడా ఇతడు !

" నీ ధోరణి నన్ను మరిచా వంటున్నది,
నీ దుస్తులు ఖద్దరు మానా వంటున్నవి "
అన్నా డతడు అక్కడ కూర్చోక ,
నా వెంట పడకగదిలోకి వస్తూ !

చదువు మానేసి , సంపదకు సత్రం కట్టి ,
జైలే ఇల్లుగా గడిపిన గాంధేయుడు
స్వాతంత్ర్యోద్యమ యోధుడు ఆ నాడు —
సర్వోదయ నాయకు డీ నాడు !
పాపం అనిపించిం దతణ్ని చూస్తే !

నేనూ సర్వోదయ వాదినే చిన్నప్పుడు ,
నా సర్వోదయం మేటి సోషలిజం !
నాటు సన్యాసం కాదు .

మహాత్ముడే బ్రతికి వుంటే —
ఈ మహాయోధుల్ని ఇలా మరగనిచ్చే వాడా ?

పారిశ్రామిక రంగంలో ఒక ప్రక్క
పరమాణువులపై స్వారీచేస్తూ కూడ
ఇలా ముతకగానే బ్రతక మనేవాడా ?

2

" దేశం కుక్షింభరుల చేతిలో పడి ,
ప్రజలు గడ్డికూడ దొరకని గొర్రెల్లా చస్తుంటే
ఇంకా కలమూ, కవిత్వమూనా ?
ఈ నిరక్షరాస్యుల ప్రజాస్వామికంలో
కలాలు కత్తు లెలా అవుతై ?
పారెయ్యండి కలాలు !
పట్టండి కత్తులు ! " అంటూ
బాకులా దూసుకు వచ్చా డంతలో
బ్రేకులా నిలబడి పోయాడు గుమ్మంలో !
ఎవరు ? మిత్రుడు — విప్లవుడు !

కళ్లల్లో కళ్లు గ్రుచ్చుకున్నారా ఇద్దరూ,
సర్వోదయుడు నిస్తేజంగా నవ్వాడు !
విప్లవుడు నిర్జీవంగా ఉరిమాడు !

తమాషా ఏమి టంటే —
ఈ ఇద్దరూ ఒకే అగ్రవర్గం వాళ్లు !
ప్రజ లంటే ఏమిటో
ప్రత్యక్షంగా ఎరగని వాళ్లు !

3

ఇంతలో మోగింది కారు హారను గేటు వద్ద ,
లోనికి ప్రవేశించాడు సమయోచితుడు !
నమస్కరించా డా ఇద్దరికీ —
కూర్చున్నాడు వచ్చి నా పక్క మీద !

"నీవు ఎనిమిది గంటలకు కాని లేవ వని తెలుసు
అయినా — ప్రొద్దుట్నే రాక తప్పింది కాదు ,
ఎన్నికల హడావిడి కదా ?
త్వరగా తెమలు !
బైటికి పోదాం !" అన్నా డతడు !

నిజమే అనిపించింది నాకు !
సర్వోదయమూ , విప్లవమూ ఎప్పుడూ వుండేవే ,
అవి ఆద్యంత రహిత జీవబ్రహ్మలు !

దైనందిన జీవితం రాజకీయం ,
నేటి రాజకీయాలు ఎన్నికలు !
ఎన్నికల కున్న జరూరీ
తక్కిన వాటికి వేటికీ లేవు !

4

సర్వోదయం పాతచింతకాయ పచ్చడి ,
విప్లవం గాదెలో ధాన్యం ,

ప్రజాస్వామికం తీరిక లేని పని,
ఎన్నికలు వేడి వేడి ఇడ్లీలు!
దేశ కాల పాత్ర సమౌచిత్య జ్ఞానమే
దేశ కాల పాత్ర సమౌజ్జ్వల్య జీవితం!

నా ప్రస్తుత జీవితం
హోటలు తిండీ, మఠం నిద్రే కనుక —
ఈ మన మఠం
కేవల బృహదారణ్యకమే కనుక —
ఆ ఇద్దరు మిత్రులకూ
తాళం చెవులు ఇచ్చేసి —
చేనేత గళ్ళలుంగీ మీదే
వంకీ మీది టెరిలిన్ షర్టు తగిలించుకొని
బైలుదేరాను సమయోచితుడితో
బైటి ప్రపంచం లోకి!
ఎంత చిత్రమైన ఉదయం!

20. చుట్టూ వున్న లోకం

నీ వున్నప్పుడు నీతో
నీవు లేనప్పుడు నీ చింతనతో
ఆనందిస్తూ కూర్చోవడమే నా జీవితం !
అవును , అదే జీవితం —
నీ లాంటి ప్రియురాండ్రు కల
నా లాంటి అదృష్టవంతులకు .

అయితే —
మన చుట్టూ వున్న లోకం
ఎవర్ని బ్రతక నివ్వదు సుఖంగా !
భక్తుణ్ని భగవంతుడి ద్వారా
పతివ్రతను రౌడీ ద్వారా
రచయితను పబ్లిషరు ద్వారా
అలాగే ప్రతి ఒక్కరినీ
ఏదో ఒక వైరస్యం ద్వారా
ప్రాణం తీసేస్తుంది , తినేస్తుంది లోకం !

సుఖంగా తింటూ , తాగుతూ
నిన్ను గురించే ఆలోచించుకొంటూ

ప్రేమ తపస్సులో మునిగి వున్న నన్ను
పొగడ్త అన్న ఒక మోహనాస్త్రం
విసిరేసింది ఎన్నికల దుమారం లోకి—
నా లాంటి, నీ లాంటి, మీ అవ్వ లాంటి
లక్షల మంది ప్రజల్లోకి, వాళ్ళ అజల్లోకి!

"ఎన్నికలలో ఎన్ని కలలో!"
అన్నాడు బాపురెడ్డి!
నిజంగా కలల్ని కట్టెదుట చూడా లంటే
ఎన్నికల లోనే చూడాలి!

ప్రేతాత్మల్లా, నిశాచరుల్లా, దెయ్యాల్లా
దేవదూతల్లా, అప్సరసల్లా, కామినీపిశాచాల్లా
ప్రతి మనిషినీ పట్టి వుండే కోట్లాది కలలు
అట్టహాసంతో బైటికి దూకేసి
భయంకర నగ్న సంకుల తాండవం
చెయ్యడం ప్రత్యక్షంగా చూడా లంటే
ఎన్నికల సమయంలో ప్రజల్లోకి వెళ్ళాలి
అభ్యర్థిగా కాదు, అభ్యుదయ వాదిగా.

కలలెన్నైనా, ఎలాంటి వైనా, అవన్నీ
వట్టి కావ్యాలంకారాలు మాత్రం!
వాస్తవాను భవాలే జీవితం!
ప్రజల జీవితాలు
ఊహల కందని నిజాలు!

21. ప్రగతి స్వభావం

రోడ్డు ప్రక్క పడివున్న దొక కారు
దాన్ని చూచి వెక్కిరిస్తూ పోయిం దొక బస్సు,
స్టాండులో ఆగిన బస్సును దాటేసి
రొమ్ము విరుచుకొని పరిగెత్తిం దొక రిక్షా !

గొలుసు ఊడి ఆగిపోయిన రిక్షాను
హేళన చేస్తూ ఒక పాదచారి
ముందుకు నడిచి పోయాడు,
దేవు డిచ్చిన కాళ్ళకు మొక్కుకొన్నాడు !

అంతలో అతణ్ణి దాటి రిక్షా
రిక్షాను దాటి బస్సూ, బస్సును దాటి కారూ
వెళ్ళిపోయాయి రివ్వున దూసుకొంటూ !
నడిచిన దగ్గరే నడుస్తున్నాడు మన పాదచారి !

22. సౌఖ్యమేనా

"సౌఖ్యమేనా ?" ఒకరి ప్రశ్న
"మీకేం లెండి !" మరొకరి వ్యాఖ్య !
ఎంత బెంగతో చస్తున్నానో నేను
ఎలా తెలుస్తుంది ఈ నేస్తాలకు ?

నిజంగా సుఖం ఉందా లోకంలో ?
కనిపించే వెన్నెల వెనుక చీకటి లేదా ?
చిరునవ్వులు చిందించే ప్రతి వ్యక్తీ
చిదానంద మూర్తేనా ?

ఆకల్నీ, బాధనీ, బెంగనూ, దుఃఖాన్నీ
ఆశల ముసుగుల్లో జోకొట్టి నిద్రపుచ్చే
నివురు కప్పిన నిప్పులు ఈ బ్రతుకులు !
కగ్గి మగ్గి పోవడమే నేమో సుఖ మంటే !

భగవంతుడికే ఉందా సుఖం నిజానికి ?
ఎన్ని రకాల మతాలు, ప్రార్థనలు, ఫిర్యాదులు
ఎన్ని పోటా పోటీలు, కుట్రలు, హత్యలు !
ఎంత నెత్తురు, కన్నీరు, బాధ !

నలుసంత భూగోళంపైనే ఇంత రగడైతే
అంతలేసి తారా గ్రహకక్షల్లో ఎంత నెగడో !
నలుగురు పిల్లల్ని సంబాళించలేం మనం ,
ఇంత విశ్వాన్ని ఎలా నిర్వహిస్తున్నాడో అతడు !

ఇక్కడ ఏ ఇద్దరు కొట్టుకొన్నా బాధలేదు
అక్కడ ఏ రెండు గోళాలు గుద్దుకొన్నా విలయమే !
ఇక్కడ ఏ నాయకుడు ఓడినా లెక్కలేదు ,
అక్కడ ఏ తార ఊడినా — కాలాంతమే !

నిద్రపడుతున్న దంటావా విశ్వనాథుడికి ?
ఎంత తలనొప్పితో బాధ పడుతున్నాడో పాపం !
"సుఖంగా ఉన్నావా ?" అంటే ఏ మంటాడు ?
"నీ ముఖంగా ఉన్నాను" అనడా తలపట్టుకొని ?

అలా చూడు పైకి ఆ రోదసిలోకి !
ఆకాశగంగా , పాలవెల్లీనా అది ?
తలపోటు భరించలేక సృష్టికర్త
తలచుట్టూ బిగించుకొన్న తుండుగుడ్డ అది !

ఎవరికీ లేదు సుఖం లోకంలో
ఉన్నదంతా పని , భారం , బాధ , బాధ్యత !
ఆ నిశ్వస్రష్టకే లేని సౌఖ్యం
ఎక్కడ నుంచి వస్తుంది మనకు మాత్రం ?

23. నాతో స్నేహం

నాతో సాన్నిహిత్యం పెంచుకోవా లనుకొనే
కొంతమంది రసహృదయులు తప్ప
స్నేహితు లెవరూ లేరు నాకు .

నాకు నేనై ఎవరితోనూ స్నేహం చెయ్యను ,
కలిగిన స్నేహాల నైనా పెంచుకోలేను ,
అందుకాకారణం తీరిక లేక పోవడం !
నీ స్నేహంలో , నీ ప్రేమలో , నీ ధ్యానంలో
నిత్యం మునిగి పోయి ఉండడం !

నేను—మొన్న ఒక మిత్రు డన్నట్టు—
కాలం దృష్టిలో లోభిని
ప్రేమ దృష్టిలో స్వార్థపరుణ్ని
హృదయం దృష్టిలో దొంగను
రస దృష్టిలో తాగుబోతును
డబ్బు దృష్టిలో దుబారాను
రాజకీయ దృష్టిలో జడుణ్ని !
కావచ్చు—

నేను నేనుగా ఉన్నంత కాలం
ఎవ రేమనుకొన్నా బాధ లేదు .

24. ఒక్క పేజీ కోసం

నా కోరిక ఒక చెక్కిన పెన్సిలు,
నీ ఉనికి ఒక చిక్కని పేజీ!
ఈ మొదలూ, తుదీ లేని పుస్తక ప్రదర్శనంలో
అది ఏ పుస్తకమో! ఏ పేజో!

ఎంత దర్శనీయంగా వుంది ప్రదర్శనం!
హేమంత నిశీధంలో
మనోహర తారా పథంలా వుంది!

వసంత ప్రత్యూషంలో
ఉరుముల , మెరుముల
ఝుంఝూ జీమూతంలా వుంది !

పాపం—
ఈ దర్శ నాపేక్షక జన సందోహం
ఉన్ని దుప్పట్ల క్రింద సురక్షితులు ,
తాటాకు గొడుగుల క్రింద సంకుచితులు !

నాకు మాత్రం ఈ ప్రదర్శనం
పుష్ప ఫలోద్యానంలా వుంది !
ఎన్నిరకాల పుష్పాలు ! ఫలాలు ! మధురసాలు !
వాటిని చూస్తేనే—మత్తెక్కి పోతున్నది !

నా కున్నవి రెండే కళ్ళు—
ఒకటి తుమ్మెద , ఒకటి చిలుక !
ఎన్ని పువ్వుల్లో నిన్ను వెదకాలి ?
ఎన్ని ఫలాల్లో నిన్ను పట్టాలి ?
ఎన్ని సౌందర్యాల మధ్య నిన్ను నిలపాలి ?

కేవలం ఒక పాతిక అక్షరాలతో
ఇన్ని గ్రంథాల పుట్టుకా ?
వట్టి మూడురంగుల కలయికతో

ఇన్ని మనోమోహన ముఖచిత్రాలా ?
అందులో ఏదో ఒక పేజీ కోసం
ఇంత ఎడతెగని అన్వేషణా ?

తుమ్మెద దశావ తారా లెత్తగలదు ,
చిలుక సహస్ర శీర్షే కాగలదు , కాని
ఇది విష్ణు మాయా ? శివ మాయా ?
ఏ మాయా లేని ఒక పేజీలో
మాయా తీత వైన నీ కోసం !

సరే—కానీ—
అది ఏ వర్గంలో ఏ షెల్ఫులో , ఏ గ్రంథంలో
ఏ పేజీ అయినా అవనీ—
నా కోరిక ఒక చెక్కిన పెన్సిలు
ఎక్కడో ఒకక్కడ నిన్ను పట్టుకొని
టిక్కు పెట్టుకోకుండా వుండదు !
అందుకు కాకపోతే
ఎందుకు ఇంత ప్రదర్శన ?
ఎందుకు ఇంత అన్వేషణ ?

25. శిల్ప లేఖ

శిల్ప కన్య నై ఉంటే !
ఏ పుణ్య క్షేత్రంలోనో
నే నొక శిల్ప కన్యనై ఉంటే !
ఎంత బాగుండును !

సామాజిక విధి నిషేధాలు
సుఖ దుఃఖాలు , హాని వృద్ధులు
జరా మరణ వేదనలు కూడ లేకుండా
దివ్యంగా జీవించే దాన్నికదా ?

ఏ అజంతా గుహో
ఏ సాలర్జంగు మ్యూజియమో
ఏ కాళహస్తీశ్వరు గర్భగుడో
నీ పాదాలను నా బ్రతుకు దాకా చేర్చేది !

దేశ దేశాల కళా పిపాసువులు
ఆర్ద్ర దృక్కులతో నన్ను చూస్తూ ఉంటే
నేనూ ద్రవించి పోయే దాన్ని ,
నీ దాకా ప్రవహించి వచ్చే దాన్ని !

ఏ అమరావతి రాళ్ళ గుట్టలోనూ
పుట్ట లేక పోయాను !
ఏ ఉద్రిక్త భావశిల్ప కంటా
పడలేక పోయాను !

ఏ బాల బ్రహ్మ చేతికి చిక్కి ఉన్నా
ఏ కళాభి రాముడి కాలికి తగిలి ఉన్నా
ఏ అపూర్వ శిల్ప సుందరినో అయి
నీ చూపుల్ని నాపైకి లాక్కొనే దాన్ని .

ఒక్క సారైనా నా వక్షం పై పడేది నీ చెయ్యి !
ఒక్క గీత మైనా పాడేది నీ ఆత్మ నా గురించి !
ఏమీ కాలేక పోయాను నేను ,
ఏమీ కాలేక పోయాను నీకు !

26. అన్నీ అద్దాలే

అలా ముందుకు సాగి పోతూ—
తక్కున ఆగి పోయాను నేను !
నే నెంత పని తొందరతో , తొందరతో ,
ఎందరితో ముందుకు పోతున్నా—
నా కళ్లు మాత్రం ఇటూ , అటూ
పక్క చూపులు చూస్తూనే వుంటై !

నా జీవితానికి నా కళ్లు
జగ జ్జీవితానికి సూర్య చంద్రుళ్ళు !
నిజానికి - నాలో
ప్రతి అణువూ ఒక కన్నే !
లేక పోతే —
ఈ రద్దీ సిటీ రోడ్ల మీద

ప్రాణాలతో ఎలా
ప్రయాణం చెయ్య గలుగుతున్నాను ?

ముందుకు దూసుకు పోతూ
హఠాత్తుగా ఆగి పోయాను కదూ ?
ఎందుకు నే నాగింది ?
ఏ పక్కనో , ఏ అందమో
నా కన్నుతో కన్ను కలిపిం దన్న మాట !

జన ప్రవాహం మధ్యలో
తక్కున ఆగితే —
జనం పడదోసుకు పోదా ?
పడకుండా నన్ను పట్టుకొన్న దెవరో ?
పక్కకు ఒరిగి నిలబడి —
పరికించి చూశాను !
నవ్వాగ లేదు నాకు !

జరిగిం దేమిటో తెలుసా ?
అక్కడ నన్ను చటుక్కున ఆకర్షించి
గబుక్కున నిలబెట్టిన దెవరో తెలుసా ?
ఆ పక్క ఫర్నిచరు షాపులో
ఒక బీరువా నిలువు టద్దంలో
తళుక్కు మన్న —
నా ప్రతి బింబమే !

27. నిత్యకాష్ఠం

" ఇచ్చేవాడు మీ నమ్మిన బంటు
ఆ పై వాడు మీ ప్రియ శిష్యుడు
ఆ పై వాడు మీ చిరకాల మిత్రుడు
ఆ పై వాడు మీ దగ్గరి బంధువు
ఆ పై వాడు మీ శ్రేయోభి లాషి
క్రింద నుంచి పైదాకా మీవాళ్ళే అయివుండీ —
పైగా ఎందరినో మించిన తెలివి తేట లుండీ —
మీకు సీ టెందుకు రాలేదు మహాశయా ? "

నన్ను చూచిన వెంటనే ప్రతివాడూ
నా ముఖంలోకి విసిరేస్తున్న ప్రశ్న ఇది !
ఏం చెప్పను జవాబు ?

" అడగ లేదు" అందామా అంటే
అడిగి , ఆశించి , ఎదురు చూచిన వాణ్ణే !
" మహాశయుణ్ని కనుక " అందా మంటే
దు రతిశయ మనుకొంటా రేమో !

ఈ రోజుల్లో —
ఎవడికి వాడే మహాశయుడు ,

గురుదేవో భవ, విద్యార్థి దేవో భవ!
"ఆ పై వాడి దయలేక" అందా మంటే
పాచ్చింత కాయ పచ్చడి జవా బవుతుం దది!
ఇంకేముంది చెప్పడానికి?
ఉన్నా ఎలా చెప్పడం?

రాజకీయ రథాలకు
రాచబాట లుండవు!
రాజకీయ రంగంలో ఒక్కొక్కడి మెదడు
ఒక్కొక్క మహా శ్మశానం,
అక్కడ తా నొక్కడే భూత నియంత!
ప్రజల్లో ప్రతి వ్యక్తి ఒక కాలుతున్న కాష్ఠం!

రాజకీయాల కథ, రస భావాల వధ!
అసలు సృష్టే ఒక రాజకీయ వ్యూహం,
దాని దుష్ఫలితాలే జీవుని సుఖదుఃఖాలు.

నాకు సీటిస్తే అసెంబ్లీకి —
ఎందరి ఆశా స్వీట్లు బూడిద పాలౌతాయో
నీకు తప్ప అందరికీ తెలుసు!

"తెలివైన వాణ్ని వెలి వెయ్యండి"
ఇదే ఏనాటి రాజకీయ మైనా,
అందుకే నాకు సీటు రాలేదు
నీకు చోటు పోలేదు!

28. నరకం నుంచి

ఎర్ర కంకర దుమ్ములో బొగ్గుపొగ మంటలు,
ఊదరగొట్టి ఉక్కిరి బిక్కిరి చేస్తున్న జ్వాలలు,
నెత్తురు స్పిరిట్‌తో భగ భగ మండుతున్న అంధకారం!
ఉక్కు ఫేక్టరీ రాకాసి కొలిమి కడుపులా ఉంది రాత్రి!

నరకంలోని ఒక యాతనా విభాగం కా దది!
నరకమే విల విల తన్నుకొంటున్న విలయ మది!
మరణం కంటె భయంకరమైన వివిక్తం!
దిక్కుమాలిన ప్రేతాత్మలా ఒక్కణ్ని!

గాలి లేదు!
ఇంత జ్వాలా ఝుంఝులోను గాలి లేదు;
ప్రాణం పోయే టప్పటి జడ జీవ స్థితి;
ప్రాణా ప్రాణ సంకుల యుద్ధం!

లేని ప్రాణం పోతున్నంత ఆందోళనలో
ఏదో నిశ్వాసం అవతలి ప్రక్క!
అంధకార జ్వాలార్ణ వానికే అవతలి ప్రక్క
ఏదో తెలిసిన ప్రాణాశ్వాసం!

ఎవ రది అవతలి ప్రక్క ?
నీకు లా ఎవ రది ? అవును నీవే అది ;
ఎందుకు వచ్చావో నీవు కూడ ఇక్కడికి ?
ఈ జీవ న్మరణ బాధావిల నరకానికి ?

అగ్నిని భేదించుకొంటూ , వజ్ర శిలీముఖం లా
దూసుకు వచ్చేశావు నీవు ఇవతలికి !
ఊపిరి ఆడింది నాకు నీ స్పర్శతో
నన్ను రక్షించడానికే వచ్చావు నీవు , నిజం !

ఈ భయంకర విలయాగ్ని గర్భంలో
జీవించివున్నది మనం ఇద్దర మేనా ?
ఈ ఎర్రటి చిక్కని చీకటిలో
ఏమిటా నలటి దాహం !

అదిగో చౌరాస్తాలో టీ స్టాలు !
వాన పాముల్లా లుక లుక లాడుతూ
క్రిక్కిరిసిన ఆకటి జీవులు !
భయంకర నర నారీ పిశాచాలు !

కాలే కడుపుకు మండే బూడిద -
కూర్చున్నాం కంకాళాలపై ,
మసులుతున్న మూత్రంతో నెత్తురు డికాక్షన్ !
శవ వాసన వేడి వేడి లావా !

చెవుల పోగుల కోసం పసిబిడ్డ పీక నులిమి
లంచం పెట్టి నిర్దోషిగా బైట పడ్డ
అతడే కదూ ఆ సర్వర్ ?
అతడి చేతులు మండుతున్న బొక్కలు !

ప్రత్యర్థుల గొంతులు కోసి పదవుల్లోకి వచ్చినవాళ్ళు
అర్ధరాత్రి కొంపలు కాల్చి అమాయకుల్ని చంపినవాళ్ళు
అందరూ మనవాళ్ళే , ధర్మరాజులు !
పుర్రెల్లో జుర్రుతున్నారు పురీష జ్వాలల్ని !

భుగ భుగ మంటున్న పుర్రెలో
బుస కొడుతున్న టీ !
టీ తాగను నేను , కాఫీ !
ప ళ్ళికిలించి పేలింది కప్పు !

అంటుకొంది కారుచీకటి తారు !
గిల గిల తన్నుకొని లేచి కూర్చున్నాను నేను !
ఏది ? నీ వెక్కడ ? అయ్యో , నీ వెక్కడ ?
ఎంత భీకర దు స్వప్నం !

న న్నిటు విసిరేసి నీ వటు పోయావు
ఎలా వున్నావో నీవు !
ఎంత నరకం నుంచి తప్పించావు !
ఇటే ఎందు కొచ్చేశావు కావు ?

29. మరొకరితో పోలిక

నన్ను ఒక పూర్వునితో పోల్చా డొక సమీక్షకుడు ,
ఐతే నాలో భౌతికోద్వేగం ఎక్కువంటాడు :
అందుకే నేను స్త్రీని అంతగా ఆరాధిస్తా నట !
ఎందుకో ఈ పోలికలూ , నాలికలూ !

నన్ను మరొకరితో పోలిస్తే
మహా మంటగా ఉంటుంది నాకు ,
ఆ మరొకరు ఎంతటి గొప్పవాడైనా కానీ !

ఈ మహా మానవ ప్రపంచంలో
ఒకణ్ని పోలిన వా డింకొకడు లేడు.
ఎవడి మార్గం వాడిది, ఎవడి లక్ష్యం వాడిది!
పోలిక తేవడం, సూక్ష్మ దృష్టి లేకపోవడం!

నేటి సగటు సమీక్షకుని ధ్యేయం
తన పాండిత్యాన్ని ప్రదర్శించు కోవడం,
ఎంత మంది గొప్పవాళ్ళ పేర్లు ఏకరువు పెడితే
అంత తెలిసినవా డనుకొంటుందిగా లోకం?

నేను ద్రాక్షతీగ నైతే, ద్రాక్షతీగ అనే చెప్పాలి,
అటు వటవృక్షం తోనో, ఇటు తృణకాష్ఠం తోనో పోల్చి
తగ్గించో హెచ్చించో చెప్పడం
ద్రాక్ష లక్షణం తెలియకపోవడమే!

నేను సత్యాన్వేషిని కాను,
నిత్యం సత్యంలోనే బ్రతుకుతున్న వాణ్ణి!
అనాది నుంచీ ఉన్న సనాతనుణ్ని
అనంతత్వపు నిత్యాధునికుణ్ని!

అన్వేషించే వాడికి
అనుచరు లుండటం సహజం,
అన్వేషణ ఎంత విస్తృత మైతే
అనుచరుల 'క్యూ' అంత దీర్ఘం!

డబ్బుండి , విదేశ యాత్రలు చేసి
పలుకుబడి గల పోషకుల్ని సంపాదించి
తారలు కాగలిగిన వాళ్ళే చరితార్థు లీ నాడు !
డబ్బు లేకపోతే దేవుడైనా దరిద్రుడే !

అక్షర జ్ఞానం లేని కోటీశ్వరుడికి
అపర సరస్వతి కార్యదర్శిని !
రత్న గర్భ , వసుంధర , ధాత్రి—
అయినా , ప్రతి పందీ త్రొక్కుకు పోతుంది దాన్ని !

ఇలాంటి లోకంలో
ఎలాంటి ప్రభావానికీ లోబడక
సర్వతంత్ర స్వతంత్రుణ్ణయి ఉన్న నేను
ఏకాకిని కాక ఏ మౌతాను ?

నేనే సర్వాద్యుణ్ణి కనుక
నాకు ముం దనేదే ఏమీ లేదు ,
నాయంతట నేను ఒక్కణ్నే కనుక
నాకు వెనుక 'క్యూ' కూడా లేదు !

పద్మంలో పద్మాసనం వేసుకొని ,
పరాపర పూర్వోత్తర స్పర్శా శూన్యుణ్ణయి ,
ఏకాంత వాసం చేస్తున్న నాకు
ఎలా గడుస్తుంది కాలం నీవు లేకుండా ?

భౌతికోద్వేగం స్త్రీని ఆరాధించదు
కామార్థం ఉంచుకొంటుంది !
నా స్త్రీలు ప్రకృతి సౌందర్య శ్రీలు ,
నాది అపౌరుషేయ బ్రహ్మ కామన !

నీవు లేకుండా బ్రతక లేను నేను
నీకేసి కన్నుకొట్టడం భౌతికోద్వేగమా ?
అయితే , భౌతికం కాని దేమిటి ?
ఉద్వేగం చైతన్య లక్షణమే కాదా ?

అంతా భౌతికమే పరమాత్మతో సహా
అంతా సౌందర్యమే మృత్యువుతో సహా ,
కన్ను కొట్టడమే భావ వ్యగ్రత
దానికి నీ ప్రతి స్పందనే మహా సర్గ !

వేరుకూ , పండుకూ సంబంధం తెలియక ,
పండును కాదని , వేళ్ళను తవ్వుతారు కొందరు !
ఆధ్యాత్మికత అనేది ఎక్కడో లోతుల్లో
గుప్తంగా , చేదుగా ఉంటుందని వాళ్ళ ఊహ !

పారమాత్మిక పరమ రహస్యం ఇదిగో ,
నా కృషికి ఫలాలు ఈ ప్రేమ లేఖలు !
ఎవ రేమనుకొంటే మన కేం ?
అనుభవిస్తాం రసానందం !

30. పాపం, రాముడు

రామాయణం—
కల్ప వృక్షం అన్నా రొకరు,
విష వృక్షం అన్నారు మరొకరు!

ఈ రెండూ నిజం కా దన్నావు నీవు,
రెండూ నిజమే అనిపిస్తున్నది నాకు
ఆలోచిస్తున్న కొలదీ!

ఈ ఆలోచించడం అన్న దున్నదే
ఇది మహా చెడ్డది!
అందుకే నిషేధించారు దీన్ని
ప్రభువులూ, వాళ్ళ పురోహితులూ!

తాము చెప్పింది కళ్ళు మూసుకొని వినమన్నారు
తాము చేసినట్టు మాత్రం చెయ్యవద్దన్నారు

కారణం అడిగిన కంఠాలను
కత్తిరించి పారేశారు !

అయినా—
మనుషు లంతా గొర్రెలే కాదు కదా ,
ఎవడో ఒకడు ఆలోచిస్తూనే వుంటాడు !

రాముడు ఒక పూర్ణ మానవుడు
అతణ్ని ఆదర్శంగా పెట్టుకొని
ప్రతి మనిషీ ఒక రాముడు కావాలి
గుణంలో , శీలంలో , శక్తిలో !

రావణుడూ పూర్ణ మానవుడే
శక్తిలో రాముడి కంటె అధికుడు కూడా ;
గుణంలో మాత్రం స్వార్థ పరుడు ,
శీలంలో పరపీడకుడు !

స్వార్థ నిరంకుశ మూర్ఖ శక్తిపై
సుగుణ శీలాల విజయమే రామాయణం .

రావణ దుశ్శీలతను పరిహరించి
రామ సౌశీల్యాన్ని పరిగ్రహించి
మానవుడు పురోగ మించా లనేది
వాల్మీకి కావ్య లక్ష్యం ,
రామాయణం కల్ప వృక్షం .

అయితే—
ఈ నాడు మనం చేసిం దేమిటి ?
గుండు కొట్టి పంగనామాలు పెట్టి
వాల్మీకిని హరిదాసును చేశాం !
శంఖ చక్ర గదాదు లన్నీ తగిలించి
రాముణ్ని దేముణ్ని చేశాం !
వేళ్ళు పెరికి , కొమ్మలు నరికి , అంట్లు కట్టి
రామాయణాన్ని విష వృక్షం చేశాం !

రామాయణం కావ్యంగా ఎంతటి కల్ప వృక్షమో
మత గ్రంథంగా అంతటి విష వృక్షం !
రాముడు మనిషిగా మార్గదర్శకుడు ,
అతణ్ని దేవు డనడం అన్యాయం , మోసం !

రాముణ్ని ఆదర్శ మానవుడుగా భరించలేని
స్వార్థపరులైన నిరంకుశ ప్రభువులు
రాముణ్ని దేవుణ్ని చేసి పారేసి
అవ్వల కిచ్చేశారు ఆరాధించు కోమని !

చూస్తున్నావుగా నీవే స్వయంగా ?
గుళ్ళో వుండేది రాతి రాము డొక్కడే ,
చుట్టూ అంతా ఒంటితల రావణులే !
పాపం , రాముడు !
పాపం , రామాయణం !

31. దారిలో వేప చెట్టు

అనంతం , మారుతి , దివాకరం , జీవన
నాతో ఐదుగురం బైలుదేరాం కరీంనగరం ;
సాయంత్రం నాలుగ్గంటలకు బైలుదేరాం ఇక్కడ ,
ఆరు గంటలకు కవిసమ్మేళనం అక్కడ !

వంద మైళ్ళ దూరాన్ని
రెండు గంటలలో మేసెయ్యా లని
దూకుతున్నది కారు కారుదున్నలా ,
కాలిపోతున్నది పెట్రోలులా మా ఆతుర్త !

మరుగు లేని మహా సర్పంలా
మెలికలు తిరిగిపోతున్న రోడ్డును
ఆకలిగొన్న కాల నకులం లా
మింగుకొంటూ పోతున్నది కారు !

అడ్డ దిడ్డపు తెరువరులు ,
రిక్షాలు , రెండెడ్ల బండ్లు ,
దారి వదలని లారీలు !
అనుక్షణం అభ్యుదయ నిరోధకత్వం !

మా కారుకు బ్రేకులు పడినప్పు డెల్లా
మా హారను సహనానికి బ్రేకులు పోతున్నై !
అబ్బా—ఈ రోడ్డుకు ఎంత చెవుడు !

ఒకే దూరంలో మైలురాళ్ళ కంటే
కిలోరాళ్లు ముందు వచ్చేస్తున్నై !
గతం కంటె వర్తమానమే చురుకైంది !
నోటు కంటె చిల్లరే బరువయింది !

పొంగి ప్రవహిస్తున్న వాగును చూస్తే
గోదావరి జ్ఞాపకం వచ్చింది నాకు ,
కృష్ణ జ్ఞాపకం వచ్చింది జీవనకు
అనుభవం ఒక్కటే , అనుభూతులు వేరు !

"అప వయ్యా కొంచెం" అన్నాడు దివాకరం,
కారుకు బ్రేకు వేశాడు డ్రైవరు;
ఈ బ్రేకు నిర్బంధంకాదు, స్వచ్ఛందం!
సంచ్ఛంద ప్రవర్తనమే జీవిత సుఖ పారమ్యం!

కారు దిగాం మేం రోడ్డు ప్రక్క,
అందరం అన్ని ప్రక్కలకూ పోయాం,
ఎవరికి వారే హైరోడ్డు తీరే!
పదిమందిలో ఉన్నా, వ్యక్తి అంతర్ముఖుడే!

ఎంత అందంగా ఉంది ప్రకృతి!
మేం ఇక్కడ దిగకపోతే, ఇదంతా ఏమయేది?
మానవుడి అనుభవం కోసమే ఈ అంద మంతా,
మానవుడు లేకపోతే ప్రపంచమే లేదు!

నా బుగ్గలపై ఎవరిదో మెత్తటి స్పర్శ!
ఎర్రని వేప చిగుళ్లు అవి!
విరిచి పట్టుకున్నాను రెండు రెమ్మలు,
నోట్లో వేసుకున్నాకు రెండు మొగ్గలు!

తెరచిన గుప్పిలిలా విడిపోయిన మేం
మూసిన గుప్పిలిలా కలుసుకొన్నాం మళ్ళీ!
వియోగ సంయోగాల భండారం ఇంతే!
కుల మత వర్గ భేదాలూ ఇంతే!

" వేపాకు తినడమా ? " అన్నాడు అనంతం ,
" చేదు కదా ? " అన్నాడు మారుతి ।
" ఎంతో ఆరోగ్యకరం " అంటూ అందిచ్చాను నేను ,
తలొక ఆకూ నమిలా రందరూ !

అనంతం డోకేశాడు ,
జీవన ఉమిసేశాడు ,
" చేదు మాకు అలవాటు లేదు " అన్నాడు
దివాకరం నన్ను చూచి నవ్వుతూ !

ఆయని విచ్చీ విచ్చని నవ్వు
ఆనంద మకరందానికి మందారపుప్పు !
ఆయన పరిహాసం లోని చేదు
చలని బీరులోని చాదు ।

వేపాకు తినిపించా నని
నోరు పాడుచేశా నని
తిట్టుకొంటూనే ఉన్నారు నన్ను పొడుగునా
మారుతి సైకి , తక్కిన వాళ్ళు లోన ।

కరీంనగరం కవితా గానంలో
షరాలు మామూలు శాలువలే ,
ఆ పైని దోసిడేసి మల్లె పూలు
గ్లాసుడేసి మంచినీళ్ళు ।

అదే కారులో , అదే రాత్రి
అదే వేగంతో తిరుగు ప్రయాణం !
ముందు రోడ్డు , చుట్టూ చీకటి
పూర్వ పుణ్యంలా ఎదుట కారు లైటు !

" మీ వేపచెట్టు " అన్నాడు దివాకరం
" వచ్చిందేమో చూసుకోండి " అన్నాడు జీవన
నేనూ దాని కోసమే చూస్తూ వచ్చాను
గుర్తించ లేకపోయాం దాన్ని ఆ చీకట్లో !

క్షణ మాత్ర పరిచయంలోనే అంత మోహం ఉంటే ,
ఆజన్మ స్నేహంలో ఎంత ప్రణయం ఉందో !
మనిషో , మానో , తీపో , చేదో
అనుబంధమే ఆత్మకు ఆనంద బంధం !

నిన్న సాయంత్రం వేసివెళ్ళిన తాళాన్ని
తీశాను నేను మళ్ళీ నేటి ఉదయం ,
ఒరిగి పోయాను అలానే మంచం మీద —
వేపచెట్టు ఎక్కడ దాటిపోయిందా అని
మనస్సును మళ్ళీ వెనక్కి పరిగెత్తిస్తూ !

32. మంచికి మంచి రోజులు

ధర్మవ్రతి మాట నమ్మి ద్రోణుడు
దానం చేసి కర్ణుడు , బలి చక్రవర్తి
సత్యానికి కట్టుపడి హరిశ్చంద్రుడు
శత్రువు పై దయ చూపి పృథ్వీరాజు
ఇలా—ఎంద రెందరో మహా వ్యక్తులు
ఏదో ఒక సద్గుణం కారణంగా
సర్వ నాశన మై పోయారు , పాపం !

ఏ సద్గుణం ఎక్కడ కనిపించినా
ఏ సౌందర్యం ఎక్కడ వికసించినా
దాన్ని నాశనం చేసే వరకూ నిద్ర పోలేదు
మన దేవతలూ , ఋషులూ , రాజులూ కూడ :

పూర్వమూ అంతే —
ఇప్పుడూ అంతే !

పాతివ్రత్యా నైనా
నిశ్చింతగా బ్రతక నిచ్చారా ?
అదు గడుగునా అగ్ని పరీక్షే ,
అనుక్షణం ఆత్మాహుతే !

ఆత్మ వాది నంటూనే
అసలు ప్రాధాన్యం దేహాని కిచ్చే
ఆత్మ వంచకుడు మానవుడు !

తులసి , అహల్య , అనసూయ , సీత —
పవిత్ర మైన ప్రతి ప్రేమకూ
లవిత్ర మైన వాడు ఎవడో ఒక పెద్ద వాడే !

మన ఆదర్శ సాహిత్యం నిండా
ఉన్న కథ లన్నీ ఇలాంటివే !
మనిషిని బెదర గొట్టి
మంచికి దూరంగా తరిమి వేసేవే !

హరిశ్చంద్ర నాటకం చూచిన వాడు
సత్యం చెప్పడానికి సాహసిస్తాడా ?
అజామీళుడి కథ తెలిసిన వాడు
ఏ పాపం చెయ్యడాని కైనా వెనుదీస్తాడా ?

అతడు పిలుచుకొన్నది సొంత కొడుకునే కాని
తమ దేవుణ్ని కా దనే జ్ఞానం కూడ లేని వాళ్లు
విష్ణు దూత లెలా కాగలిగారో !

"కాల్మొక్కుతా , బాంచను" అంటే కాని
కనికరించని జాగీర్దారుడా దేవుడు ?
పొగడ్తలకు పొంగిపోయే మూర్ఖ ప్రభువా ?
నైవేద్యాలకు ఉబ్బిపోయే తిండి పోతా ?

భగవంతుణ్ని ఒక బానిస వ్యాపారిగా చూపే
ఈ దాసానుదాస భక్తి సిద్ధాంతం
మత పెద్దల పెత్తం దారీ
వ్యాపార సూత్రం మాత్రమే !

కాగా —
క్షేత్రాలలోని భక్తుల ధోరణిని
అసహ్యించుకొని ఆవేశ పడవద్దు !
పుణ్య క్షేత్రాలూ కురు క్షేత్రాలే ,
ధర్మ క్షేత్రం ఒక్క ధాన్య క్షేత్రమే !

స్వ ప్రయోజనమే మానవ నైజం ,
మంచికి మంచి రోజులు
ఏ యుగం లోనూ లేవు !
అవ్వ తెస్తా నంటున్నదా?
సరే , ప్రయత్నించ నీ !

33. క్షేత్రజ్ఞత

మన వూరి ఆంజనేయుడి గుడిలో
ఒక మూల పడి వున్న శివుడికీ,
మధుర మీనాక్షి ఆలయంలో
ఆ ప్రక్క ఒదిగి వున్న శివుడికీ,
శ్రీశైల క్షేత్రంలో
తానే సర్వేశ్వరుడై వున్న శివుడికీ
తేడా వున్నదా?
లేదు.
లేదా?
వున్నది!

ఒక చోట అనామకుడు
ఒక చోట విధేయుడు
ఒక చోట సర్వాధికారి!
వ్యక్తి ఒక్కడే,
వ్యక్తిత్వాలే వేరు వేరు.

వ్యక్తిత్వం ఆత్మ శక్తి తోడిది
వికసించే కొలదీ పరిమళిస్తుం దది ,
ఫలించే కొలదీ మధురిల్లుతుం దది !

అయితే —
శివు డొక వ్యక్తా ?
కాకపోతే ఆ అవస్థ లేమిటి ?
అయితే , అతడు పరమాత్మ ఎలా అవుతాడు ?

ఈ దేవత లంతా
మానవుడి మనో మూర్తులు ,
వారి శక్తు లన్నీ
అతడి మనో రక్తులు !

దారిలో దొరికిన మేక పెంటికను
శివ లింగంగా ఆరాధించిన వాడికి
అందులోనే శివుడు కనిపించా డంటే
తేలిం దేమిటి ?
ప్రధానం క్షేత్రం కాదు —
క్షేత్రజ్ఞత అని !

క్షేత్రజ్ఞ తే జ్ఞానం ,
అది వున్నప్పుడు అనవసరం —
లే నప్పుడు వ్యర్థం — ఏ యాత్ర లైనా .

34. చిత్ర కళా ప్రదర్శన

ఒక చిత్ర కళా ప్రదర్శనకు మొన్న
ఆ మధ్య జరిగిన ప్రారంభోత్సవంలో
ఏ దైనా మాట్లాడ మన్నారు నన్ను !
లాక్కుపోయి నిలబెట్టారు వేదికపై :

నాకేం తెలుసు చిత్రకళ గురించి ?
నాకు తెలిసిన సాహిత్య సుధకే
ఎన్నడూ పెదవి విప్పని నేను
నోరెత్తడం ఎలా పచ్చి వెలక్కాయకు ?

నే నే మైనా మంత్రిని కనుకనా ?
ప్రజా స్వామికంలో మంత్రి
పరమేశ్వరుడి కంటె సర్వజ్ఞుడు !
నేను శాసనసభ్యుణ్ని కూడ కాదయ్యె !

చెప్పకుండానే వేసుకొన్నారు నా పేరు
మహోపన్యాసకుల జాబితాలో !
ముప్పై బస్తాలు పండే కోనసీమ వరిచేను
ఒక కిలో గోధుమ లైనా పండదా అనుకొంటూ :

వెర్రి మెగంతో నిల్చున్నాను నేను
వేదికపై దిక్కులు చూస్తూ !
అప్పుడు మెరిసింది నీ లేఖ మెదళ్ళో !
సమయానికి జేబులోకి వచ్చేశావు నీవు !

సృష్టిలోని సహజ సౌందర్యాన్ని
షడ్రసోపేతంగా అందించేదే కళ !
కాకర కాయ చేదు , బెండ కాయ జిగురు ,
అన్నంలో అన్నీ అమృత రసాలే !

శృంగార శయ్యా మందిరం కళ ,
భీకర బీభత్స యుద్ధరంగం కాదది !
తీర్చి దిద్దిన ఉద్యానవనం కళ ,
దాని కది పెరిగిన కీకారణ్యం కాదది !

అర్థాన్ని అందగించడం సాహిత్యం ,
శబ్దాన్ని అందగించడం సంగీతం ,
రూపాన్ని అందగించడం ఆలేఖ్యం ,
చలనాన్ని అందగించడం నృత్యం !

సాహిత్యం ఆలోచించాలి , సంగీతం వినాలి ,
శిల్పం చూడాలి ఆనందం కోసం .
ఏ కళకైనా లక్ష్యం ఆనందమే ,
ప్రచారమో , నీతి బోధో కాదు .

వెలుగూ , నీడా , ముల్లూ , పువ్వూ , తృష్ణా , తృప్తి
ప్రకృతిలోని ప్రతి లవమూ కళకు ఇతివృత్తమే .
మంచీ చెడ్డా కలిసి మాధుర్యాన్ని సృష్టించాలి
మంచికీ చెడ్డకూ దాన్ని సమానంగా పంచాలి .

స్వయం వ్యక్తిత్వంతో జనాన్ని శాసించేది
ఏదైనా కావచ్చు , కళ మాత్రం కాదు .
అనురాగవతి అయిన ప్రియురాలి వలె
అలరించి ఆనందపరిచేది కళ !

ఆనందం ఇవ్వ లేని దేదీ కళకాదు నా దృష్టిలో ,
ఆధునిక కళల్లో కనిపించదు నా కే అందమూ .
ఏం చెప్పను కళ గురించి ?
అందు కే —
నీ లేఖ చదివేసి , కూర్చున్నా !

35. నిస్సహాయత

ఎల ప్రాయపు సెలయేరు
ఎగిరి గంతులు వేస్తూ
ఎడారి చేతుల్లో పడి
ఎండి పోయింది !

అమాయకపు లేడి పిల్ల
అరుణారుణ్ని ఆహ్వానిస్తూ
వేటగాని తుపాకి గుండుకు
గుండె చీలి పడిపోయింది !

కాయకష్టం పండిన రైతు రొమ్ముపై
పండి పరవశిల్లిన వరిచేను
తుపాను గాలి దొంగ దెబ్బకు చితికి
మునిగి పోయింది కన్నీటి వరదలో !

ఇలా ఎంతని చెప్పను ?
అంతా నా కళ్లముందు జరిగిపోతుంటే
చూస్తూ ఉండి పోయాను !
ఏమీ చెయ్యలేక పోయాను !

శివాలకలు

···:(o):···

విలాసం మూడు

*

ఆరని కొలిమి

పుష్పకు రాముడితో ఉన్న సంబంధం
కేవలం రాజకీయ మైనట్టిది,
ఏవో సమస్యలు పీకమీదకు వచ్చినప్పు డెల్లా
సంప్రదిస్తూ ఉంటుం దామె అతడితో.

కమలకు భీముడితో ఉన్న స్నేహం
కేవలం కళాత్మక మైనట్టిది,
రసోదయానికి మబ్బు పట్టినప్పు డెల్లా
గిల్లి పోతూ ఉంటుందా మె అతణ్ని.

నీలకు చంద్రుడితో ఉన్న మైత్రి
కేవలం మానసిక మైనట్టిది,
ఏదో దుఃఖం బాధించి నప్పు డెల్లా
ఓదార్పు పొందుతూ ఉంటుం దతడివద్ద.

అరుణకు ఇంద్రుడితో ఉన్న అవసరం
కేవలం ఆర్థిక మైనట్టిది,
ముఖ ధూళికి డబ్బులు లేనప్పుడెల్లా
తడిమి పోతూ ఉంటుం దతడి జేబులు!

రాధకు కృష్ణుడితో ఉన్న సాంగత్యం
కేవలం దైవిక మై నట్టిది,
తెలియని ఏదో ఆనందంతో ఆమె
తన్మయ మై పోతుం దతడి సన్నిధిలో!

పుష్ప సంఘ సేవిక, కమల బాలిక
నీల గృహిణి, అరుణ ఉద్యోగిని
రాధ పరకీయ, తెలుసు కదా నీకు?
ఒక్కొక్కరిది ఒక్కొక్క రకం చెలికారం!

తెలుసు కదా నీకు పొరుగింటి పుల్లమ్మ?
మగవాళ్ల భార్యలకూ, ఆడవాళ్ల భర్తలకూ
చెప్పింది పోయి రహస్యంగా!
వ్రాసింది ఉత్తరాలు అసహ్యంగా!

పుష్పను భర్త కొట్టి పొమ్మన్నాడు ,
కృష్ణుణ్ని భార్య తన్ని తగిలేసింది ,
కమలను తండ్రి కట్టి పారేశాడు
చంద్రుణ్ని ఎవడో చెంపలు వాయగొట్టాడు !

ఏ పాపానికి ఈ శిక్షలు వాళ్లకి ?
ఏం అపకారం చేశారు వీళ్లు పుల్లమ్మకి ?
తేలు కుడుతుంది , పాము కరుస్తుంది ,
పర పీడనమే ఆనందం ఒకొకళ్లకి !

నా గురించి ఏం చెపుతుందో నీకు ,
అడుగుతూ ఉంది రోజూ ఎప్పుడు వస్తా వని !
ఇది ఏ రకమైన ఆకలో !
ఈ కొలిమి ఆరే దెప్పుడో !

37. గంగా బొండం

అనుమతి రెక్క వాలింది
పచ్చ జెండా ఊగింది
రైలు కదిలింది .
అప్పుడు వచ్చిం దక్కడికి
ఒక కొబ్బరి బొండాల గంప !

హడావుడిగా ఒక రూపాయి విసిరేసి
ఒక బొండం అందుకొని
రైలెక్కేశాను నేను .
చేతిలో కొబ్బరికాయతో సీటులోకి వచ్చి
దానివంకే చూస్తూ కూర్చున్న నన్ను చూస్తూ
నవ్వింది నా ఎదురు సీటు
తన పక్క సీటు చెవిలో ఏదో చెపుతూ !

ఆ ఏదో నాకు తెలియలేదు కాని —
" కోతికి కొబ్బరికాయ దొరికిందే " అని
అంటున్నదని నా అనుమానం !

అది పండిన కాయ కాదు కనుక
ఇంటికోసం అయి వుండదు ,
అది దూర ప్రయాణం
కొబ్బరి బొండం సద్యః ప్రయోజకం ,
జేబులో కలం మాత్రమే వున్న ఇతగాడు
ఇప్పుడు దీన్ని ఏం చేస్తాడు ?

బహుశా ఇదీ —
వాళ్ళకు గిలిగింతలు పెట్టిన ప్రశ్న !
నాకు మాత్రం ఏ ఆలోచనా లేదు !
కొబ్బరి బొండం కనిపించింది
అనుకోకుండానే కొనేశాను !

కొబ్బరి ఎక్కడ కనిపించినా
నాకు దానిలో కొబ్బరి తోటలు కనిపిస్తే ,
కోనసీమ ప్రత్యక్ష మవుతుంది !
అమ్మ ఒడిలో చంటి పాపలా
అవశు ణ్ణయిపోతా నా క్షణంలో !

ప్రకృతి ధర్మమే అంత !
ఎక్కడ పుట్టిన జీవికి
అక్కడి ప్రకృతే ప్రవృత్తి !

గోదావరి తన సమస్త పుష్ప ఫలాలను ,
ధన ధాన్యాలను , సౌందర్య రుచులను
ప్రేమోపాయనంగా సంతరించు కొని
సముజ్వల మూర్తి అయి సాగరుని పాదాల ముందు
సమర్పించుకొన్న పూర్ణ సువర్ణ పళ్ళెరం
కోన సీమ !

అక్కడ పుట్టిన నాకు
అక్కడ పుట్టిన దేది ఎక్కడ కనిపించినా
పరమాత్మీయ పూర్ణ సౌందర్య సాక్షాత్కారమే !

ఇది ఎదుటి వాళ్ళ కేం తెలుసు ?
వాళ్ళకు కనిపించేది అప్పటి సమస్య !
చొక్కా జేబులోని కలానికి తోడు
పేంటు జేబులో వుంది కదా చాకు ?
అది బైటికి తొంగి చూడగానే
వాళ్ళ కళ్ళు ఇంత లంత లైపోయినై !

అంత చిన్న చాకుతో
అంత పెద్ద బొండాన్ని
ఏం చెయ్యగలడు ?
మళ్ళీ మరో సమస్య ?

కాయ పై పెచ్చులు ఒక్క టొక్కటిగా
చిన్న చిన్న పచ్చని తెల్లని పిచ్చుకలుగా మారి
కిటికీ బైటికి దూకి పోతుంటే
నా చేతి నెత్తురు చూడాలని
కనిపెట్టుకు కూర్చున్న ఆ కళ్ళు
మతాబాల్లా మెరిసినై —
చిప్ప పగల గొట్టడం
నాకూ ఒక సమస్య కాగానే !

అప్పుడు జ్ఞాపకం వచ్చింది —
గంగాతీరాన తెల్లని ఇసకలో నడుస్తూ నీవు ఏరి
హృషీకేశం నుంచి పార్శిలులో పంపించిన శిల
నా సంచీలోనే వున్నదని !

గంగ రాతి స్పర్శతో
అమృతం చిందిన ఈ ఎల నారి
గంగా బొండ మయింది నా చేతిలో,
రసానందం నించింది నా గుండెలో !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
10413

మరి —
ఎదటి సీట్లో ? అంటావా ?
ఇప్పు డవి వట్టి సీట్లు కాదు —
ప్రసాదం స్వీట్లు !

38. ఎంత ప్రయాణ మైనా

ఎంత ప్రయాణం చేసి వచ్చాను,
ఎన్ని పువ్వులు సేకరించి తెచ్చాను,
ఎన్ని కథలు మోసుకొచ్చాను !

సింహాచలం కొండ కొమ్మల నుంచి
స్వయంగా సేకరించిన పసిడి సంపెంగలు
నిన్నే మాటి మాటికీ జ్ఞప్తికి తెస్తూ
చెల్లా చెదరుగా పడి ఉన్నై నా ముందు !

నాది ఎన్నికల పర్యటన
నీది పుణ్యక్షేత్రాల యాత్ర,
నా పర్యటనకు ఒక ముగింపు ఉంది
నీ యాత్రకు ఆద్యంతాలు లేనట్టుంది !

పరిస్థితుల ప్రాబల్యం ఒక రావణ హస్తమై
నా నుంచి నిన్ను అలా లాక్కు పోగానే
ఏమీ తోచకనే కదా నే నా పర్యటనకు పోత ?
ఎంత కాలం తిరుగుతాను ఆ కూపంలో మండూకంలా ?

తిరుపతికే కదా వెళ్ళావు
తిరుగు టపాలా వచ్చేస్తా వనుకొన్నా !
టపా వస్తూనే వుంది ప్రతి రోజూ
నీ వైనమే ఉండడం లే దందులో !

ఎవరికి పెట్టను నే తీసుకొచ్చిన పూలు ?
ఎవరికి చెప్పను నే మోసుకొచ్చిన కథలు ?
పక్కనున్న దీపం అంటున్నట్టున్నది —
రాజ్యద వుంటే ఎంత బాగుండును అని !

నిజమే — నీవు ఉంటేనే ఏ బాగైనా !
ఎన్ని కథలు నిన్ను నిరూపిస్తయ్ ?
ఎన్ని పువ్వులు నిన్ను స్వరూపిస్తయ్ ?

39. ఎవరంటే

" ఎవరండీ — మిమ్ము ఇంతగా ఆవేశించి ,
అకాండ తాండవం చెయ్యిస్తున్న మోహిని ? "
మొన్న నన్ను కలిసిన ఒక రమణీ బృందంలో
మణి అడిగిన ప్రశ్న ఇది !

ఖచ్చితమైన జవాబు కావా లన్నారంతా !
ఆ ధన్యురాలు ఎవరో తమకు తెలుసట ,
అయినా నా నోట వినాలని ఉన్నదట ,
చెబితే గాని కదల రట !

మన ప్రేమ గురించి నీకు , నాకు , బహుశా
మీ — అవ్వకు తప్ప మరెవరికీ తెలీదు ,
అయితే — మీ నాన్న కొంత పసిగట్టి ఉండవచ్చు !
అందుకే నిన్నలా తోలేశాడేమో అని నా అనుమానం !

బిడ్డల గురించి తండ్రి మెదడులో
లక్ష అభివృద్ధి ప్రణాళికలు రూపొందుతై !
అందులో డబ్బు లేక కొన్ని పోతే,
కంట్రాక్టర్లు తినేసి కొన్ని పోతై !

తమకోసం కొనబడ్డ మంచి సిమెంటును
చీకట్లో చంద్రశాలలు ఆరగించి వేయగా,
పట్ట పగలు మట్టి కొట్టుకుపోతున్న
మహా ప్రాజెక్టుల కలికాలం కదా ఇది ?

ఏ నాన్ననూ ఎప్పుడూ నిందించను నేను
బాల్య యౌవనాలను మరిచిపోయిన వృద్ధులు వాళ్ళు !
అందుకే అవి వాళ్ళకు ఎదురు తిరుగుతై,
గెలుస్తై, మళ్ళీ ఓడిపోతై వాళ్ళ లాగే !

ఇదొక వినోద విషాద చక్రభ్రమణం,
ఇందులో మీ నాన్న కూడ ఒక చుట్టు !
మన ప్రేమ ఆయనకు ఇష్టం లేదు,
విడిచి పోతే మరిచిపోతా రని అపోహ !

ఏది ఏమైనా —
ఈ రమణీబృందానికి మాత్రం తెలీదు నీ వెవరో,
దబాయిస్తున్నారు నన్ను, అంతే !
లేక, నిజంగానే తెలుసునో యేమో !

" అనాది కొస నుంచి అనంతత్వం లోకి " చూపి
" నీవే ఎందుకు కాకూడదు " అన్న శీర్షికలో వేలుంచి,
తోశాను దాన్ని వాళ్ళ ముందుకు !
మొగ మొగాలు చూచుకొన్నారు వింతగా !

" మే మెవరమూ కాము " అన్నది రమణి
తానే అయితే బాగుండు నని ఆశిస్తూ !
" డబాయించకండి " అన్నది రోహిణి
తనలో నీ లక్షణాలు వెతుక్కుంటూ !

నాచే అకాండ తాండవం చేయిస్తున్న శక్తి
తానే కావాలని ఉంది కాని —
పూర్ణ సౌందర్య దేవతవైన ఆ నీవు
తానే అనుకోడానికి జంకింది ప్రతి వనితా !

ప్రతి మహిళా ఒక ప్రత్యేక సౌందర్యాంశ,
ఆమెలోని ఆ ఒక్క అంశా
సంపూర్ణమూర్తి వైన నీవు ఎలా అవుద్ది ?
అందుకే ప్రతి ఆమెకూ ఆ జంకు !

రమణీ లోకంలో ప్రత్యేక ప్రత్యేకంగా
పారమ్యం పొందిన సౌందర్యాంశ లన్నీ
రాశీభూతమైన పూర్ణ రామణీయకం నీవు !
కేవల అంశలకు ఎలా చూపడం నిన్ను ?

40. జ్యోత్స్నా స్నానం

ఎన్ని పద్మాలు ఈ పద్మాకరంలో !
ప్రతి పద్మమూ నీ పాద పద్మాలయమే,
ప్రతి దళమూ ఎర్రటి నీ అరికాలే !

ఈ ఒంచపై కూర్చుని
నీళ్ళలో నా పాదాలు ఆడిస్తుంటే
నీ పాద పద్మాలు నాట్యం చేస్తున్నై దివ్యంగా !

వెండి బంగారు చేప పిల్లలా అవి ?
నీ వలపు వెన్నెల వెన్న కుదపలే
మూగుతున్నై అలసిన నా అడుగుల చుట్టూ !

అదిగో హిమానీ జలపాతం ,
పాపనాశం కనిపిస్తున్నది నా కందులో !
ఆ లక్షల మంది యాత్రికులలో నీ వెక్కడ ?

ఈ ప్రపంచమే ఒక యాత్రాస్థలం ,
ఈ జన మంతా యాత్రికులే —
కోటలో , పేటలో , కోనేటిలో , క్యూలో !

నీ వొక్కతివే ఆ గుంపులో లేవు
నిజానికి ఆ గుంపంతా నీవే !
నా ఒళ్ళంతా నీ కళ్ళే !

పంచాగ్ని మధ్యంలో శరీరం ఉడికి పోతున్నా
చల్లని నీ ప్రేమ జ్యోత్స్న నా ఆశ్రమం !
స్నానం చేసిరా నా కోసం కూడ !

41. పాత ఉత్తరాల కట్ట

పాత ఉత్తరాల కట్ట నొక దాన్ని
విప్పాను నేను యథాలాపంగా,
నీ లేఖ కోసం ఎదురు చూస్తూ
ఏమీ తోచని ఒక శూన్య క్షణంలో !

మొగలి పొత్తిలా గుబాళించిం దది !
దానిమ్మ గింజల్లా మెరిసినై అక్షరాలు,
పడి చితికిన పనసపండు తొనల్లా
చెదిరి పడినై వందలాది లేఖలు !

మనం కలుసుకోక ముందు —
ఎవ రెవరో నాకు వ్రాసిన ప్రేమ లేఖలు ,
ఎవ రెవరికో నేనే వ్రాసి
పోష్టు చెయ్యని ఎన్నో స్నేహ లేఖలు !

ఈ లేఖ లన్నీ ఎందుకు దాచా నంటావా ?
మరి దాచుకోడానికి నా కింకే ముంది ?
అమూల్య మైన ప్రతి దాన్నీ దాచుకుంటాడు మనిషి ,
నా కున్న ఆస్తి అంతా నా ప్రేమే !

మనం ఎప్పుడు ఎలా కలుసు కున్నామో
జ్ఞాపకం ఉంది కదా నీకు ?
అలా మనం కలుసు కోక ముందు
ఎంత చరిత్రో నడిచింది నా జీవితంలో !

భవిష్యత్తును నమ్ముకొని
వర్తమానాన్ని విడుచుకునే వా ళ్ళిద్దరు —
కఒడు అజ్ఞుడు , ఒకడు దైవజ్ఞుడు !
ఈ ఇద్దరూ నేనే — నిన్ను కలిసే వరకూ !

42. నా చూపు

నేను చూడక ముందు
అ దొక ఎండి పోయిన తీగ !
మట్టి కొట్టుకు పోయి ఉండేది ,
మృగశిరనే ఎరగ దంత వరకు !

నా చూపులో అది పచ్చబడింది
నా స్పర్శలో అది మొగ్గ తొడిగింది
నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో అది
ప్రఫుల్ల మయింది , పరిమళాలు చల్లింది .

దాని అందాలతో దిగంతాలు
అంగ రాగాలు దిద్దుకొనై ,
దాని పరిమళాల మత్తులో
గడ్డి పరకలు కూడ పడగలెత్తి ఆడినై !

అప్పుడు —
దాని చుట్టూ చేర సాగినై
మీది మీదికి వచ్చి మూగసాగినై
ఎక్కడెక్కడివో తుమ్మెదల కళ్ళు
చిత్ర సీమల వలపుల ముళ్లు !

అది మధు బిందు వైతే చాలు —
దాని కోసం ప్రతి దోమా ఒక మధు వ్రతమే !
ప్రతి చీమా ఒక శ్రేయోభిలాషే !
అసలు వసంతుడికే
దర్శనం దొరకని దర్బా రయిం దది !

ఆ తర్వాత అది —
మళ్ళీ ఒక ఎండిపోయిన తీగ !
చెమర్చినై కళ్ళు నాకు , కాని —
చిగిర్చ లేక పోయింది మళ్ళీ అది !

43. నాగులు - నాగస్వరాలు

తిట్టిం దతణ్ణి నోటికి వచ్చిన ట్టెల్లా ,
అతడూ తిట్టా డామెను మాటకు మాట !
కారణం తెలీ దెవరికీ ,
కురుక్షేత్ర మయిందది చివరికి !

బ్లేడు ల్లాంటి మాటలు
కత్తు ల్లాంటి నిందలు
రంపా ల్లాంటి బూతులు ,
మర్మభేదక మహాస్త్రాలు !

" పో ! వాడి దగ్గరకు " అన్నాడతడు
" తెచ్చుకో దాన్ని " అన్నదామె !
కొట్టా డతడు చెంపకాయ ,
ఎత్తిం దామె చీపురుకట్ట !

అదంతా చూచి , ఇక ఈ జన్మలో
వాళ్ళిద్దరూ మరి కలుసుకో రన్న లోకం
మ్రాన్పడిపోయింది మర్నాడు
ఒకళ్ళ కౌగిట్లో ఒకళ్ళని తొంగి చూచి !

జ్వరాలు , లంఘనాలు వంటివే
కలహాలు , కోపగింపులూ !
కుంభ వర్షాలు లేకుండా
కుంభిని గంధవతి ఎలా అవుద్ది ?

44. ఆశకు ఆకృతి

ఆమె నీకు తెలుసు,
నీ సానుభూతికి అనుభూతి అయిన లీల!
శివ లీలో, విష్ణు లీలో కావా లనుకొని
ఒక మిత్రరూప మహిషుడి కామలీలకు
బలై పోయిన అశ్రుమాల!
చావకుండా నేడు తిరిగి తలెత్తి
అరుణోదయాన్ని చూడా లనుకొంటూ
ఆశకు ఆకృతిగా నిల్చిన మంజుల తృణబాల!

మొన్న ఈ మధ్య —
అనుకోకుండా మేం కలుసు కొన్నప్పుడు,
ఆమె గుండె ఏటిగట్టుకు గండె పడి —
స్నేహిత నైతిక ధార్మిక సమస్తాన్నీ
తుడిచి పారేసే కన్నీటి వరదలో
మునిగి తేలుతూ, ఆమె చెప్పిన కథ —
ఒక నిరంతర మానవాత్మ వ్యథ!

ఆమె చెపుతున్నది,
నేను వింటున్నాను!
అవును —
ఆమె చెపుతున్న దంతా నిజమే!

ఏం చెపుతున్న దామె?
ఆమె ఏం చెప్పడం లేదు!
నేనే వింటున్నాను!
చిత్రంగా లేదూ?
లేదు!
పరమ సహజంగా వుంది!

వికసించా లనుకొంటున్న గులాబి మొగ్గ
బిడియ పడుతూ మోమెత్తి
ఉదయారుణుణ్ని చూడ డానికి
కను రెప్ప లెత్తి మెత్తడం తోనే
కళ్ళల్లో కారం కొట్టినట్టు

కన్నీటి కాసారమై వున్న ఆమె పెదవులు
అసలు కదలనే లేవు కదా !
ఏదో ఎలా చెప్పగలవు ?
నిజంగా ఆమె ఏమీ చెప్పలేదు ,
నేనే విన్నా నంతా !

విన గలిగిన అర్హత
ఒక్క చెవులదే కాదు ,
చెప్పే హక్కున్నది
ఒక పెదవులకే కాదు !
హృదయం పెట్టుకొనే మొరకు
శరీరంలోని ప్రతి అణువూ ప్రతినిధే !

పాపం — ఆమె హృదయాన్ని
బాదం కాయలా చిత గ్గొట్టి
ఆత్మను తినేశాడు
ఆ మహిషుడు !

మహిషుడు శత్రు వైనప్పుడు
ప్రతి రమణీ మహిషాసుర మర్దనే కాగలదు !
మహిషుడు మిత్రుడైనప్పుడు
ఎంతటి శక్తిమంతురా లైనా
ఆ తేనె పూసిన కత్తికి
బలై పోవడం సహజమేగా ?

మిత్రు డనే విశ్వాసం
గురు వని భక్తి
రెండూ రెండు పంజాలై అదిమి పట్టగా,
కామ వ్యాఘ్రం వాడి కోరలు
తన భవిష్యత్ స్వర్గ సమస్తాన్ని పీల్చివేయగా,
శవమై, అస్థిపంజరమై
నరకంలో కూలిపోయిన ఆమె
ఎలా బ్రతికి బైట పడిందో మళ్ళీ!
తలెత్తి చూస్తున్నది —
నవారుణ తరుణోదయం కోసం!

ఆమె ఏమీ చెప్ప లేదు,
నేనే విన్నానంతా!

జీవితం సుఖమయ శృంగా రోద్యానమా?
బాధామయ దుఃఖ మహా సముద్రమా?
నవ నవ నిత్యోజ్జీవన శక్తీశ్వరమా?
ఏదో తేల్చి వెయ్యా లనుకొంటున్నది లీల!
ఆమె మెడలో వేద్దాం ఒక విజయోత్సవ మాల!

45. ఎవరిని తిరస్కరించను

శాంత నా ముఖంలోకి చూచింది , నిజమే !
ఎందుకు చూచిందో అలా !
నేనూ చూశాను ఆమె మొఖం లోకి ,
ఆమె చూచింది కనుక !

కాంత నాతో భోజనం చేసింది , నిజమే !
కలిసి భోంచేద్దాం అన్నదామె ,
సరే అన్నాను నేను ,
ఆమె కోరింది కనుక !

వసంత నాతో షికారు వచ్చింది , నిజమే !
ఎందుకు వచ్చిందో మరి ఒంటరిగా !
నేనూ విహరించాను వనంలో ,
ఆమె ముచ్చటపడింది కనుక !

శకుంత పాట వినడానికి వెళ్ళాను , నిజమే !
ఎందుకు వెళ్ళా నంటే
ఆమె నాగురించే పాడినట్టుంటుంది కనుక ,
ఆమె పాట నాకిష్టం కనుక !

శాంత , కాంత , వసంత , శకుంత
ఎందరెందరో వయస్యలు నా చుట్టూ
పిలుస్తూనే ఉంటారు నన్ను ప్రతిక్షణమూ
అందిస్తూనే ఉంటారు ఏదో ఒక మాధుర్యం !

నా స్నేహాన్ని అర్థించి వచ్చే ప్రతి మూర్తి
నా లోని ఏదో ఒక కామనకు స్ఫూర్తే !
ఎలా తిరస్కరించగలను ఎవరి నైనా ?
ఆరాధనలో అసూయలు ఉండవు కదా !

46. నిష్క్రియ

" ఇంత ఎత్తున , ఇంత అందంగా
వికసించడం నా తప్పా ?
ఎందరో నన్ను చూచి ఆనందిస్తుంటే
ఎలా వారించగలను వాళ్ళని ?
నేను మాత్రం నీ దాన్ని ,
తుంచుకు పో , వచ్చేస్తా ! "
రోజా వ్రాసిన లేఖ ఇది ,
రొమ్ముకు హత్తుకో లేక పోయాను దాన్ని !

" చుట్టూ తుమ్మెదలు మూగుతున్నై
పవన కుమారుల రాపిడి హెచ్చుతోంది

నిన్నే నమ్ముకున్న పసిదాన్ని నేను
నా దినచర్య అంతా నిన్ను చూచుకోవడమే,
పట్టుకో నన్ను,
పతనమై పోనివ్వకు వృధాగా!"
సూర్యకాంత వ్రాసిన లేఖ యిది,
చో టివ్వలేక పోయాను నా కౌగిట్లో!

"క్షణ ప్రభను నేను, నిజమే,
మనస్సే కాదు, శరీరం కూడ
ఒక్కచోట నిలవదు నాకు,
అది నా స్వభావం, నేనేం చెయ్యను?
ఆ ఒక్క క్షణమూ నీకే ఇస్తా, తీసుకో!
తీసుకొని శాశ్వతం చేసుకో!"
సౌదామని వ్రాసిన లేఖ ఇది,
సాహసించలేక పోయాను దాని కోసం!

"పంకంలో పుట్టానే అనుకో,
నా పుట్టుక నా చేతిలోది కాదుగా?
పుట్టుకను మించి వికసించి
ఇందిరకే మందిరం అయినాను,
నీ తరుణోదయం ఒక్కసారి రుచిగొననీ!
నా జన్మ తరింప జేసుకోనీ!"
రాజీవ వ్రాసిన లేఖ ఇది,
రాత్రి మాటున దాక్కొన్నాను నేను!

47. బీజ భవిష్యం

కన్నీరు తుడుచుకోవడం కూడ మరచిపోయి,
ఎవరికోసం అలా నిరీక్షిస్తున్నావు, లతా?
ఏ గాలికో కొట్టుకొచ్చిన ప్రేమ బీజం
నీలో అంకురించి ఫలించడం కోసమేనా?

నీ చుట్టూ, నీ కోసం పూచి ఫలించి ఉన్న
ఈ ఆరామ తరులతాదు లన్నీ కూడ
ఎప్పుడో, ఏ గాలికో కొట్టుకొచ్చి
ఎవరిలోనో పడి మొలిచిన ప్రేమబీజాలే!

అవి ప్రేళ్లూని, ప్రమాను కట్టే టప్పటికే
ఆయా హృదయాలు పాత ఘాలకుండీలై
పగిలి నశించి పోయినై కాల గర్భంలో
ఆశించిన ఫలాలను రుచి చూడకుండానే!

నీ హృద్గత బీజాన్ని పెంచి పోషించుకో,
దాని ఫలాలు భవిష్యత్తువి, నీవి కావు!
నీ వైన మాధుర్యాలు ఇవిగో, నీ చుట్టూ!
తనిసి సుఖించు, సుఖపెట్టి తరించు!

ప్రేమ హార్దికం, కామం శారీరకం,
రెండూ కలిసి తీరడమే పరమానందం!
దేని కదే అయినా బాధ లేదు —
రెంటికీ నీవు అతీతురాల వైనప్పుడు!

48. పేరేదైనా

నీ పేరేమో గాని , శకుంతా !
నా హృదయం మృదంగ మయింది నీ పాటకు !
నీ పేరేమో గాని కుసుమా !
నా చిత్తం ప్రఫుల్ల మయింది నీ మైత్రిలో !

ఎందరి పేర్లో తెలియవు , ఎందరికో పేర్లుండవు ,
ఉన్న పేర్లు పోతై , లేని పేర్లు పుడతై ,
ఏం ఉంది పేరులో ? ఎందుకు పేరు ?
వ్యక్తి కదా ప్రధానం వ్యక్తికి ?

నీ పేరేదైతే నేం ?
నాకు కావలసింది నీవు !
పేరు మారినా పదార్థం మారదు ,
పదార్థం మారినా పరమార్థం మారదు .

ఏ పేరున ఉన్నా నీవే ,
ఏ రూపాన ఉన్నా నీవే ,
ఏ తీరాన ఉన్నా నీవే ,
నా దానవు ! నా ఆనందానవు !

శరీరంతో ఆత్మా, ఆత్మతో శరీరమూ
రమించనీ నిరంతరం మనలో !
పేరులో ఏం ఉంది పెన్నిధి?
వ్యక్తికి కావలసింది పైవ్యక్తి సన్నిధి !

49. మనస్సులో మెరుపులు

మనస్సులో మెదిలిం దొక మధుబాల ,
కన్ను కొడుతోంది ఎదర దొడ్లోని గులాబి ,
తావులు తెలుపుతోంది కొండమీది సంపంగి ,
చిరునవ్వులు పంపుతోంది చెరువునుంచి కమల !

పేరు పెట్టే పిలుస్తోంది పేరు తెలియని శకుంత ,
ఎవరి కబురో చెపుతోంది చెవిదగ్గర భ్రమర ,
ముద్దులుపెడుతోంది ప్రక్కనున్న మల్లిక ,
కౌగిట బిగిస్తోంది పైకొన్న పిల్ల తెమ్మర !

ఒకర్ని గురించి భావిస్తూ , ఒకరి కబుర్లు వింటూ
ఒకరి అందాన్ని పొగడుతూ, ఒకరితో ఆడుకొంటూ
నీ కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను
ఈ కలువ కొలని నీటి వొడ్డున నేను !

నా చుట్టూ ఇన్ని అందాలు
నా కోసం వికసించి ఉండగా ,
దేని ఆనందం దాని కివ్వ వద్దా ?
దేన్ని కాదంటే అదే రాలి పోదా ?

మల్లె , గులాబి , కలువ , కమల ,
అన్నీ అందాలే , ఆనందం కోరేవే !
నేను తమను ఉపేక్షించినా
నన్ను ఉపేక్షించని స్నేహా లవి !

ఇంత పరా ధీనుణ్ణై ఉండి కూడ
కూర్చున్నానిక్కడ స్వతంత్రంగా ,
నీ వెవరో తెలియని నాటినుంచీ కూడ
నీ కోసమే ఎదురుచూస్తూ !

50. వెతుకుతూనే ఉండేవి

వెతుకుతూనే ఉండేవి నా కళ్ళు
చిన్నప్పటి నుంచీ ఎందుకో, దేనికోసమో
వెతుకుతూనే ఉండేవి నలువైపులా .

పువ్వుమీద నుంచి పువ్వుమీదకు
క్షణం తీరిక లేకుండా తుమ్మెదల్లా
స్వేచ్ఛా విహారం చేసేవి నాకళ్ళు !

నా కళ్ళు పడితే చాలు
మ్రోళ్ళు కూడ మొగ్గ తొడిగేవి
మొగ్గలు ముందుగానే వికసించేవి .

నందనం కన్న మిన్న మా కోనసీమ
దివిజ గంగ వేణి మా గోదావరి ,
రంభోర్వశులు మా సీమ వయ్యారులు .

ఋతు రామ లార్వురూ ఒక్కొకరే కాక
అందరూ కలిసి బృంద నాట్యం చేసే
పరమ వసంతం మా ప్రాంతం .

కెరటాల కెంపుల్లో , మెరుపుల విరుపుల్లో ,
కాటుక కన్నుల్లో , వెన్నెల అన్నుల్లో
రెప రెప లాడేవి నా కళ్ళు !

ఈద రమ్మని అందాల సరసులు
గ్రోల రమ్మని తీయని తేనెలు
పిలుస్తూనే ఉండేవి నన్ను అనుక్షణం !

పిలుపులకు , కన్నీళ్లకు , కోపాలకు , హేళనలకు
చిరునవ్వుల్ని మాత్రం పంచిపెడుతూ ఇంకా ,
వెకుక్కొంటూనే ఉండేవి నా కళ్లు !

ప్రకృతి నిండా ప్రతిధ్వనించిన ఒక వీణా రవం
గుండెను మీటగా పైకి చూశాయి కళ్ళు !
అప్పటి నుంచీ అక్కడే ఉండిపోయా యవి !

51. పరాధీన స్వర్గం

నీ వియోగం దుర్భరమై పోతున్నది నాకు
చచ్చిపోవా లనిపిస్తున్నది , కాని —
నీవు దగ్గర లేకుండా ఎలా చావడం ?
నీవు దగ్గర వుంటే ఎందుకు చావటం ?

నీ పర్యటన ఒక విలాస యాత్ర
నా యాత్ర ఒక కర్తవ్య నిర్వహణ !
నీవు స్వతంత్రుడివి , నేను పరాధీనను ,
నీది భావుకత , నాది జీవిత వాస్తవికత !

నిన్ను చూడా లనుకొన్నప్పుడు చూడలేను
నా జీవిత రచన నా చేతిలో లేదు ,
పరాధీన స్వర్గం కంటె
స్వేచ్ఛా నరకమే మేలు కదా ?

అందుకే నా కంటికి —
ఈ పుణ్యక్షేత్రాలు ఊషరక్షేత్రాలు ,
ఈ క్షేత్ర దేవతలు శుష్క శిలా శకలాలు
ఈ యాత్రలు వృథా కాలక్షేపాలు !

తీరిగ్గా కూర్చొని కలలు కనే నీకు
నేను సహస్ర ముఖ దేవీ మూర్తినే కావచ్చు ,
నా కిష్టం లేని పని చెయ్యక తప్పని నాకు
లోకమే విష పాత్రగా కనిపించదా ?

52. ప్రేమలేఖ - శివాలక

" ప్రేమలేఖ కాబోలు ! " అన్నాడు ఒక మిత్రుడు ,
" ఎవ రన్నారు ? " కదిలాయి నా పెదవులు ,
" ముఖం మీద మెరుపు " అన్నాడతడు !
ఓహో , నీ లేఖ కెంత కాంతి !

గుడులు , గోపురాలు , వాటిలో విశ్వాసం ,
యాత్రాభిలాష , అందుకు తగ్గ తీరిక ,
శీతకాలం ప్రొద్దులా దిగజారిపోతున్న నేడు
సంధ్యారాగంలా ఉంది మన అనురాగం !

అన్నం బ్రహ్మ పదవిలో ఉండే కాలంలో ,
ఆనందమే జీవిత పరమార్థమై ఉన్నప్పుడు ,
జీవించడం కోసమే అన్నం ముట్టేవాడు
ఆనందం కోసమే జీవించేవాడు మానవుడు !

మానవుడు యంత్రాన్ని నడిపిన రోజు లవి ,
యంత్రమే మానవుణ్ని నడుపుతున్న రోజు లివి ;

అయినా , దాని దారికి దూరంలో కూర్చుని
ఆనందాన్ని ఆరాధిస్తున్నాం మనం !

" దారిలో ఏది దొరికితే దాన్ని మింగేస్తూ ,
యంత్రం వెంట పరిగెత్తే ఈ ఆకలి యుగంలో
దూరస్థ సుధా కలాశాన్ని తలచుకొంటూ
గుటకలు మ్రింగడం వింతే " అన్నాడతడు !

ఇప్పటి కిది వింతే కావచ్చు ,
ఈ వింత కూడ ఇకముందు ఉండక పోవచ్చు ,
మానవుణ్ణే మింగేసి యంత్రం జీవించే కాలం
వస్తే రానీ — అప్పటికి మనం ఉండం .

ఏకాంతంలో కూర్చుని
ఏ కాంతనో , కాంతుణ్ణో స్మరించు కొంటూ ,
స్మరణే కరుణామృతంగా గ్రోలుతూ
జీవించడం ఎంత దివ్యం !

నీ రాక కోసం నేను ఎదురు చూచే కాలం
నిజంగానే అంతరించి పోతుందా , దేవీ ?
కేవల భౌతికావసరాలు తప్ప
మరే ప్రేమలూ , రసాలూ ఉండవా ఇక ?

అయితే మరో నూరేళ్ళ తర్వాత
ఈ మన ప్రేమ లేఖల రేఖలు

అరణ్యంలో కేకలు మాత్రమేనా ?
ఏ వలపు కాకకూ తలిరాకులు కూడ కావా ?

మరో నూరేండ్ల తర్వాత
నా కోసం తపించిన నీవూ
నీ కోసం పరితపించిన నేనూ
పిచ్చివాళ్ళ అవశేషాల మేనా ?

చీర డాబులకే తప్ప
ప్రేమ జాబులకు అర్థం ఉండదా ఇక ?
హోటలు భోజనాలేనా ఇక స్త్రీలు ?
ఆత్మానందం పిచ్చాసుపత్రేనా ఇక ?

ఇంకా ఆకాలం రాలేదులే ,
వస్తుందంటారు భౌతిక వాదులు ;
అలాంటి కాలమే వస్తే
ఆ తర్వాతది మళ్ళీ మన కాలమే !

వట్టి ప్రేమ లేఖ మాత్రమేనా ఇది ?
నా మనో మండలంపై ఉదయకాంతి రేఖ !
ఆటంబాంబుల కెంత శక్తి వున్నా
అరుణోదయాలను ఆపలేవుగా !

అందుకే అన్నాను మిత్రుడికి —
" ప్రేమలేఖ కాదు , శివాలక " అని !

శివాలకలు

...:(o):...

విలాసం నాలుగు

*

హృల్లేఖం

నీవు దగ్గర లేనప్పుడు
ఈ పువ్వులు నాకేం అంద మిస్తై ?
ఈ పండ్లు నాకేం రుచిస్తై ?

నీవు దగ్గర లేనప్పుడు
ఈ కలువ తోటల వెన్నెల పాటలు
నన్నేం అలరిస్తై ? ఏం ఆనంద పరుస్తై ?

నీవు దగ్గర లేనప్పుడు
లోకంలోని సౌందర్యా లన్నీ కూడినా
నీవు లేని లోటును భర్తీ చేయగలవా ?

కాని — కాని —
నీవు దగ్గర ఉన్నప్పుడు
తక్కిన ఈ ప్రాభవా లన్నీ నా కెందుకు ?

54. మహామాయ

శ్రీశైలానికి వ్రాసిన నా లేఖ
శ్రీరంగంలో అందిం దన్నమాట నీకు !
పూరీ జగన్నాథానికి వ్రాస్తున్నా ఇప్పుడు దీన్ని ,
హృషీకేశంలో అయినా అందితే , ధన్యుణ్ని .

మీ అవ్వ చాల అమృతాత్మక కదూ ?
తాను చూస్తూ , నీకు చూపుతున్నది లోకాన్ని !
తాను తరిస్తూ , నిన్ను తరింప చేస్తున్నది !
" మహా మాయ " పేరును సార్థకం చేసుకొంటున్నది !

కొందరు కొంద రుంటారు లోకంలో —
కొంద రేమిటి , మెజారిటీ వాళ్ళే !
తాము తినరు , ఇతర్లను తిననివ్వరు !
తాము తినలేరు , మరొకళ్లు తింటే ఏడుస్తారు !

అంతా తామే తినేసి , పొట్టలు చెడి చస్తారు కొందరు ,
ఎంత తిన్నా ఆకలి తీరదు కొందరికి !
తినగా మిగిలిం దైనా ఇతర్లకు పెట్టరు కొందరు
ఊరంతా నొల్లుకొని కుళ్ళబెడతారు కొందరు !

విధవిధాల మనుష్యులు , వెర్రి వెర్రి మనస్సులు ,
అర్థంలేని స్వార్థాలు , అక్కర లేని అంతరార్థాలు !
ఒక్క డబ్బు సంపాదన లోనే కాదు ఈ దుస్థితి ,
పారమాత్మిక సంవేదనలో కూడ అంతే !

తరించు • తరింపజెయ్యి అంటుంది మతం ,
మతధర్మాలను భూ స్థాపితంచేసి
వాటి ప్రేతాలకు గుడులు కడతారు
నర బలు లిచ్చి పూజిస్తారు మతస్థులు !

ఒక్క నోరు మాత్రమే బ్రతికి ఉండి
తక్కిన అంగాలన్నీ చచ్చిన కళేబరం సమాజం ,
ఆ నోటికి ఒక హద్దూ , పద్దూ లేదు —
దొంగ తిళ్ళూ , ఎన్నికల వాగుళ్ళూ తప్ప !

పదవులో , ప్రమోషనులో , రోగ నివారణో ,
వ్యాపార విజయమో — మరేదో ప్రయోజనం తప్ప
ఎవరూ ఏ దైవానికీ టెంకాయ కొట్టని
ఈ వర్తమాన కాలంలో
మీ అవ్వలాంటి వాళ్ళు
అనాసక్త రక్తికి ఆనవాళ్ళు !

తామే నీ దర్శనానికి రావలసిన దేవతలకు
నీవే వెళ్ళి దర్శన మిస్తున్నా వంటే —
ఎంత తేజోవంతమో వాళ్ళ ఉపస్సు !
ఇంకా ఎంత కాలమో నా ఈ తపస్సు !

55. సహస్రముఖ

కలువలు, కమలాలు, కనకాంబరాలు,
మల్లెలు, మాలతులు, మందారాలు
చేమంతులు, సంపెంగలు, సన్నజాజులు,
చుట్టూ పువ్వులు, పువ్వులు, పువ్వులు!

ఎన్ని రకాల రంగుల పూలైనా —
అన్నీ ఒక తోట లోవే!
ఎన్ని తోటల పేటల పూలైనా —
అన్నీ ఒక పూజ లోకే!

ఈ పువ్వుల తావుల్లో మత్తెక్కి
ఈ పువ్వుల స్పర్శల్లో మై మరచి
అరమోడ్పు కన్నులతో చుట్టూ చూచుకొంటే
ఈ పువ్వులన్నీ నీ చిరునవ్వుల ముఖాలేగా ?

ఎన్ని ముఖాలు ! ఎన్ని రూపాలు !
ఎన్ని అందాలు ! ఎంత మాధుర్యం !
పుష్పోత్సవ సమూహారమా ఇది ?
నీ సహస్ర ముఖ దేవీ స్వరూపం !

ఇది నీ సత్యం , నీ వెంత కాదన్నా !
ఇప్పు డర్థ మయింది నీ లేఖ !
ఈ క్షేత్రాలన్నీ నీ మూర్తులే ,
క్రొత్త ఏం కనిపిస్తుంది నీ కక్కడ ?

నీవు నా ఎదుట ఉన్నప్పుడు
ఏక రూప రాగ రాజ్యదవు నీవు !
నన్ను ఎడబాసి ఉన్నప్పుడు
బహురూప ప్రణయ పరమేశ్వరివి నీవు !

56. ఇహ పర సాధనం

అంతరాత్మ ఆదేశం , సమాజ నిర్దేశం —
ఆ రెంటికీ సమన్వయం కుదర నంతకాలం
జీవితం సమర సీమే ,
సంసారం నిస్సారమే .

అంతరాత్మ పరమాత్మకు ప్రతినిధి
అది నిత్య నవోన్మేషంగా విస్తరిస్తుంది ,
సమాజం ఆత్మరక్షణ పరతంత్రం
ఎక్కడి కక్కడే దాని చుట్టూ ఒక మహా దుర్గం !

మానవుని మస్తిష్కం పరమ సంక్లిష్టం ,
దాని అధికారపరిధి అపరిమితం .
దాని క్రియాకలాపం అవాఙ్మానస గోచరం ,
అది అతడికే లొంగదు , సమాజానికా ఒంగుతుంది ?

అందుకని — దేవీ !
అంతరాత్మ మేల్కొని ఉన్న ఎవరికైనా సరే
సమాజంతో సంఘర్షణ తప్పదు
జయం ఎల్లప్పుడూ సత్యం వేపే మొగ్గదు.

అంతరాత్మ నోరు మూసి
సమాజాన్ని అనుసరించడం ఇహం ,
సమాజం నోరు నొక్కి
అంతరాత్మను అనుసరించడం పరం !

సమాజాన్ని రథంగా చేసుకొని
అంతరాత్మ జవనాశ్వాన్ని దానికి పూన్చి
చబుకు ఝుళిపించడమే
ఇహ పరాలను సాధించడం !

57. నే నే లేఖ నై

ఫలానా తేదీకి ఫలానా చోటికి అందేలా
లేఖ వ్రాయ మంటే ఎలా ?
నీ లేఖ నాకు చేరే టప్పటికే
నీవు పెట్టిన గడువు దాటిపోతున్నది !

రాకడ ఒక రోజు , పోకడ ఒక రోజు ,
నా దగ్గర ఒక రోజు , నీ కందేది ఒక రోజు
పోస్టు బంట్రోతుకు తలనొప్పి వస్తే ఒక రోజు
రైలు బద్ధకిస్తే మరొక రోజు !

కొసరు ఇంకొకరోజు తో వారం లెక్క కట్టి ,
నీవు పెట్టే గడువు ఖచ్చితంగా తిరుగు లేనిదే !
అయితే — దేవీ , అదే మానవుడి గొప్పతనం ,
చచ్చినా ఒక తక్కెడకు కట్టు పడని కప్పతనం !

సూర్యు డెప్పుడు ఉదయిస్తాడో , అస్త మిస్తాడో
ఏ క్షణం ఏ డిగ్రీలో ఉంటాడో చెప్పగలం !
మానవుడి గురించి చెప్పగలమా అలా ?
పోస్టు బంట్రోతూ మానవుడే , మార్తాండుడు కాడు .

సరే — ఇప్పు డెలా ?
రోజు రోజుకూ మారే నీ చిరునామా
మారని నా లేఖకు ఎక్కడ దొరుకుద్ది ?
జడతకు చేతనకు పొందెలా కుదురుద్ది ?

మన లేఖలు రామ చిల్కలు కాగల్గితే ?
కాలరథం కళ్ళెం మన చేతికి వస్తే ?
మనకు కామరూపం , మనో గమనం సిద్ధిస్తే ?
ఓహో — ఎంత బాగుండును !

నా విరహ వహ్నిస్ఫులింగాలే అక్షరాలుగా
నా ప్రణయారుణ హృదయమే సిరాబుడ్డిగా
నా ఉన్మనస్కతే లేఖనిగా , నేనే లేఖనై
క్షణంలో వచ్చి వాలనా నీ నిరీక్షా ప్రాంగణంలో ?

వెంటనే — నీవు నా కవరు చించేసి ,
కరస్పర్శతో చైతన్యం కదిలించి
మడతలు విప్పి , నన్ను మళ్ళీ మనిషిని చేసి ,
హత్తుకోవా నీ హృదయానికి !

ఇదిగో ఈ లేఖ దిగంబరంపై వ్రాసి
విశ్వాంబరంలోకి ఎగర వేస్తున్నా !
అందుకో ఆశాంబరంలో ,
చదువుకో చిదంబరంలా !

58. జీవితానికి లక్ష్యం

జీవితానికి లక్ష్యం ఏమిటి ?
నీకూ ఎదురయిం దీ ప్రశ్న !
అవును , ఎందుకు ఎదు రవదు ?
మ నందరికీ పెద్దక్క కదా అది ?

విష్ణువు నాభి కమలంలో మూర్తిగొన్న బ్రహ్మ
శ్రీకారం చుట్టి చేసుకొన్న తొలి సృష్టి ఇదే !
నే నెవరు ? ఎందుకు పుట్టాను ? ఏం చెయ్యాలి ?
ఈ నాటికీ అదే ప్రశ్న జవాబుకు ఎదురు చూస్తూ !

తానెవరో , ఎందుకు పుట్టాడో తెలియలేదు బ్రహ్మకే !
ప్రశ్నే కాని , జవాబు తన అధీనంలో లేదు
ఏం చెయ్యాలో కూడా తెలియదు ,
అయినా , చేసేస్తున్నాడు తోచి నట్టెల్లా !

బియ్యపు గింజకోసం బారు తీరిన చీమలు
బస్సు టిక్కెట్టు కోసం కుప్ప పడ్డ కప్పలు

అన్న సత్రం వరుసలో మూగిన ఈగలు
ధర్మ దర్శనం క్యూలో ముస్తాబైన కోతులు
గులాబీ తీగల నీడల్లో ఆకు తేళ్ళు
గంధపు చెట్ల కొమ్మల్లో నాగుబాములు
పదవుల చుట్టూ ఆబోతులు
ఆబోతుల చుట్టూ ఆబాల గోపాలం !

ఇదే కదూ నీవు అసహ్యించు కొంటున్న లోకం ?
ఇంత కంటె ఏం చెయ్యగలడు బ్రహ్మ మాత్రం ?
అసలు ఎందుకు చెయ్యాలి అనేదే నీ ప్రశ్న అయితే
దానికి జవాబు మళ్ళీ ప్రళయమే !

ఒక పొరపాటు తెలిసి జరిగినా తెలియక జరిగినా ,
ఈగలా ఈనుతూనే ఉంటుంది లక్షోప లక్షలుగా !
లోకమే ఒక పెద్ద పొరపాటుకు సగోత్రజమో ,
బ్రహ్మ తెలివికి ఒక మచ్చుతునక మాత్రమేనో !

తెలివైన వాడో , తెలివి తక్కువ వాడో
తోచి చేస్తున్నాడో , తోచక చేస్తున్నాడో
అడిగే అధికారం లేదు మనకు ,
జగప్రభుత్వం ప్రజా స్వామ్యం కాదు !

అదృష్ట జాతకుడైన ఒక నిరంకుశ ప్రభువు క్రింద
సర్వ స్వతంత్రమైన త్రి సభ్య మంత్రి వర్గంలో
సృష్టి శాఖకు సర్వాధి కారి బ్రహ్మ !
అతడి ఇష్టా నిష్టాలే లోకా లోకాలు !

ఒకడు ఇష్టం వచ్చినట్లు కని పారేస్తూ ఉంటే ,
మరొకడు వాళ్ళని పెంచలేక చస్తుంటే ,
మూడో వాడు చూస్తూ ఊరుకోవాలా ?
లయకారుడిపై కళ్ళెర్ర జేసి ఏం లాభం ?

ప్రపంచాన్ని చూస్తున్న కొలదీ
దైవంపై విశ్వాసం పోతున్నది కదూ నీకు ?
విశ్వాసాన్ని దున్ని వివేకాన్ని పండించ డానికే
ఈ క్షేత్రాలూ , ఈ యాత్రలూ !

నీ మనస్సు ఎంత వికలంగా ఉన్నదో
నీ లేఖ చెపుతున్నది ,
ఎన్ని కొట్టివేతలు ! ఎన్ని తుడుపులు !
బ్రహ్మ సృష్టికి ప్రతి కృతి నీ లేఖ !

జీవితానికి లక్ష్యం ఏమిటి ?
బ్రహ్మకే లేని లక్ష్యం నీకూ , నాకూ ఎందుకు ?
జీవించడమే జీవిత లక్ష్యం .
ఎలా జీవించినా సరే !

నీకు నీవై చేస్తున్నా , మరొకరి ఆజ్ఞను పాలిస్తున్నా ,
నీ చేతిలో వున్న పని నీ పనే !
నీ పనిని నీవు చెయ్యడమే నీవు జీవించడం !
భద్రంగా త్రిప్పుకు రా మీ అవ్వను !

59. భ్రాంతికి బానిసలు

ఆశతో ముందుకు సాగుతారు కొందరు
స్మృతులతో గతంలోనే బ్రతుకుతారు కొందరు.

గతం లేని, భవిష్యత్తు కనిపించని, ఎంతో మందికి
వర్తమానం ఒక మధు శాల —
అది బ్రాందీ విస్కీల బార్ కావచ్చు
కల్లు సారాల కొట్టు కావచ్చు.

విస్కీ వంచే సాకీ కానీ
కల్లు పోసే గంగి కానీ
అమృతం పంచిన అలనాటి మోహినికి
అపరావతారాలు , ఆనంద రూపాలు !

మధువుతో వచ్చే ఆనందం
నాటకంలో దొరికే మహారాజ వేషం ,
రాజస బూర్జువాలు , తామస కార్మికులు కూడ
వాస్తవం లభించని భ్రాంతి జీవులు !

బూర్జువాలు పీఠాధి పతుల్ని సేవిస్తే
శ్రామికులు గ్రామ దేవతల్ని కొలుస్తారు ,
ఇరు వర్గాలూ భ్రాంతికి బానిసలే !
సత్యం చెప్పే పిచ్చుకల్ని చంపేసే కోతులే !

ఇంతకూ — ఇందులో మీ అవ్వ ఎవరు ?
తా నెవరో తెలుకో లేని అంధకారం !
దర్శించనీ ప్రతి గ్రహాన్ని , ప్రతి తారనూ
నడిపించుకురా సూర్యోదయం కేసి !

60. ప్రకృతి మహా సర్పం

ఈ ప్రకృతి ఒక మహా సర్పం ,
తలా , తోకా జనన మరణాలు ;
ద్వారాన్ని పెకల్చు కొని రావడం ,
గృహాన్నే కూల్చు కొని పోవడం !

ఈ విశా లోద్యాన
ప్రవేశ నిష్క్రమణ ద్వారాలు
ఇంత ఇరుకెందుకో !
తలే కాని తోక కనిపించని ప్రవేశం !
తోకే కాని తల కనిపించని నిష్క్రమణం !

ఈ నిరంతర పురోగమనంలో
ఈ తలా తోకా లేని మహాద్భాగ్యానికి
ఎందుకో ఇంత వేదన !
ఎందుకో ఇంత రోదన !

61. నిండుగా పూచిన గున్న

నిండుగా పూచిన గున్నమామిడివి నీవు !
నా చూపులో శోభావతు లిద్దరే —
నీవూ , రసాలినీ !

రసాలిని వికాసం ఏడాది కొకసారే ,
క్షణాని కో కొత్త అందం తొడుగుతావు నీవు !
నిరంతర వసంతానివి నీవు !

దగ్గర ఉన్నప్పు డేనా ?
లే నప్పుడు కూడ అంతే ,
ఉండడం లేకుండడం లేవు మనకు !

బంధు కోటిలో ఉన్నా వనుకొంటారు నిన్ను ,
ఒంటరిగా ఉన్నానను కొంటారు నన్ను .
ఏదో ఒక్కచోట ఉండడ మేమిటి మనం ?

ఎక్కడ ఏ అందం వికసించినా — అది నీవే
ఎక్కడ నీవు కనిపించినా - అది నేనే
ఎక్కడ నేను ఉన్నా — అది ఆనందమే !

ఈ ఉదయమే అనుకొన్నాను నేను
వసంతాగమన సౌరభ్యాన్ని ఆఘ్రాణిస్తూ
నీవు వచ్చేశావా అని !

62. గోరింక పిల్ల

మన ఉద్యాన వనంలో ఒక గోరింక పిల్ల ,
దాని కళ్లు నిన్నే జ్ఞప్తికి తెచ్చేవి!
చిలకా గోరింకల్లా వుండే వాళ్ళం మనం ,
మనల్నే ఆరాధించేది రోజెల్లా వనం !

చిలకా గోరింకల్లా అంటే —
చిలకల్లా , గోరింకల్లా అని అర్థం !
నా వంక నీలా చూచే ఆ పిల్ల వంక
నీ వంక వలె చూచే నా వంక

గోముగా చూస్తూ ఆ గోరువంక
స్నేహమయింది కొద్ది రోజుల్లోనే నాకు !

నే నొక మనిషిని —
అందరు మనుషులూ ఒకటే
ఆ గోరింక దృష్టిలో !
నాతో వలెనే అందరి తోనూ
స్నేహంగా మెలగసాగింది
చేరువగా పోసాగిం దది !
వద్దని నే నెంత చెప్పినా
అర్థం కాలేదు దానికి!

ఒక సాయంకాలం
ప[illegible]చకలో నడుస్తూ —
నా మీద కెగిరిన
[illegible]నాలుగు మిడతల్ని పట్టుకొని
[illegible]చెం ఆలశ్యంగా వచ్చాను
[illegible]ను కిందికి !
[illegible]క్కడ గోరింక లేదు !

ఏ కొమ్మపై వున్నా
ఏ గుబురులో వున్నా
ఆటలో వున్నా , వేటలో వున్నా
సంగీత కచేరీలో వున్నా
సాహిత్య గోష్ఠిలో వున్నా

ఆ గోరింక —
అల్లంత దూరంలో నన్ను చూడగానే
రివ్వున వచ్చి వాలేది
నా ఎడమ చేతిపై !

ఏదీ ? రాదే !
ఏమై పోయింది ?
నా చెలులలో చాలా మంది వలె
నన్ను వదిలేసి పోయిందా ?
ఎందరు నన్ను వదిలేసి పోయినా
నేను మాత్రం ఎవర్నీ వదలలేను !

కొమ్మల్లో వెతికాను
కోనల్లో వెతికాను
ఎక్కడా కనిపించ లే దది !

నాకు కనిపించిం దెల్లా —
నేను వెతుకుతున్న ఒక దారిలో
రెండు మండిన అగ్గి పుల్లలు ,
కాలిన కొన్ని కట్టె ముక్కలు !
నన్ను కూడ అనుమానించి ,
బెదరి చెదరి పోతున్న కొన్ని చిట్టీకలు !

63. ఆత్మీయులైన వాళ్ళు

[illegible]యులైన వాళ్ళు కలలో కనిపించి నప్పుడు
వాస్తవంగా చూడాలని ఉంటుంది వాళ్ళను !
కళ్ళు మూస్తే నీ తోనే ఉంటాను నేను ,
అందుకే నేమో వాస్తవం దూరమైపోతున్నది !

వచ్చేస్తున్నాం అని వ్రాశాను కదూ ?
ఎంత సేపు కూర్చున్నావో ఎదురు చూస్తూ !
ఎంత పరితపించావో లేచి పోతూ !
ఏం చెయ్యను నేను ?

వ్యక్తిగతమైన భావ వ్యగ్రత కంటె
కర్తవ్య పాలనమే ప్రధాన మంటూ
లేఖలో నీవు చేసిన సిద్ధాంతమే
కారణ మయింది నీ ఆశాభంగానికి !

నీ లేఖ చూచింది మా అవ్వ ,
" ఎంత మంచివాడే , రాజా ! " అన్నది
అన్నపూర్ణా విశ్వేశ్వరులకు
ఆ రాధన చెయ్యించింది నీ కోసం !

పార్వతీ పరమేశ్వరుల అంశల మట మనం
లోక కల్యాణమే మన కల్యాణ మట
లోకంలో తాను ఒకతె అట
తన పుణ్యంలో కొంత మన కిస్తుం దట !

నాకు అర్థంకాని దెంతో చెపుతుంది ,
నాకు వ్యర్థ మనిపించే దెంతో చేస్తుంది ;
నాకు నీ వొక్కడవే సర్వస్వమూ
ఆమెకు ప్రతి రాయీ ఒక భగవంతుడే !

ఇంతకూ జరిగిందేమి టంటే —
యాత్రా స్థలాల జాబితా పెరిగింది !
మన విరహాగ్నిలో మరింత ఇంధనం పడింది !
నీ పుట్టిన రోజు పండక్కి కూడా రాలే నేమో !

64. రోజూ ఒక ఉగాది

వచ్చేస్తున్నది ఉగాది ,
త ఉగాదిని జ్ఞప్తికి తెస్తున్నది నీ లేఖ .
నిరుడు ఈ రోజు తెల్లవారుజామున
హిమానీ సాగర తీరంలో కూర్చున్నాం కదూ ?

నా ఒడిలో కూర్చుని
శిరోజాలు నా ఉరోరంగం నిండా విరజిమ్మి
చెక్కిలి చెక్కిలిపై రాస్తూ పాడుతున్నావు నీవు
" పాలకడలి తరగలలో " అంటూ !

సహస్రదళ పద్మ వనిలో , పాలవెల్లి ఒడ్డున
వీణ మీటుతూ , నీ పాటకు శ్రుతి కలుపుతూ
విశ్వచేతనను పాలిస్తూ కూర్చున్నది వాణి !

సప్తర్షులు తలుపులు మూసుకొంటున్నారు ,
ఒక అరుంధతి ఇంటనే వెలుగుతున్నది దీపం .
తక్కిన ఆరుగురూ కృత్తిక లై పోయారు పాపం ,
తాము చెయ్యని పాపానికి శిక్ష అనుభవిస్తూ !

పురుషుడూ , సంఘమూ స్త్రీకి చేసే అన్యాయానికి
ప్రత్యక్ష నిదర్శనం కుమార సంభవ గాథ !
అత్యాశకు ఉదాహరణ అభిజిత్తు ,
అసూయ వల్ల అసలుకే మోసం తెచ్చుకొన్న దామె !

దక్షిణానికి తొలిగి తప్పుకుపోతున్నది వృశ్చికం
మన జోలికి రాని విమర్శక లోకం లా !
తూర్పున అడుగో చెరకు విలుకాడు
తొంగి చూస్తున్నాడు మన వంక దొంగలా !

ఏ విరహంతోనో నిరంతరం కొట్టుకునే
సముద్రుని గుండెల నుంచి పొడుచుక వస్తున్న
బాణముఖం లాంటి ద దేమిటి
ఎర్రగా నెత్తురు చిందుతూ ?

ఓహో , ఎంతటి రమణీయ దృశ్యం !
అదిగో చంద్రోదయం !
చెరకు విల్లును నమిలేసి , నెల వంకను చేతబట్టి
శుక్ర సాయకం సంధించాడు మరుడు మనకేసి !

సడుం వంగిపోయిన ముసలి చంద్రుణ్ణే భరించలేక
వణుకుతోంది తరంగాలపై భద్రతార !
ఫాల్గున బహుళ త్రయోదశిలా వుంది
ఇక రేపో , ఎల్లో ఉగాది !

శుక్ర చంద్రుల మనోజ్ఞ కౌముదిలో
అవ్యక్త మధురంగా కరిగిపోయాం మనం !
ప్రణయ లోకం నిండా ఉషఃకాంతి నింపాం మనం
అమావాస్యకే రాధా పూర్ణిమ మన ప్రేమ !

ఇంతకూ రాధ ఏదీ అంటూ
రోదసి కేసి చూశాను నేను ,
ఇదిగో మాధవుడి ఒడిలో అంటూ
ఇటు తిరిగావు నీవు !

కో అన్నది చిరు చీకటి మావి కొమ్మ ,
పకాలు మన్నది జీడిపూల లేత పరిమళం ,
ఒళ్ళు గిల్లుకొని లేచి చూశాను నేను చుట్టూ
ఏముంది ? అంతా నిరుటి ఈ రోజు భ్రాంతి !

65. రస రమ

నక్షత్ర మండలం అనే వేప పూగొమ్మను
వ్రేలాడు తున్న తేనె పట్టా అది ?
చైత్రీ పూర్ణేందు బింబమా అది ?
సత్యనారాయణ శ్రీ ప్రసాదం ముద్ద అది !

శుక్ల పక్షమే మన వ్రత కాలం ,
వ్రతాంతంలో అనుభవించేదే కృష్ణ పక్షం ,
పూర్ణానుభవ పరమస్థితే అమావాస్య !

వ్రతం , వ్రత ఫలం , వ్రతఫలానుభవం
ఇదే మన జీవిత వృత్తాంతం ;
మన పడక గది ముత్యాల రోదసి ,
మన ఆహారం జాబిల్లి హల్వా !

శరీరాలు ప్రధానం కా దనేదీ నీవే ;
శరీరాల ఎడబాటుకు బాధపడేదీ నీవే ;
ఇక్కడ నాకూ , అక్కడ నీకూ ఇదే ప్రసాదం ,
మన ఉభయుల వ్రతాలకూ ఏక ఫలం .

కాగా , ప్రియా ! వద్దు సంవేదం ,
నాటి నీవూ , నేటి నీవూ ఒక్కరే !
నాటి నీవు ప్రత్యక్ష శృంగార కళవు ,
నేటి నీవు విప్రలంభ రస రమవు !

66. పరమ ధూర్తుడు

ఓహో పరమ పురుషు డెంత ధూర్తుడు !
నలిపేశాడు , గిచ్చేశాడు , కొరికేశాడు ,
నమిలి ఉమిసేశాడు రాత్రంతా
ప్రకృతి కాంత మృదు శరీరం సమస్తం !

మిరప మందారాలా అవి ?
నెత్తురు చిందుతున్న నఖ క్షతాలు !
ఎర్రగులాబి పువ్వులా అవి ?
రక్తం ఓడుతున్న దంత ముద్రలు !

గాయాలు పడి మండుతున్న తన పెదవి
తనకే ఎంత తీయగా ఉన్నదో
పండ్లతో బిగించి వేసుకొని
పరవశమై పోయింది ఆరామ రామ !

ఆ రొద తుమ్మెదలది కాదు
ఆ కూజితం కోకిళులది కాదు ,
నీవు రాకుండా వసంత మెలా వస్తుంది ?
నీ వియోగంలో ప్రతి రుతువూ శిశిరమే !

నా చుట్టూ ఈ రుతువు లన్నీ
నా మనో భావాలకు ప్రతిబింబాలే !
క్షణ క్షణం ఒకో భావోద్రేకం ,
అడు గడుగునా ఒకో రుతు ధాటి !

అది విభాత సంధ్యారుణరాగం కాదు ,
క్రీడాంత స్నాన జలోచ్ఛాలనం !
ఓహో , పరమ పురుషు డెంత ధూర్తుడు !
ప్రకృతి కాంత ఎంత రస ధర్మిణి !

67. మురికి కవరులో మోహన లేఖ

సన్యాసుల్ని , విరాగుల్ని , యోగుల్ని చూస్తే
ఎంతో జాలి కలిగేది నాకు పూర్వం .
ఇప్పుడు నీ లేఖ చూచిన తర్వాత
ఏదో గౌరవం కలుగు తున్నది వీళ్ళమీద !

కోట్ల కొలది స్త్రీలలో ఒక్కర్తను నేను ,
ప్రతి స్త్రీ లోనూ ఏదో ఒక అందం చూడగల నీవు
నా కోసం సర్వం త్యజించి వచ్చి కూరున్నా వంటే —
ఈ పరి వ్రాట్టు లంతా ఎలాంటి సామ్రాట్టులో !

ఏ లోకోత్తర పరమ భాగధేయం కోసం
ఈ లోకాన్ని త్యజించి కూర్చున్న వాళ్ళో వీళ్ళు !
వాళ్ళ బాహ్యం ఎంత బహిష్కరించ దగిందిగా వున్నా
అభ్యంతరం ఏ పరా దేవ తాభ్యంతరమో !

ఎన్ని సార్లు ముద్దుపెట్టు కొన్నానో నీ లేఖను !
ముద్రలతో , మరకలతో , ఎంతో సీదరగా ఉన్న కవరులో
ఇంత అందమైన లేఖ ఉండవచ్చు —
ఎమ్ముల గూటి జడదారిలో బ్రహ్మజ్యోతిలా !

68. తీరని కోరికలు

అవ్వకూ , ఈ క్షేత్రాలకూ
క్షేత్రాలకూ , రాళ్ళకూ
రాళ్ళకూ , దేవుళ్ళకూ
దేవుళ్ళకూ , మన బాధలకూ
ఏమిటో అను బంధం !

ఒక అవ్వ లేక పోతే
ఇవేమీ ఉండేవి కావా ?
అవును , ఉండేవి కావు .

తీరని కోరికలే
తీర్థ యాత్రలు ,
ఒక్కరి కంటి చత్వారం
ఊ రందరికీ అంధకారం !

శివాలకలు

···:(o):···

విలాసం అయిదు

*

దారి ఎటు

" చూడవే ! రెండు చేతులా ఇస్తా నంటున్నాడు "
అన్నది అవ్వ , వేణుగోపాల స్వామికి కేలు మోడుస్తూ .
లక్ష్మీపురంలో , శ్రీ దేవి గుడి ఆవరణలో
చిన్న చిన్న గుడులు కట్టుకొనివున్న దేవతలలో
వేణుగోపాలస్వామి ఒకడు .
ఆయన రెండు అరచేతులూ
క్రిందికి చూపు తున్నట్టివే !

" వాడి మొగం " అన్నాను నేను నవ్వుతూ ,
" తన పాదాలను ఆశ్రయించ మంటున్నాడు . "
చాల కోపంగా చూచింది అవ్వ నా వంక !

అట్టి ముద్రకలవి వరద హస్తా లట !
తన పాదా లాశ్రయించ మంటే మాత్రం ఏం ?
భక్తులకు అంతకంటే మించిన వర మేమిటి ?

కావచ్చును , కాని —
" నా చేతిలో ఏం లేదు , చూడండి " అని
వట్టి చేతులు చూపు తున్నాడేమో ?
అదీ కావచ్చు !

మనకు దేవతలు అనేకులు
ఏ గుడికి వెళితే ఆ దేవతే
తన పాదా లాశ్రయించ మంటుంటే
ఎవరి పాదా లాశ్రయించడం ?

అదీ కాక —
ఆశ్రయింపును , దాస్యాన్ని ప్రబోధించడం
పురుషకారాన్ని చంపి వెయ్యడమే కాదా ?

దేవత లంతా క్రూర నియంతలు ,
ఆత్మకు స్వేచ్ఛ నివ్వని బానిస వ్యాపారులు !
నిజానికి , ఏ మత సంప్రదాయమైనా ఒకటే
పచ్చి బానిస తనం !

తన వ్రతానికి నేనొక అగ్ని పరీక్ష నట ,
శల్య సారథ్యా న్నట !
పాపం , అవ్వ !

70. దీప లక్ష్యం

నేను —
గారాబంగా పెరిగాను
గౌరవంగా బ్రతికాను
అందంగా వికసించాను
ఆనందంగా ఫలించాను
నాకు ఏ విచారమూ లేదు,
ఏ అసంతృప్తి లేదు.

నన్ను ఎవరైనా అలక్ష్యం చేశారేమో కాని
ఎవరూ అవమానించ లేదు .
నా పూలను , తేనెలను , ఫలాలను
ఎవరైనా ఆస్వాదించారో లేదో
నా నీడలో ఎవరైనా విశ్రమించారో లేదో
ఆ ఆలోచనే నాకు లేదు .

నేను వటవృక్షాన్ని కాదు ,
దానిమ్మ చెట్టును కావచ్చు .
గులాబీని కాదు ,
కనకాంబరం మొక్కను కావచ్చు .
పంచదార చెరకును కాదు ,
పండి రాలిన వరి కర్రను కావచ్చు .

అవ్వ ఇలా చెప్పుకు పోతుంటే
ఈ జాబితా కొక ఫుల్‌స్టాపు పెడదామని
అకస్మాత్తుగా అన్నాను —
" నీవు కోడి పుంజువు కాదు
గోరింకవు కావచ్చు " అని !

ఆ తర్వాత ఆమె మళ్ళీ పెదవి విప్ప లేదు !
మేక పిల్లను మెడమీదే పెట్టుకొని
దాని కోసం అడివంతా వెదికే గొల్ల ఈమె !
దీపం లక్ష్యం లోకానికి వెలు గివ్వడం ,
ఆ తర్వాత అది ఎక్కడ ఆరినా ఒకటేగా ?

71. ఎవరి లక్ష్యమైనా

ఎవరి లక్ష్యమైనా ఒక్కటే — ఆనందం ,
ఆనందమే కదా బ్రహ్మ ?
మార్గాలు మాత్రమే వేరు వేరు ,
అవి వ్యక్తి కొక దిక్కుగా పోతుంటై .

" నీ లక్ష్యం ఏదైతే నాకేం
నా లక్ష్యం మాత్రం నీవు " అంటూ
అమృత సంస్కార మధుర నారీ ధర్మాన్ని
మంత్రంలా ఎంత ముగ్ధంగా చెప్పావు

లక్ష్యం తప్ప ఏమీ లేక పోవడమే స్థిత ప్రజ్ఞత
అదే విజయ సిద్ధికి పార్థ సారథి !
తన విధ్యుక్త ధర్మంగా మనసా విశ్వసించి
ఎవ డే పని చేసినా అదే వాడికి తారకం .

పనే ధర్మం , పనే వ్యక్తిత్వం , పనే సర్వస్వం ,
పని కన్న అధికం మరేం లేదు మానవుడికి ;
పనే భగవంతుడు , భగవంతుడే పని ,
పని చేసుక బ్రతకడమే కర్మాద్వైతం .

నేను నీకు లక్ష్యమైనపుడే నా లక్ష్యం నీ దయింది ,
మనిద్దరం కలిసి పయనిస్తున్న మార్గంలో
ఈ లక్ష్యమే ఇంకా ఎంత మంది దవుద్దో !
రానీ ! తీసుక పోదాం మన కూడా !

నేను కవినో , కార్షకుణ్ణో , దొరనో , దొంగనో ,
ఉన్న వాణ్ణో , లేని వాణ్ణో — ఆ యోచనే లేదు నీకు !
ఎంతటి సాహస వతివి నీవు !
ఎంతటి లక్ష్య శుద్ధి నీది !

72. సంపూర్ణ స్త్రీత్వం

ఎంతైనా, స్త్రీవి నీవు!
వెన్నెల లోని ప్రసన్నతవు
ఎండలోని తీక్ష్ణతవు
చీకటిలోని వివశతవు ।

కొండ వాగులా వయ్యారివి
వసంతంలా అలంకృతవు
పికంలా గాయనివి!

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

మంచు గడ్డలా బిగుసుకు పోతావు
తుఫానులా రెచ్చి పోతావు
పిడుగులా విరుచుకు పడతావు !

మంచు గడ్డ గుండెల్లో కొండవాగు ఉంది
మ్రోడు మనసులో మధుమాసం ఉంది ,
ప్రకృతిలోని ప్రవృత్తు లన్నీ ఉన్నై నీలో
ప్రకృతికే ఒక ప్రతి కృతివి నీవు !

ఖద్దరు చీరలో గాయత్రివీ నీవే
సిఫాను సిల్కులో సీతాకోక చిల్కవూ నీవే !
అన్ని రుచులూ కల నిన్నేలు కోవడం
అన్ని ముఖాలూ నేను ధరించడమే !

ఏదో ఒక్క రుచినే భరించ గల సామాన్యుడు
తక్కిన అన్నిటినీ చంపి సంసారం సాగిస్తాడు ,
నా క్కావలసింది నీ విశ్వతోముఖ సౌందర్యం
నేను వ్రేళ్లైనా అవుతా , వికసించు నీవు సంపూర్ణంగా !

MEMORIAL LIBRARY

73. ఎండ మావులలో ఎల నీరు

ఎందుకు ప్రేమిస్తున్నావు నన్ను ?
అందగా డనా ? ధన వంతు డనా ?
వీరుడనా ? విద్యాధికు డనా ?
ఏదీ కాని నన్ను ఎందుకు ప్రేమిస్తున్నావు ?

ఇదే ప్రశ్న నన్నూ వేస్తావు
నేను చెప్పే జవాబే నీవూ చెపుతావు !
ఏమీ లేని నాతో
అన్నీ ఉన్న నీవు పందెం కడతావు !

ప్రేమ !
ఎంత విచిత్రమైన సృష్టి ఇది !
ఎండ మావుల నుంచి ఎలనీరు పిండ గలదు
అగ్గి నిప్పుల నుంచి అమృతం గ్రోలగలదు !

ఈ ప్రేమ అనేదే లేక పోతే
ఏముంది ఎలనీటి కైనా ఎడారి తప్ప ?
హాలీవుడ్ తార కైనా ఆత్మహత్య తప్ప ?

74. అన్నీ ఉండీ ఏమీ లేని వాణ్ని

అన్నీ ఉండీ ఏమీ లేని వాణ్ని నేను !
ఇల్లు , వాకిలి , పొలాలు , పాడి పంటలు ,
పరిజనం , కుటుంబం , మిత్రకోటి ,
సమస్తమూ ఉన్న నిరుపేదను నేను !

ఈ చీకట్లో , ఈ చలిలో , ఈ మూల
ముడుచుకు కూర్చున్నాను నేను —
వెలుగూ , వెచ్చదనం , మధువూ , మిత్రులు లేకనా ?
ఆ అన్నిటికీ ఆశ్రయమైన నీవు లేక !

పరిస్థితి తెలుసు కనుక విచారిస్తావు నీవు ,
ఆ విచార వదనమే కారుణ్య సుధా చంద్రం !
దాని చల్లని కాంతులే ఈ నా దారిద్ర్యం లోకి
జీవన రుచుల్ని ప్రసాదిస్తై నిత్యం !

నన్ను గురించిన నీ విచారంలో
నిన్ను గురించిన ప్రజ్ఞానం పల్లవించి నపుడే
నాకు వసంతోదయం ,
వసంతానికి నీ దర్శన భాగ్యోదయం .

అంత వరకు ఇలా - సర్వసంగ పరిత్యాగినై
నీ కోసం ఎదురు చూస్తూ , లేఖలు వ్రాసుకొంటూ
ఉండీ లేనట్టే ఉండి పోవడం తప్ప
చేసే దేముందీ నా కిక్కడ ?

75. ఆదర్శం

నా కొక ఆదర్శ మంటూ ఏదీ లేదు,
నేను ఏ లక్ష్యం కేసీ పయనించడం లేదు,
నేను స్థిరుణ్ని, అచల బ్రహ్మను!
హాని వృద్ధుల కాల తరంగిణి
నా చుట్టూ పరిభ్రమించే ప్రేయసి!

నేను గులాబి పువ్వును, దాని క్రింది ముల్లును
దాని ప్రక్క ఆకును, ఆకు మీది పురుగును
పురుగులోని తుమ్మెదను!

కంచె అవతల మేష రాశిని
మేడ మీది చారు కేశిని !
బ్రహ్మ కుంచెలో ఎంత వైరుధ్య ముందో
నా లేఖినిలో అంత వైవిధ్యం వుంది !

పృథివిలో జీవం వుంది ,
అగ్నిలోనూ జీవం వుంది !
ఈ పాంచ భౌతిక ప్రపంచంలో
ప్రతి భూతంలోనూ పుట్టి గిట్టు తున్నై
తత్త దను గుణాలైన జీవ కోట్లు !

భూమి నుంచి పెరికి వేస్తే చెట్టు
నీటి నుంచి తీసి వేస్తే చేప
గాలి నుంచి వేరుచేస్తే మనిషి
అగ్ని నుంచి లాగి వేస్తే జ్వాల
ఆకాశం నుంచి పీకి వేస్తే నక్షత్రం
జీవించడం అసహజం , అసాధ్యం .

ఈ మన జీవ సృష్టి
ఈ భూగోళానికే పరిమితం .
మరొక గోళంలోని సృష్టి
మరో పథకంలో వుండవచ్చు !
అక్కడకీ , ఇక్కడకీ
సంబంధమే లేక పోవచ్చు ,
ఇక్కడి ప్రాణం అక్కడ విషం కావచ్చు .

ఒక గోళం లోని వ్యక్తాత్మ
మరో గోళం కంటికి కనిపించనిదై వుండవచ్చు !
సూర్య గోళంలోని వ్యక్తి
జ్వాలా స్వరూపుడై ఉజ్జ్వలిస్తూ వుండవచ్చు !

మన కాలం సూర్య సంబంధం
ఈ అంతరాళ మహా నంతంలో
సూర్యుడొక అణు మాత్రం .
అనంతంలో అణు వున్నట్టే
అణువులో అనంతం వుంది కదా ?
నా జఠరాగ్నే సూర్యగోళ మైతే
ఈ సమస్తమూ నా చుట్టూనే లేదా ?
ఈ బృందాని కంతటికీ
నేనే బృందావని కాదా ?

లోకా లోక జీవా జీవ
సమస్తానికీ నేనే ఆదర్శ మైనపుడు
నాకు వేరే ఆదర్శ మెక్కడిది ?
నాలో చూచు కొంటూ
ఈ సమస్తమూ తనను తాను
దిద్దు కొంటూ పోతున్నది ,
ఈ సమస్తం లోనూ
నన్ను నేను చూచు కొంటూ
ఆనంద తన్మయుణ్ణై
కూర్చున్నా నిక్కడ !

పాపం , మీ అవ్వ
ఆదర్శాన్ని వెతుక్కొంటూ
హరే రాం , హరే కృష్ణ అను కొంటూ
అందరు దేవుళ్ళనూ సేవిస్తున్నది !

రాముడు ఏక పత్నీ వ్రతుడు
కృష్ణుడు బహు మానినీ మనోహరుడు
రాముడు చట్ట బద్ధు డైన రాజు
కృష్ణుడు సర్వజ్ఞుడైన ప్రవక్త !
ఈ ఇద్దరూ ఏకాదర్శం ఎలా అవుతారో
మీ అవ్వకు కాదు గదా —
ఆమెను పుట్టించిన
మత బ్రహ్మలకు కూడ తెలీదు !

సరే , తిరగనీ —
ఉన్న క్షేత్రా లన్నీ తిప్పుకురా!
త్వరగా మాత్రం రా !

76. విరహశయ్య

తీరికగా కూర్చున్నాను !
సరే , కానీ —
తిండికోసమే పుట్టిన వాణ్ని కాను !

కామధేనువు లాంటి పదవిలో వున్న శ్రేయోభిలాషి
సౌమ్యశ్రీ — నగరంలోకి వచ్చాడు ,
వెళ్ళి చూడవలసే వుంది — కాని
ఇల్లు కదలా లని లేదు !
సరే , కానీ —
కోకిలకు గూడు కట్టే దెవరు ?

ఒక మిత్రుడికి పూజ్యురాలైన అమ్మ గిట్టింది
మరో హితుడికి బంగారు బొమ్మ పుట్టింది
ఇంకొక నాయకుడి సుతకు పెండ్లయింది
వేరొక అభిమాన కవికి సన్మానం జరిగింది
వచ్చిన ఆహ్వానాలు చెవులు కొరుకొంటునై ?
ఎక్కడికీ వెళ్ళలేదు నేను !
ఏది మాత్రం ఏం అపూర్వం ?

కామినీ దేవత లెందరో
కన్ను కొట్టి పోయారు,
కంచ మంచాల లంచపు అంచయాన లెందరో
కదల లేక కూల బడ్డారు,
అయినా, నేను —
బుద్ధుణ్ణో, శ్రీ శుకుణ్ణో కాను !
కనీసం భీష్ముణ్ణి సైతం కాను !
నిన్న మొన్నటి రామకృష్ణుణ్ణో
వివేకానందుణ్ణో కూడ కాను !

నే నేమీ కాను —
ఎవరి వంటి వాణ్ణి కాను !
కేవలం నీ కోసం
వియోగ విరహ శయ్యాగతుణ్ణయి
తపించి ద్రవించి పోతున్న జడుణ్ణి !
పూర్తిగా కరిగి మరుగై పోక ముందే
తిరిగి వస్తావు కదూ ?

77. పులి, నక్క, గొర్రె

" నూకలు పెడతా, మేకల్ని కాస్తావ్ ? "

" ఓ, తప్పకుండా ! "

" తోడేలు వస్తే జడవ్వు కద ? "

" వెధవ తోడేలు ! "

" పెద్దపులి వస్తే బెదరవు కద ? "

" బోడి పెద్ద పులి ! "

" ఉఫ్ ! "

" బాబోయ్ ! "

ఇదొక జానపద బాల క్రీడ,
ఇదే మానవ స్వభావం తీరు కూడ!
దేనికీ జడవడు మానవుడు,
మానవుడు జడిసేది ఒక్క మానవుడికే!

గొర్రె నమ్ముతుంది,
నక్క మోసగిస్తుంది,
పెద్ద పులి తినేస్తుంది,
ఇవన్నీ చేస్తాడు మానవుడు!

అమాయకుడు, రౌడీ, ద్రోహి, హంతకుడు —
ఇలా ఇన్ని తరహా లుండవు ఏ మృగం లోనూ!
ఇన్ని విధాలుగా పీడించదు ఏ జంతువూ!
నమ్మించి వంచించ గలవా డొక్క మానవుడే!

సాధువు లాంటి యాత్రికుడే
మోసగించాడు కదూ మిమ్మల్ని?
యాత్రాస్థలా లన్నీ దివ్యక్షేత్రాలు కావు,
అక్కడుండే వాళ్ళు సగానికి సగం దొంగలు!

అందుకే, నమ్మవద్దు ఏ మానవుణ్ణీ,
ఎవ డెప్పు డే జంతు వవుతాడో చెప్పలేం!
నిన్ను నీవే నమ్మగూడ దొకొక్క సారి
బంగారు లేళ్ళుండవు భూమి మీద!

78. వాంఛా క్షేత్రాలు

పుణ్య క్షేత్రాలు దర్శించే కొలదీ
ఇంకా దర్శించాలని ఉంటుంది —
సర్వం పరబ్రహ్మ అయిన వాళ్ళకు కాదు ,
నిత్యం దేనికోసమో వెతుక్కునే అవ్వలకు .

తిరిగే కొలదీ తిరగాలని ఉంటుంది
చూచే కొలదీ చూడాలని ఉంటుంది
పొందే కొలదీ పొందాలని ఉంటుంది
క్షేత్రాలు , సౌందర్యాలు , సుఖాలు !

బ్రతుకొక జెట్ విమానం లాంటిది ,
ఎంత ఎక్కువగా కోరికలు తీరుతుంటే
అంత వేగంగా ముందుకు పోతుంటుం దది !
కోరికలు తీరుతుండడమే నిత్య పురోగమనం !

అయితే — తీరే కొలదీ ఊరే కోరికలు
పూర్తిగా తీరడ మంటూ వుంటుందా ?
వాటి కొక అంతం ఎక్కడ ?
ఒక మోక్షం ఎక్కడ ?

తీర్చుకొనే కొలది ఊరతాయి కనుక
కోరికల్ని అణచి పారవెయ్య మన్నారు
మొగ్గలోనే తుంచి పారబొయ్య మన్నారు
మ్రోడులా బ్రతకడమే మోక్ష మన్నారు .

ఇది చాలా చిక్కు సమస్య !
కోరికలు తీరకుండా పురోగతి లేదు
అవి పూర్తిగా తీరడ మనేది లేదు
తీరకపోతే జీవికి మోక్షం లేదు !

క్షేత్రాల నిండా కనిపించే సన్యాసుల వలె
మ్రోడులా బ్రతకడమే మోక్ష మార్గమా ?
నిరోధించడమే నివారించడమా ?
నివారణమే విమోచనమా ?

పూచి , కాచి , ముచ్చట తీరిన ముది చెట్టుతో
మొగ్గలు పుడికేసిన మ్రోడును పోల్చ వచ్చునా ?
కోరికల్ని చంపేస్తే జీవితం వికసిస్తుందా ?
వికసించని జీవితానికి సాఫల్యం ఏది ?

ఈ చిక్కును విడదియ్యడం ఎలా ?
ప్రకృతి కేసి ఒక సారి పరీక్షగా చూడు !
ప్రశ్నలోనే జవాబు ఉంటుంది
సమస్యలోనే పరిష్కారం కనిపిస్తుంది .

బీజంలో చెట్టూ , చెట్టులో బీజం
వృద్ధిలో క్షయం అంతర్నిహితాలే ,
తనలో లేని దేదీ బైట లేదు
తనలో జరగని దేదీ బైట జరగదు .

బ్రహ్మ నుంచి జీవం విడి వడి
అది తిరిగి బ్రహ్మను చేరే బ్రతుకు నిండా
దాని ధారణా సామర్థ్యాన్ని బట్టి
వాంఛా బీజాలు నిండి ఉంటై .

వాంఛలు తీరుతూ ఉండడమే పురోగమనం
అవి తీరే వేగమే జీవిత భోగం !
జనన మరణాల నడుమ వ్యవధి కాదు జీవితం ,
ద్వైతా ద్వైతాల మధ్య దూరమే జీవితం .

జీవ లతను ఒక చెరకు గడతో పోలిస్తే —
దాని నడుమ కణుపులే జీవస్మరణ సంధ్యలు
కణుపుల మధ్య రస ఖండాలే జీవితాలు
ఎన్నో జీవితాలు కలిసిందే జీవ లత !

ఖండం అనుభవించబడక కణుపు రాదు
కణుపును దాటక ఖండం రాదు ,
తీరే కొలదీ ఊరుతున్నట్టు కనిపించినా
తీరక తప్పదు మొత్తం కోరిక లన్నీ !

నీ జీవ లక్షణాన్ని బట్టి ఉంటై నీ కోరికలు
అవి నీకు సహజ సిద్ధ మైనట్టివి,
నీ సుఖం మరొకళ్ళకు దుఃఖం కా వచ్చు
పులికి గొఱ్ఱె మేకకు ప్రాణాంతకాలు !

కాగా, దేవీ !
నీ కోరికల్ని నీవు అసహ్యించు కోకు,
తీర్చేసుకో నీ ప్రతి కోరికనూ !
నీవు బ్రతికేది నీ కోసం, లోకం కోసం కాదు.

బాలయోగిని చూచి సమాధిలో కూర్చోవడం
పండును చూచి పిందె పేలి పోవడమే !
కోరికలకు కళ్ళాలు తగిలించ వద్దు
నిరోధించ వద్దు మీ అవ్వ యాత్రను.

ఎప్పుడూ ఏదో వెతుక్కుంటూనే ఉంటాడు మనిషి —
ఓటర్ల జాబితాలలో, నాయకుల ముఖాలలో,
చీకటి సందులలో, జాతక చక్రాలలో,
నిత్యా న్వేషణే మానవ లక్షణం !

వెతుక్కోనీ వెతుక్కునే వాళ్ళను,
ప్రతి మనిషి కోరికలూ తీర వలసిందే.
పండించు కోనీ తమ తీరని కోరికల్ని !
ఉమ్మడి క్షేత్రాలు మన పుణ్యక్షేత్రాలు !

79. హేమంతంలో వసంతాన్వేషణ

మీ అవ్వను గురించిన నీ విమర్శలు
అంత న్యాయంగా లేవేమో !

నీవు వసంతారంభ కిసలయానివి ,
ఆమె హేమంతాంత వృద్ధ పత్రం !
నీకు భవిష్యత్తు నిత్యోజ్జ్వల విభాతం ,
ఆమెకు భయంకర అజ్ఞాత నిశీథం !

" ఈ పండుటాకు ఇంకా రాలి పోదేం ?
ఇంకా ఎంతకాలం భరించాలి దీన్ని ? "
అనుకొంటుంది దాని గర్భాన్ని
చీల్చుకు వచ్చి నిల్చున్న చిగురాకు !

మరి — పండుటాకు రాలి పోడానికి
ఎంతబాధ పడుతుందో తెలుసా ?
ఇంత వెలుగును వదిలి పోవాలి
ఇన్ని అనుబంధాలను తెంచుకు పోవాలి ,
పోనీ — పోదా మను కుంటే —
ఆ తర్వాత ఏమిటో తెలీదు !

మృత్యు వంటే మనిషి కున్నంత భయం
మరే ఇతర జీవికీ వుండదేమో !
అందు కే — మృత్యువు తర్వాత మరో లోకంలో
బ్రతికే వుంటా నను కొంటాడు మనిషి ,
తృప్తి పడతాడు భ్రమలు కల్పించుకొని !
రావడం పోవడం తన చేతిలోనే వుంటే
వచ్చిన వా డెవడూ తిరిగి పోడు !

హేమంత శత పత్రం మీ అవ్వ ,
ఏ దేవుడో తనను ఉద్ధరించి
ఏ దివ్య వసంతాన్నో ప్రసాదించా లని
కోరు కోవడంలో తప్పేముంది ?

అందుకు వివిధ దేవతా శక్తి క్షేత్రాలను
సేవించడంలో అసహజం ఏ ముంది ?

నీ దృష్టిలో — ఆమెకు ఉన్న దొక్కటే,
అది — అజ్ఞానం !
ఎంత గొప్ప వెలుగైనా ఆరిపోక తప్పదు,
దేవ దీపం కూడ అంతే !
ఈ సత్యం మీ అవ్వకు తెలీదు,
మహా ప్రవక్తలకు కూడ తెలియదు !

రక రకాల పరలోకాలను సృష్టించు కొని,
మృత్యువు నుండి బైటపడా లనుకొంటూ
అందు కెలాంటి త్యాగాల కైనా సిద్ధపడి
కంగారు పడిపోయే మనిషికి
ఆదుకునే వాడు ఆధ్యాత్మిక గురువు !
పర లోకం చూపేవాడు ప్రవక్త !
వీళ్ళందరూ ఆ అజ్ఞానిని —
వోటరును రాజకీయ నాయకుల్లా —
స్వార్థానికి వాడుకొనే స్వయం బ్రహ్మలు !

అందుకే —
ద్వేషించకు మీ అవ్వను,
ఆమె హేమంతంలో
పున ర్వసంతాన్ని వెతుక్కుంటూ
పరిభ్రమిస్తున్న పరమ పద !

80. నా పుట్టిన రోజు

నా పుట్టిన రోజు పండగ
నీ కొక్కతెకే జ్ఞాపకం ఉంది !
ఏం కావా లంటున్నావు కదూ ?
ఏం అక్కరలే దనుకొంటున్నావు ?

అనంతమైన ఈ బ్రతుకు బాటలో
ఎందుకో ఈ మైలు రాళ్ళు ?
ప్రాణికోటి బ్రతుకు బాటలు
పిచ్చుక గూటి నార పోచలు ,
దేని కదే అయినా —
అన్నీ ఒక పెద్ద చిక్కు !

అయినా , ఏం కావాలి నాకు , దేవీ ?
నాకు లేని దేముందీ లోకంలో ?
ప్రతి క్షణమూ నా పుట్టిన పండగే ,
ప్రతి అందమూ నా పండగ బహుమానమే .

లోకంలోని అందా లన్నీ అల్లుకొని
రూపు దాల్చిన సరస్వతివి !
నా నలుమఖాలా నీవై ఉండి ,
ఇంకా ఏ మివ్వా లనుకొంటున్నావు నాకు ?

81. నాయకశక్తి

గ్రామ వాసి కంటె పట్న వాసికి
చదువు లేని వాడి కంటె చదువుకొన్న వాడికి
సామాన్యుడి కంటె విజ్ఞానికి
కొన్ని విషయాలు ఎక్కువ తెలుస్తే .

మైనపు వత్తి కంటె గేసు లైటుకు ,
మామూలు బిజిలీ బల్బు కంటె సెర్చి లైటుకు ,
చంద్రకాంతి కంటె సూర్య రశ్మికి
వెలు గిచ్చే పరిధులు విశాల తరాలు .

అంత మాత్రం చేత
వస్తువులో తేడా వున్నదనుకో వద్దు :
పేద కార్మికు డైనా , పీఠాధిపతే అయినా
మనిషి మనిషే — దేవుడు కాదు !

గులాబి పువ్వు మౌని , కోకిల వాగ్మి ,
కుక్క వదరు బోతు , నక్క మహా వక్త ,

గొర్రె అజ్ఞాని , తోడేలు లోకజ్ఞ !
ఈ అందరూ వున్నారు సర్వత్రా !

ఈ అందర్ని చూస్తున్నావు కదూ నీ యాత్రలో ?
ఎవడికి వాడే అందంగా నవ్వే అహంకారి ,
తా నొక్కడే స్వర్గానికి సరాసరి చూపుదారి !
ఈ అందరికీ ఆహారం పాపం ప్రజలే !

ఈ సామాన్య ప్రజల్ని —
పాపం ప్రజ లనడం వ్యర్థ మేమో !
చిన్నప్పటి తాతా అవ్వా నమ్మకాలే తప్ప
పెద్దప్పు డైనా ఏమీ నేర్చుకోరు వాళ్ళు !

వాళ్ళ నమ్మకాలకు వ్యతిరేకంగా ఏ మైనా చెప్పు ,
మంచి వాళ్లైతే నవ్వి పారేస్తారు ,
మత పిచ్చి వాళ్లైతే కత్తులు దూస్తారు !
నాగస్వరం పట్టు , బుట్టలో పడిపోతారు !

నాయకుల సమ్మోహన శక్తిని చూస్తుంటే
నా కెంతో ఆశ్చర్యం కలుగుతూ వుంటుంది !
గొర్రెల్ని తన గుహల్లోకి మళ్ళించుకో గలదు !
పాముల్ని తన బుట్టల్లోకి బులిపించుకో గలదు !

నాయకుడూ మనిషే అయినా ,
శక్తి ఎంతటి మాయా మోహిని !

82. అవ్వ భక్తి

" భజరే శ్రీరామం , దశరథ రామం ,
ఖండన భీమం " అనుకొంటూ
ఎన్ని క్షేత్రాలు తిరిగితే ఏ మవుద్ది ?

దశరథ రాముడూ , ఖండన భీముడూ ,
రఘు రాముడూ అయిన శ్రీరాముడు
ఏనాడో పుట్టి , సరయూ నదిలో మునిగి
మరణించిన మానవుడే కదా ?

మా అవ్వ ఒక్కతెకే కాదీ పిచ్చి ,
ఈ తీర్థ యాత్రలు చేస్తున్న అందరికీ
ఇదే పిచ్చి !

పాపం అనిపిస్తుంది వీళ్ళను చూస్తుంటే !
కోపం వస్తుంది ఈ క్షేత్రాలలో జరిగే
మానవ హింసా , మోసమూ , దోపిడీ పరికిస్తుంటే !
దైవ స్వభావమే తెలియని ఈ మూర్ఖులకు
సహ మానవ ధర్మాన్నే మరచిన ఈ స్వార్థులకు
ఎలా వస్తుంది పుణ్యం ?
ఎవ రిస్తారు మోక్షం ?

ఇదా —
అహం బ్రహ్మాస్మి మహత్తత్వాన్ని
లోకానికి ప్రసాదించిన ఆర్షభూమి !

83. హరి హరాద్వైతం

శివాలయం , విష్ణ్వాలయం , కాళికాలయం ,
రామాలయం , ఆంజనేయాలయం —
ఇలా ఏ గుడి కనిపిస్తే ఆ గుడికి
పూజలు చేస్తున్నది అవ్వ ?

ఆమె విశ్వ దైవైక కుటుంబిని అయినా కావాలి ,
ఆధునిక సామాన్య భక్తుడికి
నూరు శాతం ప్రతిబింబ మైనా కావాలి !

విశ్వ దైవైక కుటుంబికి
యాత్రల పిచ్చి వుండదు —
ఏ దైవ మైనా
తన వద్దకు రావలసిందే కనుక !

ఆధునిక భక్తికి అవ్వ
శత శాతం ప్రతి బింబమే !
నిజమే కదూ ?

రామణ్ని , ఆంజనేయుణ్ని అలా వదిలేద్దాం ,
వాళ్ళు మనలాగే పుట్టిన వాళ్లు కనుక !
శివుణ్ని , విష్ణువునూ తీసుకొందాం ,
వాళ్లెవరు ?
ఆద్యంత రహితులైన సగుణ మూర్తులు !
అవునా ?

ఈ ఇద్దరూ
జీవన మరణ సహజ ప్రవృత్తులకు
మనం కల్పించుకొన్న రూపాలు !

పుట్టినవాడు గిట్టడానికి భయపడతాడు ,
గిట్టినవాడు పుట్టడానికీ భయపడతాడు !
ఈ విరుద్ధ గుణాలకు చిహ్నాలైన హరి హరులు
ఒక్కటెలా అవుతారు ?

ఎందుకు కారు అన గలిగిన యోగి
ఈ ఇద్దర్ని మించిన సచ్చిదానంద మూర్తే !
సామాన్య భక్తుడికి
హరి హర అద్వైతం పచ్చి వెలక్కాయే కదా ?

ఇక్కడ మన నారాయణ అంటాడు —
భక్తికి ఇవన్నీ ప్రాథమిక పాఠాలు అని !
భక్తి జ్ఞానానికి నిచ్చెన అని !
జ్ఞానికి ఇవేమీ అక్కర లేదు అని !

అయితే , దేవీ !
సామాన్య ప్రజ లంతా
ఈ ప్రాథమిక దశలోనే
ఉండి పోవడం లేదా ?

రాముడూ , కృష్ణుడూ ఒక్కటే అయితే —
సీత కృష్ణుడి భార్య అవుతుందా ?
ఇద్దరు వ్యక్తులు భౌతికంగా
ఒకే మూర్తి ఎలా అవుతారు ?

సామాన్య ప్రజా గొర్రెల్ని
మోసం చెయ్య డానికి
నక్కలూ , పులులూ పన్నిన
వల కాదా ఇదంతా ?

హరి హరా ద్వైతం
ఒకే పార్టీలో కొట్టుకు చస్తున్న
రెండు వీర ముఠాల మధ్య రాజీ !
పచ్చి రాజకీయపు తేజీ !

84. మనిషి మారడా ?

బుద్ధుడు , క్రైస్తు , మహమ్మదు
ఈ అందరూ ప్రవక్తలు -
జగ న్నియంత అయిన భగవంతుని ఇష్టాన్ని
తాము గ్రహించ గలిగిన ప్రమాణం లో
తమ దేశ కాలాలకు అనుగుణంగా
ప్రజలకు వివరించిన మహావ్యక్తులు !

నరసింహుడు , రాముడు , కృష్ణుడు
ఈ అందరూ ధర్మవీరులు -
ఆ నాటి ప్రజా కంటకులైన దుష్టుల్ని చంపి
తమ సమకాలీన సమాజానికి
అభయం ఇచ్చిన ధీరోదాత్తులు !

ఈ అందరూ భగవంతుడి పేరు చెప్పి
మనిషిని మార్చా లనుకొన్న మహాత్ములు !
అయితే — మనిషి మాత్రం

భగవంతుడి సరసన ఈ అందరికీ పీటలు వేసి
పూజించ గలుగుతున్నాడే కాని
తాను మాత్రం మారదలచుకో లేదు !

ఈ మతాలు , ఈ యాత్రలు
ఈ గుడి గోపురాలు , ఈ భజనలు
ఈ అన్నీ కేవలం ఆ ప్రతినిధుల్ని తృప్తిపరిచి
అసలు వాడి కన్ను కప్పడానికే !
మనిషి మాత్రం మారడు.

నిజానికి మనిషి ఎందుకు మారాలి ?
ఈ ప్రవక్తలూ , అవతార మూర్తులూ
ఈ అందరూ భగవంతుని ప్రతినిధులే అయినప్పుడు
ఏ ప్రతినిధికి అనుకూలంగా మారాలి ?

నీరు లేని ఇసుక ఎడారి లోను
అంతా నీరే అయిన గోదావరి డెల్టా లోను
ఒకటే జీవిత ధర్మమా ?

అందుకే - ఎవరి కబళం వారికి పారేస్తూ
తాను మాత్రం తన బ్రతు కేదో తాను
బ్రతుకు తున్నాడు మనిషి !

మనిషి మారడు -
మార నవసరం లేదు !

85. సృష్టి పథకం

నీ వనుకొన్నంతా అయింది !
పంజరం నుంచి బయట పడ్డ చిలక్కి
ఒక దిక్కూ, ఒక మొక్కూ అని ఏముంది ?

ఆగ్రా కని బైలుదేరిన అవ్వ - మధ్యలో
హర ద్వారం బస్సు కనిపిస్తే - ఎక్కేసింది !
" ఆగ్రాలో తాజ్‌మహల్ నూ

ముమ్మిడివరంలో బాల యోగినీ
ఏం చూస్తాం ? " అన్నదామె !
ఒకటి చచ్చిపోయిన సమాధి అట !
మరొకటి బ్రతికి వున్న సమాధి అట !

" లోగడ చూచిన హరద్వారే కదా ? " అంటే
మరొక సారి చూడవలసిం దేదో
వున్న దట అక్కడ !
ఆమె పిచ్చిలో కూడ
ఒక పద్ధతి వున్నట్టుంది కదూ ?
అంత హేతు బద్ధంగా ఆలోచించే ఆమె
ఇంత మూఢ భక్తికి లొంగిపోయిం దెందుకో !
ఒక వేళ ఇది మూఢ భక్తి కాదేమో !

ఆత్మ తన కోరికల్ని ముందు చల్లుకొంటూ
తనను తానే సృష్టించు కొంటూ
తాను వెనక్కి పోతున్న పథక మేమో ఇది !

ఏది ఏమైనా -
నేను కంచినుంచి వ్రాసిన జాబుకు జవాబు
నీవు హరద్వార్‌కు వ్రాయడం మంచిదే అయింది ,
శరీరాలు ఎక్కడున్నా
మన మనస్సులు ఏక మంటే కదా !

86. గంగా గోదావరులు

చుట్టూ విశాలమైన చాపల నిండా
బంగారాన్ని ఆరబోసి నట్టు
విరగ బండిన పంట చేలు,
విరగ బూచిన మామిడి గున్నలు,
మధ్య మధ్య పిల్ల కాల్వలు, చెరకు తోటలు,
నీటి పట్టుల నిండా తెల్ల తామర ల్లాంటి కొంగలు.

పంచె లెగగట్టి అరకలు పడుతున్న రైతులు,
రోడ్డు కిరుప్రక్కలా పేడ, పిడకల గుట్టలు,

గోదావరి పెద్ద కాలువ పొడుగునా
కోన సీమ సుందర వనాల గుండా
ఎంత హాయిగా వుంది బస్ ప్రయాణం !

అమలాపురం వచ్చేసిం దను కొన్నాను !
కాని అది రూర్కీ !
అవి గోధుమ చేలు !
గంగా గోదావరులు కవలలా ?
ఎంత అందమైన భ్రాంతి !

నిజాని కిది భ్రాంతేనా ?
అదీ ఇదీ ఒక్కటే కాదా ?
శివాలక లంటే - ఇక్కడి
హర ద్వారపు కొండల గుంపులేనా ?
ఆకాశంలోని ప్రతి మబ్బు తునకా
ఒక చల్లని శివాలకే కాదా ?

మహా శివుని అన్ని జడల నుంచీ
జారి వచ్చిన ధారలన్నీ కలిసి
పూర్ణ సుందరిగా అవతరించిన గంగ
తొలుతగా శివపాదాలు తాకుతున్న ఇక్కడ
సాయంత్రాల హారతి సమయాలు
సాక్షాత్ శివతాండవ సముజ్జ్వలాలు !

87. హంస పిల్లలు

మొన్న పూర్ణిమ రోజున, సాయంకాలం -
చెంబేలీ పొద ముందు నిల బడ్డాను
పూల పళ్లెంతో, రోజూలాగే.

మనకు అన్ని పూర్ణిమలూ పండుగలే,
అన్ని సుఖ క్షణాలూ పూర్ణిమలే - అయినా
ఈ పూర్ణిమ చేసిన గమ్మత్తు
అనంత కోటి ప్రేమ జన్మల కిమత్తు!

చరమ దిశా రంగంలో సహస్రకరు డింకా
కాల మేఘ కిశోరాలతో కుస్తీలు పడుతున్నాడు,

తూర్పు కొండ నీడలో నిద్రపోతున్న శశిని
శశికళ ఇంకా మేల్కొల్పనే లేదు.

నీ ఎర్రని పెదవి మీది నుంచి వచ్చే
రాగ దరహాసంలా వుంది నీ రెండ,
దాని గుండెలో ఈత కొట్టే కోరికతో
హంస పిల్లలై మందలు మందలుగా వచ్చి
మన మందిరిపై వాలిన
తారకల్లా వున్నై చెంబేలీ మొగ్గలు!

విచ్చిన పూలు శివార్పణ మైపోయి నట్టివే,
విచ్చని మొగ్గలే నీ కోసం పుడుకుతాను నేను.

ఇప్పటి చిత్ర మేమి టంటే -
నేను చేయి చాచగానే నేను నేనంటూ
చాటు మాటువి కూడ చేతి కందే మొగ్గలు
నే నెక్కడ చేయి వేస్తే అక్కడ
చక్కగా విచ్చి, పక్కున నవ్వ సాగినై!
ఎంత వింత!

బహుశా, నీ వెక్కడో
శివ పూజలో మునిగి వుంటావు,
ఈ మొగ్గలన్నీ అక్కడ నీ కోసం
ఇక్కడ ముందుగానే వికసించి వుంటై!
నే నొక్కణ్నే ఇక్కడ వెర్రి వాణ్ని!

88. సుఖ సంపదలు

నేను పుడత , పెరుగుత
విద్యా బుద్ధు లార్జిస్త
ఇంత తపస్సు చేస్త
ఎందు కోసం ?

ఈ సహచరుల సరసోక్తుల కోసమా ?
ఇవి నీ తోటలోని చిలుకల పలుకులు !
ఈ గానా బజానాల కోసమా ?
ఇవి నీ పరభృన్మధు పాదుల క్రీడలు !

ఈ ధన ధాన్యాలు , కీర్తి ప్రతిష్ఠలు ,
అధికారాలు , పదవులు , గౌరవాలు
నా జీవిత మార్గంలో నాకు అడుగడుగునా
స్వాగత మిస్తున్న ఇవన్నీ —

వీటి కోసమా నా జీవితం ?
ఇందుకేనా నేను బైలుదేరి వస్తూంట ?
కాదు దేవీ ! ఎన్నటికీ కాదు !
ఇవన్నీ నాకు నీ వంపుతున్న కానుకలు !

ఈ కానుకలలో నచ్చినవి స్వీకరిస్తూ
నేను నీ దాకా రావడమేగా నీ కోర్కె ?
అందుకే వస్తున్నాను నీ వద్దకు
ఈ వసంత వైభవాల నన్నిటినీ పాయదీసుకొంటూ

ఇక్కడే , ఇప్పుడే వస్తున్నాను నీ వద్దకు
ఒక్కొక్క అందాన్నీ అందుకొని సుఖిస్తూ
ఒక్కొక్క సుఖాన్నీ అనుభవించి జీవిస్తూ
వచ్చేస్తున్నాను నీ వద్దకు !

శివాలకలు

విలాసం ఆరు

....:(o):....

శివ సోషలిజం

అబ్బా, ఎంత చీకటిని దూసుకు వచ్చాను !
ఎన్ని వెలుగుల్ని ఖర్చుచేసి పారేశాను !
ఎన్నెన్ని కలల్ని మెలకువలుగా మార్చేశాను !

నా అరికాళ్ళు హారతి కర్పూరం పళ్ళాలు
నా అడుగడుగూ నీ కొక దీపారాధన !
అయినా, వెలుగుకూ వెలుగుకూ మధ్య ఎంత చీకటి !
ఎంత వెలుగైనా ఏనుగు కొక వెలక్కాయే !

చీకటిని అలా వదిలేయ్ !
అదే కదా నీ సింహాసనం ?
నీ ఆశీస్సులు లేకుండా అదిక్కడెలా ఉంటుంది ?
ఈ చీకట్లు నీ రహస్య రక్షక దళాలు !

దుస్స్వప్నాల జోలి కూడ నాకు వద్దు,
నీ లాలూచీ లేకుండా అవి మాత్రం ఎందుకు వస్తై ?
మధుర స్వప్నాలైనా మరుగడలో నిలవ్వద్దా ?
మళ్ళీ మళ్ళీ కౌగిటిలోకి రావద్దా ?

ఎంత సుందరమైన ఆనంద వన మది ,
ఎవరో ఆ మోహన వీణా పాణి !
నా కౌగిట్లో గాయని , గానం కౌగిట్లో నేను !
చుట్టూ లతలు , పువ్వులు , తుమ్మెదలు , పక్షులు !

లతలే లతాంగులై నాట్యం చేస్తున్నారు !
రాగం అనురాగం పారిజాత పరాగం !
నాలో గాయని , గానంలో నేను
ద్రవించి పోతున్నాం పారవశ్యం లోకి !

వీణా పాణి వ్రేలి కొసల నుంచి జారి ,
పాల కడలి తరంగాల నుంచి విడిపోయి ,
ఆకాశ గంగలా ప్రవహించి పోతున్నాం
ఆర్ద్రాగ్రి శివుని మృగాంక కలశం లోకి !

తండ్రి నుంచి తల్లికి , తల్లి నుంచి తండ్రికి
బిడ్డలం , ప్రేమికులం , తల్లి దండ్రులం !
ఎంత ఆనంద సుందరం ఆ యాత్ర !
ఎంత మమతా మధురం ఆ లోకం !

అయితే అదంతా వట్టి స్వప్న మేనా ?
స్వప్న జీవితం జీవితమే కాదా ?
మరి అక్కడి వాళ్ళంతా ఎవళ్లు ?
మళ్ళీ ఆ అపేక్షల్ని ఎందుకు పలకరించలేను ?

నిజమే — పలకరించ లేను !
గతక్షణం లోకే అడుగుపెట్టలేని నేను
గత స్వప్నంలోకి ఎలా ప్రవేశించ గలను ?
భవిష్యత్తుపై ఉన్న పట్టైనా గతంపై నాకు లేదు. !

స్వప్నం నుంచి ఇవతలికి కాకుండా
అవతలికి మేల్కొని ఉంటే ఏమయేదో !
అవతల అనే దేదీ లేదా ?
పరిమాణం లేని ద్రవ్యం ఉన్నదా ?

కలనుంచి మేల్కొనడం బ్రతుకైతే ,
బ్రతుకు నుంచి మేల్కొనడం మృత్యువు !
మృత్యువు నుంచి మేల్కొనడం ఆత్మస్థితి ,
ఆత్మనుంచి మేల్కొనడం మోక్షం !

బ్రతుకుకు కల అబద్ధమైతే
మృత్యువుకు బ్రతుకూ అబద్ధమే
ఆత్మకు మృత్యువూ అబద్ధమే
నిజం ఒక్క నీవు మాత్రమే అప్పుడు !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

అందుకే వచ్చి కూర్చున్నా నిక్కడ !
కల మెలకువల కతీతంగా !
నీ నిజం ఏమిటో చూడాలనీ ,
నిన్ను వాస్తవంగా పట్టుకోవాలనీ .

90. కామం కారు దున్న

కామం కారు దున్న
క్రోధం తాచు పాము
లోభం కాల్లి కుక్క
మోహం పెద్దపులి
మదం ఖడ్గ మృగం
మాత్సర్యం మత్తగజం !

ఎందుకు పెంచు కోవడం
ఈ భయంకర దుష్ట మృగాలను ?
ఇందులో ఏ ఒక్కటి లోపల ఉన్నా

మానవుడు ఆ మృగమే అవుతా డంటే
అన్ని లోపల వున్నవాడు
ఒక పెద్ద " జూ " యే కాడా ?

అందం కోసం , ప్రణయం కోసం
ఆనందం కోసం పుట్టిన మనం
చేర నివ్వకూడ దీ దుష్ట మృగాలను !
మన హృదయాలు వికసిత కమలాలు ,
పరమ శివుడి కొక్కడికే అక్కడ స్థానం ,
పగలకూ , పొగలకూ కాదు !

లోకాన్ని చూస్తున్న కొలదీ
లోకేశ్వరు డొక డుండగల డన్న
విశ్వాసం పో తున్నది !
ఈ ధన మూలపు జగత్తులో
ఒకొక్క డొకొక్క జూ !

నీవు మరీ విరహార్తుడవు కాకు ,
మా పైసలై పో వచ్చినై
ఇక తిరోముఖులం కాక తప్పదు !
ఉండడం , లేక పోవడం అంటే ఏమిటో
అవ్వ కిపు డిప్పుడే అర్థ మవుతున్నది !
ఏ దేవుడైనా —
ఉన్న వాళ్ళకే ఉన్నవాడు ,
లేని వాళ్ళకు లేని వాడే !

91. వటి ఊహలు

తన బ్రతుకు తాను బ్రతికే వాడు
సామాన్య మానవుడు ,
ఇతరుల బ్రతుక్కి కూడ తోడ్పడే వాడు
ఉత్తమ పురుషుడు .

ప్రజా సేవే వృత్తిగా కలవాడు ఉద్యోగి ,
ఉద్యోగ వ్యవస్థను నడిపేది ప్రభుత్వం .
ఇదీ మానవ లోకం —
సమగ్ర జీవ లోకంలో ఒక భాగం .

ఆనందంలో పుట్టిన జీవి
ఆనందంగా బ్రతుకుతూ
ఆనందంలో కలిసిపోవడం సృష్టి క్రమం .

ఈ క్రమాన్ని భగ్నం చేస్తున్న దెవరు ?
ఏ పనీ చేతకాని సోమరి పోతులు ,
పని చేసే వాళ్ళను దోచుకు తింటున్న దుష్టులు !

ఎవళ్ళు వాళ్ళు ?
వాళ్లు రక రకాలుగా వున్నా రీ నాడు !
చీకటి బజారు వాళ్ళు , కత్తి చేసే వాళ్ళు ,
లంచాలు పట్టే వాళ్ళు వగైరా .
వీళ్ళందరికీ గురువులు మత బోధకులు !

దేవుణ్ని గురించి —
సామాన్యుడి కెంత తెలుసో
మత గురువుకూ అంతే తెలుసు !
తేడా ఒక్కటి —
అతడు గొర్రె , ఇతడు నక్క !

బ్రతికి వున్న వాడి బాగు కోసం
బతికి వున్న వా డెంతైనా చెప్పవచ్చు ,
చచ్చిన తర్వాత పరిస్థితి ఏమిటో
చచ్చిన వాడే చెప్ప గలడు !
అలా చెప్పిన వాడు
మానవ చరిత్ర లోనే లేడు !

చచ్చి పోయిన వాళ్ళను గురించి
బ్రతికి వున్న వాళ్లు చెప్పే వన్నీ వట్టి వూహాలు !
వాటిలో ప్రతిభ , పాండిత్యం వుండ వచ్చు ,
సత్యం మాత్రం శూన్యం !
అది మనిషి మెదడుకు అందనిది ,
నమ్మ వద్దు ఎవళ్ళనీ .

92. మరమ్మత్తా ? పునస్సృష్టా ?

పత్రికల్లో వార్త దివవే వుంటావు —
చంద్ర గోళంలో స్థలాలు అమ్ముతాం అని
ఒక సాహస వ్యాపారి ప్రకటన చేస్తే,
వందలు వేలు దరఖాస్తులు వచ్చి పడ్డై అట !

లూథరు మహాశయుడు ప్రొటెస్టు చేసే నాటికి
క్రైస్తవ మతాధి పతులు అమ్ముతున్నట్టి
స్వర్గ రాజ్య ప్రవేశ పత్రాలు ఇలాంటివేగా ?
మానవుడు మానసికంగా ఏం పెరిగినట్టు ?

మతంతో పోటీ పడి ఈ నాడు
వ్యాపారం దోపిడీ చేస్తున్నది !
చిత్రి మేమి టంటే — నాడూ నేడూ కూడ
దోచుకోబడుతున్న వాళ్ళు మెజారిటీ మందలే !

లూధర్లు పుడుతున్నారు , గిడుతున్నారు ,
విప్లవ రక్తంతో నేల తడుస్తున్నది , ఎండి పోతున్నది ,
అహం బ్రహ్మాస్మి అంటూ కూర్చున్న అయ్యవార్లే
భజ గోవిందం అంటూ విరుచుకుపడుతున్నారు !

మళ్ళీ వర్షాలు కురిసి పచ్చిక తలెత్తగానే
మందల్ని బీళ్ళలోకి తోలి ,
కసాయి కత్తులతో బేరాలు సాగిస్తుంటై
గట్లపై పారాహుషారు వెదురు చువ్వలు !

జనరేషన్ గేప్ అనేది వట్టి మిథ్య ;
అవ్వకూ , మనుమరాలికీ మధ్య దూరం
ఒక (చేయూత) మూరెడు మాత్రం !
అడుగులో ఆక , పడుగులో పేక !

గుడ్డిగా అనుసరించ కుండా ,
ప్రశ్నించుకొంటూ వెళుతున్నావు నీవు !
మంచిది , అలాగే వెళ్ళి రా !
పరీక్ష లంటే అగ్ని పరీక్షలు మాత్రమే !

అసలు పునాది అలానే వుంచి
పైభవనాన్ని ఆధునికీకరించ వచ్చునా ?
పునాది కూడ పున సృష్టిని కోరు తున్నదా ?
నీవు తిరిగి వచ్చినప్పుడు గాని తేలదు .

93. వెలిగినంత సేపే

మొన్న ఒక సభకు వెళ్ళాను,
అధ్యక్షుడు ఎగగొట్టడం వల్ల
ఆ పదవి నన్ను వరించింది.

వేదికపై ఒక ప్రక్క గల చిత్ర పటానికి
పూల మాల వెయ్యమన్నారు నిర్వాహకులు !
నేను వెయ్య నన్నాను !

అదొక మానవుడి చిత్ర పటం .
నాలాగే పుట్టి , పెరిగి ,
జీవిత సహజమైన కష్ట సుఖాలన్నీ అనుభవించి ,
విశ్వమానవ శ్రేయస్సు కోసం
తనదైన క్షేత్రంలో
చేతనైన కృషి నంతా చేసి ,
ఎంతో ఫలితాన్ని సాధించి
ప్రపంచానికి పంచిపెట్టి ,
నాకంటే చాల ముందే
ఆరిపోయిన మహా జ్యోతి అతడు .

నా దృష్టిలో ప్రతి మానవుడూ ఒక జ్యోతే !
అది విశ్వదర్శక దీపస్తంభం కావచ్చు ,
నిరుపేద కుటీరంలోని కొవ్వొత్తి కావచ్చు .
వెలిగినంతసేపే ఏ దివ్వె ప్రయోజనమైనా ,
ఆరిన తర్వాత అన్నీ ఒకే ఆనంద తత్త్వం !

అందుకే నేను —
ఏ మృత కళేబరానికీ పూలమాల వెయ్యను
అత డెంత గొప్పగా బ్రతికిన వాడైనా సరే !
ఎంతటి దైవాంశగా కీర్తి శేషుడైనా సరే !

తాను చెప్పేది దైవ సందేశ మనే వాడు
మూర్ఖుడు , కాక వంచకుడు .

తానే దైవమనో , దైవావతారమనో చెప్పేవాడు
లోకాన్ని తనతో సహగమనం చెయ్యమంటున్నాడు !
సృష్టి స్థితి లయాలు నిత్యనూతనాలు ,
అవి ఏ ఒక్కడితోనో అంతరించేవి కావు .

మన సాంఘిక రాజకీయ సముద్దండులే
మానవ ప్రగతిని అరికట్టిన మహా కొండలు !
మలుపులు తిరిగో , మార్గం తొలిచో
ముందుకు సాగుతూనే వుంది జనవాహిని !

మనం చేస్తున్న వీర పూజ లన్నీ
మన విజ్ఞతను , వివేకాన్ని వెచ్చించి
లైసెన్సు గల దుకాణాల్లో కొనుక్కొంటున్న
గత కాలపు శిథిలావశేషాలు !

నా ముత్తవ్వ యొక్క బారెడు వెంట్రుక కంటె
బస్సులో నా ముందు నిలబడ్డ
ఆ ఎవరిదో విరజాజుల కురచ జడ
నా కెక్కువ ఆరాధ నీయం !

అందుకే నన్ను వెలివేస్తాయి —
ఆ పాత చెత్త నంతా
బంగారం కంటె మించిన ధరకు
అమ్ముకొంటున్న దుకాణాలు !
మొత్తం సామాన్య ప్రజ లందర్నీ

ఈగల్ని , చీమల్ని చేసుకొని
పెత్తనాలు వెలగ బెడుతున్న
పెద్ద పెద్ద బెల్ల పచ్చులు !

" అక్షరాలలో అకారం నేను "
అన్నా డొక దేవుడు !
తక్కిన అక్షరాలు మరింకెవరోనా ?
రావిచెట్టు తానైతే —
మరి , మావిచెట్టు నేనా ?

అందుకే , అంటున్నాను —
రూప గుణాల న్న దేదీ దైవం కాదు !
పుట్టి చచ్చిపోయిన వా డెవడూ
తానే అంతిమాధికారి కాడు !

గత కాలపు మహా పురుషులను గౌరవించు ,
వాళ్ళ చరిత్రలను గానం చెయ్యి ,
అంత వరకే !

ఎవడూ ఎవడికీ మార్గదర్శకుడు కాదు ,
ఒక దివ్వె మరొక దివ్వెకు దారి చూపలేదు !
రెండు దివ్వెలు కలిస్తే
రెట్టిం పవుతుంది వెలుగు !
ఒక చోట వున్నా సరే —
మనలా ఎక్క డెక్కడో వున్నా సరే !

94. చచ్చిపోయిన వెనుక

చచ్చిపోయాను నేను !
అంతా ఏడుస్తున్నారు నా కళేబరం చుట్టూ చేరి !
నా కళేబరమే నే ననుకొంటున్నారు వాళ్ళు !
నవ్వొచ్చింది వాళ్ళను చూస్తే !

అన్నట్టు – నువ్వేమి చేస్తున్నావో !
అనుకోగానే వచ్చేశాను బాణంలా !
నువ్వూ ఏడుస్తూనే ఉన్నావు
అంతటి రసాద్వైత తత్వవేత్తవూ !

నవ్వు ఆగలేదు నాకు !
నువ్వు ఏడ్చేకొలదీ నేను నవ్వసాగాను !
నీవు మామూలుగానే ఉన్నావు నాకు ,
నేనే నీకు కనిపించటం లేదల్లే ఉంది !

ఏడ్చి ఏడ్చి నిద్రపోయావు నీవు ,
నీపై ఒరిగాను నేను రోజూలా !
ఆత్రంగా అదిమిపట్టేసుకొన్నావు నన్ను
" వచ్చావా ? చచ్చిపోలేదా ? " అంటూ !

" లే దమ్మా , నేను చచ్చి పోలేదు !
ఎందు కలా ఏడుస్తావు పామరుడిలా ?
కాలాతీత అమృత ఆనంద ఆత్మలం మనం
నీ సిద్ధాంతంలో నీకే నమ్మకం లేదా "

నా నవ్వు నీ నిండా వెన్నెల కాస్తోంది !
ఆపాదమస్తకం నా ప్రత్యణువూ నీలో రమిస్తున్నది !
" నువ్వు చచ్చి పోయా వన్నా రెవరో ! "
నవ్వుతూ కళ్ళు తుడుచుకున్నావు నీవు !

ఎలాగో చూస్తున్నావు నా కళ్ళల్లోకి !
మబ్బులలో తడిసిన నెలవంకలా అవి ?
నేనే ఉషః కాంతి రేఖలా ఉన్నానేమో !
అనుమానంగానే ఉన్నట్టుంది నీకు !

" ఏమీ అయి పోలేదు నేను ,
నా లక్ష్యం నీవు కాబట్టి
నీలోకి వచ్చేశాను శాశ్వతంగా !
ఇకనుంచి నా నివాసం నీవే ! "

ఇక నుంచి అంటున్నా నేమిటి ?
ఇంతకు ముందు మాత్రం నీలో లేనా ?
హఠాత్తుగా ఏదో జ్ఞప్తికి వచ్చి ,
వెదకసాగాను నీ హృదయం మూల మూలలా !

నీవు చెప్పుకొంటూ ఉంటావుగా తరచు —
నీ హృదయం తేనెపట్టు లాంటి దని ?
అందులో ప్రతి ప్రేమకూ స్థానం వుం దని ?
ప్రతి చెలిమికీ మధురసం లభిస్తుం దని ?

ఇంతవరకూ నిన్ను వలచీ , వలపించుకొనీ
నీలో కలిసిపోయి నిలిచిపోయిన చెలుల కోసం
వెదక సాగాను నీ హృదయం నలుమూలలా !
ఏవో మిణుకులు తప్ప నాకేం కనిపించ లేదు !

నీ హృదయం ఒక అరుణోదయ బింబం ,
ఒక వసంతోజ్వల నక్షత్ర మండలం !
రక రకాల సుందర కాంతుల రాశి అది !
అందులో ఏ కాంతి రేఖ ఏ రాగరేఖో
ఎందుకు వివేచించడం ?

దూరదూరాలకు ప్రసరించిపోతున్న కాంతి కుల్యలు ;
దూరదూరాల నుంచి ప్రవహించివస్తున్న రాగధార !
అతిలోక రమణీయం నీ హృదయ క్రియ !
బాహ్యాభ్యంతర చేత స్రోత స్సంభేదం అది !

సామాన్యుడి గుండె కాదు నీది ,
అదొక విశ్వ రసోదయ కాంతి కేంద్రం !
నీ ప్రత్యణువూ ఒక ప్రభా కణం !
ఎంత అదృష్టం నీతో తాదాత్మ్యం !

" పాలల్లో చక్కెర కలిసిపోయినట్టు
నీ లో కలిసిపోయాను నేను
రోజూ ఏదో ఒక బాధతో ఏడ్చే శరీరాన్ని
చెత్త కుండీలో పారేసి వచ్చేశాను !

" నేను నీవై పోయాను ప్రియా !
అబద్ధంకాదు , అద్దంలో చూచుకో ! "
అంటూ నేను నీలో లయమైపోయాను !
నీవే అయి పోయాను !

తటాలున లేచి అద్దంలో చూచుకొన్నావు నీవు !
ఆ కళ్ళు ఎవరివి ? ఆ కాంతి ఎక్కడిది :
" నిజమే " అన్నావు నీవు ,
నిట్టూర్పు విడిచావు నీవు .

" ఎన్నో వాగులు చేరతై ఒక మహానదిలో
వాగు లక్ష్యం మహానది ,
మహానది లక్ష్యం మహోదధి ,
మహోదధి లక్ష్యం మార్తాండ హృదయం ,
మబ్బులు , వర్షాలు , మళ్ళీ వాగులు !

" రసాలు , భావాలు , సౌదర్యాలు
ఎన్ని చేరితే ఈ గుండె పూర్ణ కుంభ మయిందో !
వా టన్నిటికీ మూల ప్రకృతివి నీవు ,
నీ ఆలయమే ఇది ఎల్లప్పుడూ !

" కాని , దేవీ !
నీవు నాలో కలిసి పోతే ,
ఇక నే నే గంగలో కలవను ?
ఒంటరితనం ఎంత కఠోరం !

" నా నేనుకు కూడా రూపం పోయేదాకా ,
నీవు నీవుగా తోడుండలేవా నాకు ?
నాతో జంటగా చివరి దాకా వచ్చి
ఒకేసారి కలవ గూడదా ఏ వార్ధిలోనో ?

" ప్రియా ! ఇది అన్యాయం , అసంగతం !
బైటికి వచ్చేయ్ ! తొడుక్కో శరీరాన్ని !
ఏవో బాధలతో ఏడ్చేదైనా సరే ,
నీ శరీరమే నా సుందర సుధా కలశం !

" లేక పోతే , చూడు !
ఈ నా శరీరాన్ని కూడ విప్పేసి
చెత్తకుండీలో పారేస్తా ఇప్పుడే ! "
అంటూ ఏడవ సాగావు మళ్ళీ !

" ఆనందించ వలసిన దానికి
అలో మని ఏడుస్తా వెందుకు ?
నీ అంతరాత్మగా చెపుతున్నాను విను !
నీ కన్నీటితో నా కాటుక కరిగి పోతున్నది !

ఒంటరి వాడి వెందు కయావు నీవు ?
నేను లేనా లోన , బైటా , చుట్టూ
ఇతోధిక తేజస్సుతో , ఓ జస్సుతో నిన్ను
ముందుకు నడిపించనా క్షణం క్షణం ?

పోనీ అప్పుడప్పుడు -
నీవు ఒళ్ళు మరచి కలలు కంటున్నప్పుడు
కళా రమనై నీ కౌగిట్లోకి వస్తా !
రాగలేఖనై నీ భోగంలో ద్రవిస్తా !

చాలదా ఈ వరం కూడ ?
ఇవిగో , ప్రకృతి సౌందర్యాల అంతఃపురాలు !
ఇవిగో , నీ వాంఛల మోహన స్వరూప సిద్ధులు !
కన్నీటితో కప్పేసుకోకు కళ్లు ! "

" నాకు ఏ అంతః పురాలూ వద్దు ,
నాకు ఏ వాంఛా సిద్ధులూ వద్దు !
నాకు కావలసింది నీవే , నీవే , నీవే ! "
అంటూ గుంజావు నన్ను నీలో నుంచి !

స్విచ్చి నొక్కిన విద్యుద్దీపంలా
ఆరి పోయింది నా మెలకువ !
అంతా అవ్యక్త పారవశ్యం ,
ఒక అమృత మధు బిందువు !

95. అవతలి తీరం

మరణా నంతరం
ఏమిటి ?
అవును , ఏమిటి ?
మనిషి మరణించిన తర్వాత
ఏ మవుతాడు ?
అవును , ఏ మవుతాడు ?

ఈ విషయం
ఇంత వరకు ఎవరూ
ఆలో చించ లేదా ?
లక్ష మంది ఆలో చించారు !

చచ్చిన తర్వాత ఏమౌతాం
అనే విషయం గురించి
బ్రతి కుండగా ఆలోచించారు !
లక్ష మంది ఆలోచించారు !
అవతార పురుషులు , మహర్షులు ,
మహా ప్రవక్తలు , యోగీశ్వరులు
లక్ష మంది ఆలోచించారు !

అందులో ఏ ఒక్కడూ
తాను చచ్చిన తర్వాత
కనీసం తాను ఏమైనాడో
బ్రతికున్న వాళ్లకు చెప్పలేదు !
ఎందుకు చెప్పలేదు ?
చెప్ప కూడ దనా ?
చెప్ప లేకనా ?

చెప్ప కూడ దనుకొన్నవాడు
ప్రవక్త కాలేడు ,
చెప్ప లేని వాడు
మందిలో ఒకడు !

సత్యం నేను చెపుతున్నాను, విను !
మహా పురుషుల్ని అనుమానించడం దేనికి ?

బ్రతి కుండగా
ఎందరో ఎన్నో చెపుతారు —
అవన్నీ వాళ్ల వూహలు !
వాళ్ల వ్యక్తిత్వ బలాన్ని బట్టి
వాటి ప్రభావం ప్రజలను లోగొంటుంది !

చచ్చిన తర్వాత
తానే వుండడు కదా ?
ఇతరుల కేం చెపుతాడు ?
దీపం వెలుగుతున్నంత వరకే
దాని శక్తిని బట్టి దాని కాంతి !

దీపం వెలుగు తున్నంత వరకే
అది ప్రమిదె దీపమా
విద్యుద్దీపమా
అనే తేడాలు !
వాటి శక్తిలో అంతరాలు !
ఆరిన తర్వాత
అంతా ఒకటే !
మిగిలే దేం లేదు —
ఒకటే సచ్చిదానందం !
ఒకటే పరబ్రహ్మ !

96. చావుకు విరుగుడు

దైవం అంటే ?
అది మరణ భీతిని చంపడానికి
పుట్టబడిన కవలల్లో ఒకటి ,
రెండోది మతం !

దైవం , మతం — ఈ రెండూ
చావుకు విరుగుడుగా
మనిషి సృష్టించు కొన్న
ఆత్మీయ దివ్యౌషధులు !

ఈ ఔషధాల వల్ల కలిగిన ఫలితం
మరణానంతర జీవన భ్రాంతి !
చచ్చిన తర్వాత కూడ బ్రతికే వుంటా నన్న
ధైర్యం తెచ్చుకొని తప్ప
చావడ మనే నగ్న సత్యాన్ని సైతం
ఎదుర్కోలేడు మనిషి !

సృష్టి సహజమైన వైవిధ్యాన్ని
జీవితాలలోని హెచ్చు తగ్గులను
కష్ట సుఖాలను పురస్కరించుకొని
పుట్టుకొచ్చినై పుట్ట గొడుగుల్లా
ఆరుద్ర పురుగుల్లా , సీతాకోక చిలకల్లా
పుణ్య పాపాలు , స్వర్గ నరకాలు ,
పూర్వ జన్మ సూత్రాలు , మోక్షమార్గాలు !

విత్తనం చెట్టయి , మళ్ళీ విత్తనమైపోతుంది ,
చెట్టు పంచ భూతాలలో కలిసిపోతుంది ,
అంతకంటె మరేంలేదు .

ఈ విత్తనం ఏమిటి ? ఎక్కడిది ?
ఎక్కడికి పోతుంది ?
ఇది జీవ పరమాణురహస్యం ,
ఈ పరమాణు సముదాయమే పరబ్రహ్మ !
చావుకు విరుగుడు లేదు ,
నిజానికి , చావే మూల జీవం !

97. మనిషి - దేవుడు

" అయ్యో , మానవుడు —
దానవుడై పోతున్నాడు !
బంధు ప్రీతి , ఆశ్రిత పక్షపాతం
స్తోత్ర ప్రియత , లంచగొండితనం
మోసం , ద్వేషం , హింస , దోపిడి

ఇలాంటి దానవ గుణాలను పెంచుకొని
మనిషే మనిషిని తినేస్తున్నాడు "
అంటూ విమర్శిస్తున్నారు
నీ వంటి వాళ్ళంతా ఈ నాడు .

అయితే , మహాశయా !
ఈ దానవ గుణా లన్నిటినీ
మనిషి ఎక్కడి నుంచి నేర్చుకొన్నాడు ?
తెలుసుకోవా లని ఉన్నదా ?
ఉంటే — ఒకసారి వచ్చి ఈ దేవుళ్ళను దర్శించు !

ఈ గుడుల్లోని ఏ దేవుడి కంటె కూడ
మన వూళ్లోని ప్రతి మనిషి గొప్ప వాడే !
ఏ పీఠాధిపతి కంటె కూడ
పల్లెటూరి పామరుడే పవిత్రుడు !

ఇదీ ఈ యాత్రలలో
నేను గుర్తించిన సత్యం !

నిజానికి —
మానవుణ్ని పాడు చేసింది
అతడు కల్పించిన మాయ దేవుడే !

98. మతం పెట్టిన శాపం

ప్రవక్తో, పరిపాలకుడో కావడానికి
అతుర జ్ఞానం అక్కర లేదు !
భక్తి, దాస్యం ద్వారా తరించడానికి
మనిషిగానే పుట్టనక్కర లేదు !

స్వర్గరాజ్యమో, మోక్షమార్గమో దొరకడానికి
నీతికి కట్టుపడే బ్రతకక్కర లేదు !
సుఖం కోసం నీవు ఎన్ని ఖూనీలు చేసినా —
చస్తూ మాత్రం దేవుడిపేరు పలుకు, చాలు !

నీవు పుట్టుకతోనే పాపివైతే —
మళ్ళీ మళ్ళీ అదే పాపం చేస్తూ వెందుకు ?
నీ ప్రారబ్ధాన్ని దేవుడైనా మార్చలేకపోతే —
ఇంకెందు కీ దైవాలు, దేవాలయాలు ?

పూర్వం అర్థం కాకనో, స్వార్థం కోసమో —
మతం పేరిట మేధావి ఘేరవం
చచ్చు గొర్రెల్ని హడల గొట్టింది !
చవగ్గా నెత్తురు పీల్చి, మెదడును మెక్కింది !

మరచి పోకు , ఇది విజ్ఞాన యుగం
యువకుల ప్రజ్ఞానం రూపుగొన్న ఖగం !
" నీవు నేర్పిన విద్యయే " అని వాళ్ళంటే
ఎందుకు మీ అవ్వలాంటి వాళ్ళ కంత మంట ?

పత్రికలలో , రేడియోలలో , సినిమాలలో ,
మఠాల వీధుల చౌరస్తాలలో —
ముఠాల వేదుల శిరస్తాలలో
ఎంతటి ఔట్ల తుంటరి ప్రచారపు చొప్ప !

ఈ చొప్పతో , పిప్పితో ఇంకా ఎంత కాలం
కడుపులు నింపుకొంటూ యీ గొర్రెలు ?
గొర్రెలు అంతంటె ఏం చెయ్యగల వంటావా ?
ఇవి మానవ గొర్రెలు కదా అని నా ఆశ !

వీటిని తింటున్న పులులూ , తోడేళ్లు కూడా
మానవ రూపం కలవే అంటావు !
వీటిని అవి ఎన్నటికీ కూడ
బుద్ధి తెచ్చుకో నివ్వవు అంటావు !

బలవంతుడు —
చంపడం తన జన్మహక్కనుకొంటున్నాడు ,
బలహీనుడు —
చావడం తన ప్రారబ్ధం అనుకొంటున్నాడు !

మతం మనిషి కిచ్చిన శాపం ఇది —
బలవంతుణ్ని క్రూర మృగంగా రేపింది,
బలహీనుణ్ని గొర్రెనులా మేపింది,
మానవతకు తానే స్వస్తి విషం చేపింది !

మతం మాయా వాగురలో చిక్కుకొని
చచ్చిన వీరులకు శరణాగతు లవుతున్నంత కాలం
మానవుడికి లభించేది శ్మశానమే — అది
సింహమైనా, తోడేలైనా, గొర్రె అయినా !

ఈ శాపానికి, విషానికి విరుగుడు
ఇక లేనే లేదా అనేది నా ప్రశ్న !
ఉన్నది, ఉండక తప్పదు అనేది నా ఆశ !
నీవు ఏ మంటావు ?

ఈ మానవ జాతుల్లో ఒకొక్క దానికి
ఒకొక్క కళ్ళెం, ముకు తాడు, గుది బండ !
ఎడమచేయి పురచేయిపై దండెత్తుతుంది,
మార్జాలం పిల్లిచే దాస్యం చేయించుకొంటుంది !

ఓ పదిమంది దొంగలు కుమ్మక్కై అయి
తమలో తాము కొట్టుకు చస్తున్నట్టు నటిస్తూ
ప్రజల్ని దోచుకొంటున్నారు,
పంచుకు తింటున్నారు !

ఈ మాయ నుంచీ , మాయా వాదం నుంచీ
గొర్రె లెప్పటికీ బైటపడలేవా ?
తామే చివరి అవతారంగా చెప్పుకొని వచ్చిన
మత దేవతల గారడీని ఛేదించ లేవా ?

సంభవామి యుగే యుగే అన్న శక్తి
మళ్ళీ అవతరించడమే సంభవిస్తే —
అది " గొర్రె సింగ " మై విజృంభించ గలదు ,
ముచ్చు పుర్రెల్ని పచ్చికలా మేసెయ్యగలదు !

మానవ జాతి — పుట్టుక మొదలు నేటిదాకా —
పులుల తోడేళ్ళ పెత్తనాన్నే రుచి చూచింది ,
అది కేవలం కుక్షింభరి అని గుర్తించేసింది ,
ఇక స్వయం వ్యక్తం ఎందుకు కాదు ?

నేను ఆ శా వాదిని —
ప్రజలు మనుషు లవుతారు !
మనుషు లెప్పుడూ మహితాత్ములే !
మత వాగురల్ని తెంచి పారేస్తారు !

ప్రతి శాపానికీ విరుగుడు వుంది ,
మతం మనిషికి ఒక శాపం ,
దీనికీ ఒక అంతిమత వుంది !
అది సాంస్కృతిక విప్లవం !

99. విప్లవ చక్రం

" ప్రేమ, శృంగారం, రసం, రసాద్వైతం
ఈ వలయం — ఆనందం నుంచి వెలువడిన జీవి
తిరిగి ఆనందంలో లయించడానికి
నీవు చూపుతున్న సాహితీ మార్గం !

" అయితే — ఈ నాడు —
తమను తామే మరచిపోయి
నక్కలకూ, పులులకూ తమను తామే

బలిపెట్టు కొంటున్న ఈ
ప్రజా గొర్రెల మందకు
ఈ నీ దారే తెలియదు కదా ?
మ రెలా ? "

బాగుంది , దేవీ , నీ ప్రశ్న !
ఈ ప్రశ్నకు నా జవాబు మరో ప్రశ్న —
ఈ ప్రజా గొర్రెల మందకు
నీ మతాలూ , దేవుళ్ళూ చూపుతున్న దా రేమిటి ?

మతాలు , మత ప్రవ క్తలు
దేవుళ్ళు , దైవ భక్తులు —
అంతా ఒక కుట్ర !
నక్కలకూ , పులులకూ
గొర్రెల్ని సేకరించి పెట్టే ఒక వాగుర !

పులలకూ , నక్కలకూ దొరికే ఆహారం
గొర్రెలకు లేదంటే అది ఆర్థిక సమస్య ,
బ్రతకడానికి మాత్రమే సరిపడే గడ్డి
దొరుకుతున్న దంటే అది రాజకీయ సమస్య !
ఈ సమస్యా జోడుగుర్రాల రథానికి
రథికులు పులులు —
సారథులు నక్కలు !
చతురంగ బలాలు మతాలు , ప్రవ క్తలు ,
దేవుళ్లూ , భక్తులూ !

ఈ కుట్ర నుంచి , ఈ వాగుర నుంచి
గొర్రెలు బైటపడే మార్గం లేదా ?
ఎందుకు లేదు ? ఉంది !
అది —
నా మార్గానికి రావడమే !
అదెలా అంటావా ?
ఉద్బోధ ద్వారా ,
విప్లవం ద్వారా !
నా రసాద్వైత తత్త్వోపదేశమే ఉద్బోధ .
పూర్తి మానసిక పరివర్తనమే విప్లవం !

ప్రస్తుత సాంఘిక వ్యవస్థ మారాలి ,
ఉపనిషత్ పరమ పదానికి
సూటి మార్గం ఏర్పడాలి !
అట్టి మార్గంలో శతాబ్దాల తరబడిగా
పేరుగుతూ వస్తున్న ముళ్ళ డొంకల్ని
పెరికి పారెయ్యలేక పోతే —
నరికైనా పారెయ్యాలి !

ఈ ఉద్బోధ యాత్రా పథంలో
త్రిప్పుకు రా నీ విప్లవ చక్రాన్ని !
నిరంతర చక్రభ్రమణమే
నిత్య పురోగమనం !

100. అవతారాల నిర్వాకం

ఈ చరాచర చేతనా చేతన
పాంచ భౌతిక సృష్టికి
మూల శక్తి ఏదో
అది లే దనడం లేదు నేను !

నేను లేదంటున్నది —
అవ్వ కల్పించుకొన్న సాకార దైవం !

సాకారం , సగుణం , స్థానికం ,
ఆగ్ర హానుగ్రహ శక్తిమంతం
అయిన దేవు డనబడే దేదీ
లే దంటున్నా నంతే !

ఏ మతాన్నైనా పరిశీలించు
ఏ అవతార పురుషుణ్ణైనా గమనించు ,
ఏ ప్రవక్త నైనా తీసుకో !
సాధించిం దేమిటి ?

నీవు ఏ వస్తువు కేసైనా తదేకంగా చూచి
కళ్ళు మూసుకొన్నప్పుడు , ఆ ఎదుట
ఆ వస్తువే బింబిస్తుంది కదా ?

మత విశ్వాసంలో , దైవభక్తిలో
ఉన్న పరమ రహస్యం ఇదే !
చిన్నప్పటి నుంచీ విషం తినిపించబడ్డ
విషకన్యలు ఈ భక్తి విశ్వాసాలు !
అవి ఆవేశించిన ఎవళ్ళకూ
అభ్యుదయం లేదు !

" నన్ను ఎవళ్ళు ఏ రూపంలో భావిస్తే
నేను వాళ్ళకు ఆ రూపంలో సాక్షాత్కరిస్తా "
అన్నాడు భగవద్గీతలో కృష్ణుడు —
విశ్వబాలకుడు , విశ్వాత్మకుడు తానే అయి
విశ్వ విభుడుగా పెరిగిన ప్రేమికుడు !

అంటే ఏమిటి ?
ఈ లోకంలో ఎవడికైనా
తన మనస్సే తన దైవం అని !
అందుకే — భావావేశ పారవశ్యంలో
శైవుడికి శివుడు , వైష్ణవుడికి విష్ణువు
ఉపాసకుడికి శక్తి , ప్రేయసికి ప్రియుడు
సాక్షాత్కరిస్తూ వుంటారు !

అవతారాలూ , అవతార పురుషులూ
సాధించిం దేం లేదు ,
మానవ సమాజం వికసిస్తున్న దంటే
అది దాని స్వభావం .

•

ఎంత గొప్ప తపస్వి అయినా
మహిమలు చూపిన మహాత్ము డైనా
మరణించిన తర్వాత
మళ్ళీ కనిపించిన వాడు లేడు !

ఈ యాత్రలూ , అర్చనలూ
వ్యాకులితాత్మకు నాటుసారాలు .
ఎవడికీ నిజం తెలీదు ,
తెలిసినవాడు నిజం చెప్పినా
నమ్మే వాడూ లేడు !

చీకట్లో గ్రుడ్డి వాడి పిలుపే
శ్రీరామ రక్ష జనానికి !
ఎదిరించకు వాళ్ళని ,
వాళ్ళే లోకంలో మెజారిటీ !

మానవ మనస్తత్వానికి
మంచి అద్దాలీ క్షేత్రాలు !
అందులో అందర్నీ చూచి ,
నిన్ను నీవూ చూచుకొంటూ , రా !

101. పూర్ణిమ నుంచి పూర్ణిమకు

జీవితం ఒక పూర్ణిమమే కాదు,
అది చెరిసగం అమావాస్య కూడ !
పూర్ణిమ కారు మబ్బులతో చీకటై పోవచ్చు,
అమావాస్య దీపావళితో దేదీప్యం కావచ్చు !

పూర్ణిమ నుంచి పూర్ణిమకు వినోదం,
అమావాస్య నుంచి అమావాస్యకు విషాదం,
రెండూ పరిపూర్ణ జీవితాలే,
సుఖ దుఃఖాలు మనోగతాలు.

వెలుగులోకి చీకటి రాదు,
చీకటిలోకి వెలుగు వస్తుంది.
చీకటి స్థిరం, వెలుగు చరం నా, నీ వలె !
నా నుంచి నా కోసం నీవు పుట్టడమే సృష్టి !

పూర్ణిమమో, అమావాస్యో —
అవి ప్రకృతి సిద్ధమైన లీలలు !
ఎందుకు మనకు వాటి జోలి ?
మన ప్రణయం వాటి వనమాలి.

102. బేంకులలో నిల్వాలు

మధురమైన అనుభవాలు లేకుండా
మహితమైన అనుభూతులు ఉండవు !
బేంకులలోని నిల్వల వంటివి అనుభవాలు ,
రాబడి పోయినప్పుడు బ్రతుకు కు ఆసరా అవే !

కాలం , దూరం , వ్యక్తిత్వం ఉన్నప్పుడు
మనుషుల మధ్య ఎడబాటు ఎందు కుండదు ?
పండక్కో , పురిటికో , కేంపుకో , యాత్రకో
తీసుకుపోతుంటై పరిస్థితులు మనిషిని !

వియోగం వట్టి దుఃఖ హేతువేనా ?
అందులోకూడ ఏదో మాధుర్యం లేదా ?
ఉదయాప వరణం లేకుండా
హృదయాప రమణం ఎంత మధురం !

ప్రతి క్షణమూ ఒక క్రొత్త అనుభవమే మనకు ,
అక్షయ నిధి నిక్షేపాలు మన ఆత్మలు !
అందుకే ఇంత అందంగా బ్రతుకుతున్నాం
ఇంత దూరంలో ఉంటూ కూడ !

103. నిరంతర వర్తమానం

గతంలోకి తిరిగి చూచుకొంటూ ,
గడిచిన రోజులే మంచి వనుకొంటూ ,
ఎప్పుడో తాను చేసిన పనుల్ని గురించి
చెప్పుకొంటూ కూర్చునేవాడు వృద్ధుడు !

భవిష్యత్తులోకి తేరిపార జూస్తూ ,
మంచి రోజుల కోసం ఎదురు చూస్తూ ,

తాను సాధించబోయే కార్యాలను గురించి
కలలు కంటూ నడిచేవాడు బాలుడు !

ఆ వృద్ధుడూ , ఈ బాలుడూ కూడ
వర్తమానంలో బ్రతుకుతున్న వాళ్ళు కారు
వృద్ధుడికి భవిష్యత్తు లేదు , బాలుడికి గతంలేదు
వాళ్ళ వర్తమానం ఒక శూన్యం మాత్రం !

గతం మృతం , భవిష్యత్తు అనిర్దిష్టం ,
వర్తమానమే అసలైన జీవితం ,
జీవిత మంటే ఈ క్షణమే అనుకొంటూ
ప్రతి క్షణమూ- బ్రతికేవాడు యువకుడు !

ఇప్పటి నేడే రేపటి నిన్నకదా ?
వర్తమానం చెడ్డదైతే , గతం మంచి దెలా అవుద్ది ?
చెడ్డ దనుకొన్న నేడే రేపటికి మంచిదిగా కనిపిస్తే
అట్టి జీవితగతి సుఖాంత మెలా అవుద్ది ?

వార్ధక్యానికి వేళ్ళే కాని చిగుళ్ళు లేవు
బాల్యానికి చిగుళ్ళే కాని వేళ్ళు లేవు ,
సమగ్ర సుందరమైన వృక్షమే యౌవనం ,
అదే వర్తమానం , మన సమాలింగనం !

104. ప్రసవ వేదన

ఎందుకు నన్ను అవతలికి పిలుస్తావు ?
నీవే ఇవతలి కెందుకు రావు ?
మ నిద్దరిలో ఎవ రెటు రావా లన్నా
ఎదో ఒక నావ ఎక్కవలసిందే కదా ?

పైగా నే నటు రావడం కంటె
నీ విటు రావడమే తేలిక !
నీవు ప్రసవ వేదనే పడలేక పోతే ,
నేను మరణ వేదన ఎలా పడగలను ?

ఇదిగో నా మనస్సును పరిచాను అద్దరి దాకా ,
నడిచి రావచ్చు కాళ్లు తడైనా కాకుండా !
నీవు ఇద్దరికి రావటమే జీవితానందం
నీవే రా , ఎంత కాలాని కైనా సరే !

105. శిల - శివం

లోగడ ఒక రైలు ప్రయాణం చేశాను,
టూ టైరు స్లీపరులో బెర్తు రిజర్వేషను
ముందే చేయించాను !

తీరా — రైలెక్కి చూద్దును కదా —
ద్వారం పక్క నాది ఒక్కటే బెర్తు !
బెజవాడలో బందరు కాల్వ ఒడ్డు లాంటి
మురికి సీటు !
ఎదర లెట్రినులు !
లెట్రినుల చెక్కపై
" దొంగ లున్నారు జాగ్రత్త " నోటీసు !

ఎక్కే దిగే ప్రయాణీకులతో ద్వారానికి
వచ్చే పోయే అవసరాలతో లెట్రినులకు
ఈ నిరంతర న్యూసెన్సుతో నాకు

ప్రయాణం పద్దెనిమిది గంటలూ
ఒక్కటే అశాంతి ! యాతన !

ఎవడో తలుపు తోస్తాడు ,
కాలు చితుకుతుంది !
మ రెవడో తలుపు వేస్తాడు ,
చెప్పు బైటికి పోతుంది !

అది రహదారి కనుక
కన్ను మూయ్యలేను !
ఎదర లెట్రినులు కనుక
ముక్కు తెరవలేను !
దొంగ లున్నారు కనుక
రైలు ఆగినప్పుడైనా నిశ్చింతగా
నలుగురితో బైట తిరగ లేను !
సరదాగా చేద్దా మనుకొన్న ప్రయాణం
ఇలా తగులడింది నరకంలా !

ఈ రైలు పెట్టెను ఇంత అసహ్యంగా
రూపొందించిన ఆ ఇంజనీరు డెవడో !
వాణ్ని అంత అధికారంగా
సృష్టించిన ఆ బ్రహ్మ పేర డెవడో !

" సత్యం , సుందరం , శివం " అంటూ ఘోషించిన
ఈ జాతికి చెంది వుంటాడని మాత్రం అనుకోను !

ఈ ముష్టి బెర్తు ఒక్కటీ లేకపోతే
రైల్వేశాఖ దివాళా తీస్తుందన్నా నమ్మను !
మ రేమిటీ అంటే —
ఈ జాతే పతనమై పోతూవుంది !

ఒక సారి – ఆ నాటి హరిశ్చంద్రం అవస్థ నుంచి
కురుక్షేత్రం కురుల మీదుగా
ఈ నాటి ప్రజా స్వామ్యం లోని
హరిజనుల ప్రత్యేక వాడల దాకా
మన ధర్మ వ్యవస్థను ఒక సారి పరికించి చూడు !

సత్యాన్ని బెదరగొట్టి తరిమేశాం !
సౌందర్యాన్ని నడి బజారులో
కుక్కలకు విసిరేశాం !

ఇక — శివం ఏదీ ?
ఈ అమానుషాలు చూడ లేక
శివం శిలై పోయింది !
జాతి శిథిలావశేష మయింది !

శిల మళ్ళీ ప్రాణం పోసుకొని
శివం కావాలి !
అందుకే ఈ తపస్సు !
అక్కడికే – దుస్సహ మైనా
ఈ సహనాయత యాత్రా స్రోతస్సు !

106. పూర్ణ మదః పూర్ణ మిదం

" పూర్ణ మదః పూర్ణ మిదం
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణ స్య పూర్ణ మాదాయ
పూర్ణ మే వా వ శిష్యతే ! "

ఓహో , కవంటే వేద ఋషే కవి !
ఎంత బాగా వర్ణించా డిప్పటి నా స్థితిని !
అనుకొంటూ నిల బడ్డాను —
ఆస్పత్రి వాకిట్లో
అర ఫర్లాంగు క్యూలో !

శీతమూ , ఉష్ణమూ ప్రకోపించి
బలా బలాలు తేల్చుకోడానికి
రణరంగంగా నా శరీరాన్నే ఎన్నుకోగా —
ఆ చలీ జ్వరం త్రొక్కిడిలో
చిందర వందరై పోయిన నేను
సరాసరి వెళ్ళడం డాక్టరు దగ్గరకే వెళ్ళాను !
అయితే —

డాక్టరు గది దగ్గర సైంధవ భ్రాత ఒకడు
" సాబ్ ! " అంటూ ఆపి , క్యూ చివర చూపించాడు !

" అవును , సోషలిజం కదా " అనుకొంటూ
క్యూలోకి నడిచాను నేను —
తడబడుతూ , తూలి పడుతూ ,
అడుగొక తరంగా ఆయాస పడుతూ !

పూర్ణ మదః , పూర్ణ మిదం !
అక్కడ వున్నదీ పూర్ణమే ,
ఇక్కడ వున్నదీ పూర్ణమే !
నిజమే , అయితే — ఈ క్యూలో
అక్కడ ఒక డాక్టరున్నాడు !
ఇక్కడ నా కున్న దేమిటి ?
అక్కడున్న డాక్టరు —
ఓ నవ ధనిక రోగిని పరీక్షిస్తున్నాడు
అది ఎంతకూ తెమలడం లేదు ,
క్యూ కదలడం లేదు !

ఇక్కడ నా కున్నది —
కాళ్ళ కింద పాచి బురద ,
నెత్తి మీద జల్లు మబ్బు ,
చుట్టూ చలిగాలి ,
నర నరాన మరణ వేదన !
వైకుంఠ సౌధం లాంటి ఆస్పత్రి భవనం
నీడ నిస్తున్నది కొద్ది మందికి మాత్రమే !
మెజారిటీ మొత్తం చూరు వెలుపలే వుంది !

పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే !
ఆ ముందున్న మైనారిటీ
ఈ మెజారిటీ నుంచి పుడుతున్నదేగా ?
ఆహా ! ఎంత సత్యం !

మరి , క్యూ కదలడం లేదే !
ప్రవాహం లేని నీటి పట్టులా
సంస్కారంలేని సమాజంలా
క్యూ శిథిలమై పోతున్నదే !
క్యూలో కూలబడి పోతున్నారు కొందరు !
క్యూనే వదిలేసి పోతున్నారు కొందరు !
ఈ జరగని వ్యవస్థలో , ఈ తరగని అవస్థతో
ఈ మెజారిటీ ఇలా ఎంత కాలం ?
ఇక పిళ్ళకి విముక్తే లేదా ?

లే దంటున్నాడు కవి !
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమేవ అవశిష్యతే !
దేని నుంచి దేన్ని తొలగిద్దా మన్నా
మిగిలేది మళ్ళీ అదే !
అదంటే ఇదే , ఈ క్యూ !

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

అయ్యో , ఇదా నే నూహించిన సోషలిజం ?
సర్వ జన శ్రేయో లక్ష్యమైన సర్వోదయం ?

వేదర్షి వర్ణించిన జీవన పూర్ణత్వం !
కాదు , కానే కాదు !
కవి పొరపాటు చెప్పలేదు ,
దాని అమలే ఇలా తగులడుతోంది !
గంగా లహరి ఆ పైనుంచి
స్వచ్ఛంగానే దిగుతున్నది
మా దాకా వచ్చే టప్పటికే
మలినీ భూతం అవుతున్నది !

అంతా ఒక పూర్ణం అన్నాడు వేదకవి
కామాలూ క్యూలూ పెట్టలే దతడు !
అందరికీ , అన్ని వేళలా, అన్ని అవసరాలు
తీరుతూ వుండే నిరంత రానందమే
తడి పూర్ణతా ప్రణాలిక !
దాన్ని ఇలా దు ర్వినియోగం చేస్తున్నది
స్వార్థ సాంఘిక యాజ మాన్యం !

ఆకటితో , అశక్తితో , ఆశతో
అంతం లేని ఈ క్యూలో నిలబడి వున్న నాకు
ఎక్కడిది అమృత గంగా తుషారం ?
నీవు దక్షిణేశ్వరంలో వుండివుంటా విప్పుడు !
అవును ! ఈ వెచ్చదనం అచ్చటిదే !
రాణీ రాసమణీ దేవికి
ఒక రాజీవ మాల్యం అర్పించిరా !
ఓం , పూర్ణ మదః పూర్ణ మిదం !

107. అవ్వ ప్రేమ

" మన యాత్ర విశేషాలన్నీ
రాజాకు తెలుపుతున్నావటే ? "
అంటూ వుంటుంది అవ్వ —
దేవుళ్ళతో విసిగిపోయి
నీవు జ్ఞాపకంవచ్చి నప్పుడెల్లా ?

తాను దర్శించే ప్రతి క్షేత్రం గురించీ,
క్షేత్రశక్తి గురించీ, పూజా క్రమం గురించి
నీకు వివరంగా వ్రాయమంటుంది,
పోస్టులో వేసే ముందు

లేఖకు ప్రసాదం పెడుతుంది !
మొన్న నీవు నీ లేఖలో పెట్టిన గులాబి రేకల్ని
తానే తీసుకొంది !

ఒకొక్క సారి నా కనిపిస్తుంది —
నా కంటే అవ్వే నిన్ను
ఎక్కువగా ప్రేమిస్తున్నదా అని !
వయస్సుతో ఏ ముంది ?
ప్రేమ శారీరకం కాదుగా !

ముడతలు పడ్డ ముసలి శరీరంలో
ఈరిక లెత్తే కన్నెకోరిక లుండవచ్చు !
తన భర్త మరో అబల పట్ల
దయ చూపడాన్నే సహించని స్త్రీ
సీతకో , రుక్మిణికో
సవతి కావడానికి సందేహించకపోవచ్చు !

వయసూ , శరీరమూ , కాలమూ , సమాజమూ
అనుమతించక పోతే పోనీ —
ఆ దోషం ప్రేమించే ఆత్మది కాదు !

ఆత్మలో పుడుతూనే వుంటై
అసంఖ్యాకంగా కోరికలు ,
ఆత్మాను సంధానం తోనే
తీరి పోతూ వుంటై అవి .

అవ్వ సేకరించే ఈ
పూజా పుణ్య నిధి నిక్షేపా లన్నీ
నీ కోసమే అయి వున్నా
ఆశ్చర్య పడివలసిం దేమీ లేదు !
ఆత్మానంద రస వాహిను లవి
అందుకొని అనుభవిస్తూ వుండు .

" ప్రతి లేఖా నీ ప్రేమ గొడ వేనా ? "
అన్నది మొన్న ఒక సారి !
" కంచి నుంచీ అదే ప్రేమ
కాశీ నుంచీ అదే ప్రేమా ? "
అన్నది బోసి నవ్వును దాచు కొంటూ !
" ఎక్కడి నుంచైనా , ఎప్పుడైనా
నే నివ్వగలిగింది అ దొక్కటే "
అన్నాను నేను .

క్షేత్రాలను , వాటి స్థల పురాణాలను ,
వాటి పరిసరాలను గురించి చెప్ప డానికి
గైడ్లు చాలా వున్నై కాదా ?

క్షేత్రాలు బహువిధా లైనా
భగవంతు డొక్కడే ,
మన లేఖ లో కొక్క టొకొక్క క్షేత్రం !
నీవూ , నేనూ విన
మరేం వుంటుం దందులో ?

108. బహుముఖాలు

దేవతా మూర్తులూ , తెల్లరాయి సమాధులు
ఇంకా బ్రతికి వున్న ఈ దేశంలో
కన్య నుంచి కైలాసి వరకు
అవ్వ ఏ క్షేత్రంలో వుంటే
నువ్వూ ఆ క్షేత్రంలోనే ఉంటావు !

ఆమె సంప్రదాయ శైథిల్యం .
నీవు నిత్యోన్మేష తారుణ్యం ,
అత్యద్భుతం మీ అను బంధం !

శిథిల శిల్పంలో కూడ
శివుణ్ని చూస్తున్న దామె ,
సాక్షాత్తు శివుడిలో కూడ
నీవు చూస్తున్నది శిల్పాన్నే !

ఆమె చూస్తున్నది అటు ,
నీవు చూస్తున్నది ఇటు !
వొళ్ళంతా కళ్ళు చేసుకొని
బ్రతుకే ఒక సహస్ర దళ పద్మం లా
చూస్తున్నాను నేను అన్ని వైపులా !
నువ్వు పడక గదిలో ప్రత్యక్షమైతే
అవ్వ వంట గదిలో వున్నట్టేగా ?

109. మృత్యువు లేదు

మనకు పదే పదే చెప్పబడుతున్న అర్థంలో
మృత్యువూ లేదు , పునర్జన్మా లేదు .

తృణ జలూకం లా , జల తరంగం లా
లేస్తూ పడుతూ పోతున్న కాలంలో
మృత్యువు ఒక అవస్థ .

పదార్థం మళ్ళీ పదార్థ మైపోవడం అది .
పదార్థానికి మృతి అనేది లేదు .

సృష్టికి పూర్వ స్థితి
లయానికి ఉత్తర స్థితి
ఒక్కటే — అది బీజం .

ఆద్యంత రహితంగా పేర్కొన బడే పరమాత్మ
ఒక మహా బీజ వాటిక !
కాలం , జీవం , భావం — ఏదైనా కానీ
అదొక నిత్య నిరంతర బీజ ధార !

మట్టిగానో , బూడిద గానో మారిపోయిన
ఏ కళేబరా న్నైనా చూడు !
అది మళ్ళీ జీవ సృష్టికి
ప్రాణభూతం అవుతూనే లేదా ?

కెరటం ఎంత ఎత్తుకు లేవగల దనేది
దాని పుట్టుక ఊపుపై ఆధారపడి వుంటుంది .

జీవస్థితి బీజ గతం !
శక్తి , స్వభావం , ప్రవర్తన
సమస్తమూ బీజ గతమే !
కర్మ చెయ్యడం , ఫలితం అనుభవించడం
అన్నీ అందులోవే !

ఒకో మూలికలో , ఒకో వ్యక్తిలో వలెనే
ఒకో క్షేత్రంలోనూ ఒకో శక్తి
విస్ఫుటమై , విశేషమై వుండవచ్చు !
అది తన పరిధిలోని ఆశ్రిత కోటిని —
గాజు పెంకులను సూర్యరశ్మి వలె —
జిగేలు మనిపించవచ్చు కూడ !
అది అంతవరకే !

దానివల్ల మనస్సుకు
ధైర్య స్థైర్యాలు కలుగుతై కాదా అంటే —
ఆరోపితాలు ఆత్మీయా లెలా అవుతై ?

సెంటిమెంటు మానసిక బలహీనత ,
విశ్వాసం ఆత్మవంచన !

వ్యక్తీభూత మైన అత్యున్నత శక్తినే
దైవశక్తి అంటాం — అంటే —
అందువల్ల ప్రయోజనం ఏం లేదు
ఆ దైవశక్తిని మార్కెట్లో పెట్టే
వర్తకుల మాయల్లో పడిపోవడం తప్ప !

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.

మోక్షంకోస మనో , పరలోకం కోస మనో
ప్రార్థనలూ , భజనలూ చెయ్యటం వ్యర్థం !

అహం బ్రహ్మ — నేను పర బ్రహ్మను —
అనుకొనే సోమరి సన్యాసికే కాదు ,
నేను చంద్రయ్యను అనుకొంటూ
నిత్యం శ్రమచేసుకొనే మన తోటమాలికి కూడ
మోక్షం వుంది , ఒకే రకమైన మోక్షం !

బ్రహ్మ నుంచి పుడుతూవున్న సృష్టి
బ్రహ్మలో లయించి పోవడం సహజం ,
అందుకు ఏ ప్రత్యేక శ్రద్ధా అక్కరలేదు !

నేను పదే పదే చెపుతున్న దందుకే —
మృత్యువూ లేదు , పునర్జన్మా లేదు .
వాటి తలంపే వద్దు .

తానే పరమాత్మ అనే సత్యాన్ని
ప్రతీ వ్యక్తీ గుర్తించి నప్పుడే
నిజమైన సోషలిజం !

ఈ సోషలిజానికి పునాది
భ్రమ నుంచి అవ్వ బైటపడ్డ క్షణం !

110. సెంటీ మెంటు

ఒక సాహిత్యసభ కోసం తిరుపతికి వెళితే —
ఒక మంచి వేంకటేశ్వర స్వామిని
బహూకరించారు వాళ్ళు నాకు,
ఆనందంతో స్వీకరించాను నేను !

గెస్టు హౌసులో నా రూంలో ఓ బల్లపై పెట్టి
నాకు వేసిన దండను వేసి అలంకరించాను,
ఎంతో ఆహ్లాద కరంగా వుంది ఆ దృశ్యం !

క్షేత్రాలనూ, విగ్రహాలనూ నమ్మని నాకే
ఇంత మనోరంజకంగా వుంది కదా !
నమ్మే వాళ్ళ కింకా ఎలా వుంటుందో !

అన్ని దృక్కోణాల నుంచీ ఆలోచించడం
నా బలహీనత మొదటి నుంచీ !
అందుకే — ఏదీ నిరర్థకం కాదు నా దృష్టిలో ,
దేన్నీ నిరాకరించలేను నేను పూర్తిగా !

భక్తుల కిదొక భగవంతుని విగ్రహం ,
నాకు ఒక సుందర కళా ఖండం !
సౌందర్యం ఎక్కడున్నా ఆరాధిస్తాను నేను
అది విగ్రహం కానీ — నిరజాజి కానీ !

" దీన్ని విరగకుండా ఇంటికి చేర్చడం
ఒక సమస్యే " అన్నాడు బాపురెడ్డి ,
" భద్రంగా పేక్ చేస్తాం " అన్నాడు గిర్‌గ్లానీ !
ఆలోచనలో పడ్డాను నేను !

పూజచేసే అలవాటు లేని నేను
ఇంటికి దీన్ని పట్టికెళ్ళడం మంచిదేనా ?
కేవల కళా ఖండాలకు పూజ అక్కరలేదు ,
విగ్రహానికి పూజలేనిదే శోభ లేదుగా !

భక్తి , ప్రార్థన , పూజ — ఇవి మూడూ
కేవల మౌఢ్యా లని నిరాకరించే నేను
ఇలా ఆలోచిస్తున్నా నేమిటి !
నటరాజు విగ్రహం లేదా ఇంట్లో ?

అదీ విగ్రహమే , ఇదీ విగ్రహమే !
అసలు ఏ విగ్రహాన్నీ గుర్తించని నాకు
అక్కడ లేని సంకోచం
ఇక్కడెందు కొచ్చింది ?

నటరాజు , వీణా పాణి , నిర్మల్ నర్తకి ,
లేపాక్షి లేమ , రామప్ప రామ —
అలాంటిదే కదా వెంకన్న బొమ్మ !
కా దంటున్న దేమిటో లోపలి నుంచి !
అదా ? అదే సెంటిమెంటు !

నేను భక్తులకు నాస్తికుణ్ని ,
నాస్తికులకు వేదాంతిని ,
వేదాంతులకు కవిని ,
నాకు మాత్రం నేను అవేమీ కాని
ఒక మామూలు మనిషిని —
కేవలం సుఖాభిలాషిని !

ఎన్ని ముఖాల ఆలోచించినా
సంకోచం పోనందువల్ల —
అక్కడి కక్కడే స్వామిని అమ్మేసి
ఇంటికి వచ్చేశాను నిశ్చింతగా !

ఓహో , సెంటి మెంటు !
రక్తంలో జీర్ణించుకు పోయిన
తరతరాల అంటు !

111. గుడిసెలు—గృహాలు

" గృహాల కంటే గుడిసెలే బహు సంఖ్యాకం
ఈ నా పవిత్ర భారత దేశంలో "
అన్నాడు బెజవాడ గోపాలరెడ్డి బాధగా
ఈ మధ్య ఒక సాహితీ సభలో ప్రసంగిస్తూ !

ఘటనా ఘటన శక్తే ఆయన చేతిలో వుంటే —
దేశంలోని గుడిసెలన్నీ
మేడలుగా మారివుండేవే ఆ క్షణంలో !
ఆ హృదయం అంత దీక్షతో తొణికింది ,
ఆ కంఠం అంత వజ్రంలా మెరిసింది !

ఆపాద మస్తకం నిండు హృదయమే అయి
స్పందించే ఆ పూర్ణ మానవతా మూర్తి
" ఈ గుడసె లన్నీ గృహాలు కావడం ఏ నాటికో "
అంటూ ఆకాశం చూచి నప్పుడు —
గజ గజ వణికింది గతం
భిన్న భిన్న మతాల , అవతారాల గొడ్డు బరువుతో !
గిజ గిజ తన్నుకొంది భవిష్యత్తు
గతం కాళ్ళకింద ఊపిరాడని మూలుగుతో !

ఈ దేశంలో ఎక్కడ ఎటు చూచినా —
గుడిసెలు , పాకలు , పూరి కొంపలు !
వాటిచుట్టూ మురికి , మూర్ఖత్వం , చీకటి !
వాటినిండా నిరుద్యోగం , నిరాశ , ఆకలి !

ఏ మతం అభయహస్తం చూపింది వాటికేసి ?
ఏ అవతారం వరదహస్తం చాపింది వాటిలోకి ?

తరతరాల , యుగయుగాల మానవ చరిత్రను
ఒక్కసారి పరికించి చూడు !
మనిషిని సమతవైపు నడపడానికి
ఎన్ని నీతులు ! నియమాలు ! విధులు ! నిషేధాలు !
ఎన్ని నిర్దేశక సూత్రాలు ! సమ్యక్ పథకాలు !
అ వన్నీ ఏమై పోయినై ?
ప్రణాళికలు లేకనా
ప్రజలు గుడిసెల్లో చస్తున్నారు ?

పరమేశ్వరుడు నిష్పాక్షికుడే ,
భక్తులే సంకుచిత బుద్ధులు !
అగ్రనాయకత్వం ఉదాత్త మైనదే ,
అనుచర వర్గాలే స్వలాభ లోభులు !
ఆదేశాలు సర్వజన శ్రేయస్కరాలే ,
వాటి అమలే నేతిబీరకాయ !

" సమాన మస్తు వో మనో !
ఓ మనుషుల్లారా ! సమానంగా బ్రతకండి " !
అన్న ఋగ్వేదం అమల్లో ఏమయింది ?

ప్రజలు తమ మంచి చెడ్డలను నక్కలకూ ,
పులులకూ వదిలేసి కూర్చున్నంత కాలం
ఏ సోషలిస్టు పథకం గతైనా ఇంతే !
ఆకలి లేకుండా వేటాడదు మృగమైనా !
ఏ ఫలసిద్ధి అయినా ఆత్మప్రేరణ తోడిదే !

ఇరవై సూత్రాలే కానీ —
అరవై నేత్రాలే కానీ —
తెరచి చూచినప్పుడే వెలుగు !
అమలు జరిగినప్పుడే అభ్యుదయం !
అప్పుడే ఈ గుడిసెలు గృహాలు కావడం ?
ఈ శవాలు శివులై లేవడం !

112. స్వభావం - సంస్కారం

" ఇదిగో , ఆగు ! "
కన్నీటి తెరల గుండా దూసుకు వచ్చిన
ఏదో దేవ గంధార స్వర మది !
ఇటూ , అటూ చూశాను
ఎవరూ కనిపించలేదు !

అంతటి అధిమానవ మాధుర్యంలో
ఎంతటి విషాద గాద్గధ్యం !

ఎవరు ?
" నే నే ! "

సగం ఎండిపోయిన ఒక చిక్కుడు పాదు ,
దుమ్ములో కలిసిపోయిన నాల్గు వంగ మొక్కలు ,

అంతే — మరేం లేదక్కడ !
కన్ను లొత్తుకొంటూ నిలబడ్డాను నేను !
ఎంతో ప్రేమతో పెంచుకొన్నాను వాటిని ,
ఎంతటి దుర్దశ పట్టింది వాటికి !

" ఎన్నాళ్ళయింది నీ వీ మూలకు వచ్చి ? "
అవును , నాలుగు రోజు లయింది !

నాలుగు రోజుల క్రితం , ఆ రాత్రి
మా దక్షిణం పొరుగు వాళ్ళ దొడ్లోనుంచి
ఎక్కడివో నాలుగైదు గేదెలు విరుచుకుపడి
నాశనం చేసేసినై — పూతతో , పిందెతో
కలకల్లాడుతున్న చిక్కుడు పాదును !

అంతకు ముందు వారం రోజులుగా
మా ఉత్తరపు పొరుగువాళ్ళ కోళ్ళు
నిత్య న్యూసెన్సుగా తయారై
కెక్కరించి పారెయ్య సాగినై —
పసి బిడ్డలను లా పెంచుకొంటున్న
వంగ , బీను , వగైరా మొక్కల్ని !

ఎంత కంచె కట్టాను !
ఎన్ని కళ్ళతో కాపుంటున్నాను !
ఆ శనిగాడి నీలి నెత్తురు కళ్ళు
నా కళ్ళు కప్పి , మేసేసినై తోటను !
ఎంత ఏడ్చాను !

ఏం చెయ్యను ?
ఆ శనిగ్రహం చచ్చేవరకూ ఇక
ఈ తోట మూలకు రాకూడ దనుకొన్నాను !

" ఎప్పుడు చస్తాడా శని ? "
ఏమో , ఎలా చెప్పను ?
అంతలో హఠాత్తుగా —
ఒక నిశిత విద్యుత్తరంగంలా తాకి
నా అజ్ఞానపు ప్యూజును ఎగరగొట్టేసిం దొక నవ్వు !

" ఎన్నో గ్రహాలలో శని ఒకడు ,
వా డున్నది నీ కొక్కడికే కాదుగా ?
కోళ్ళ మీదా , కుక్కల మీదా కోపంతో
మొక్కలనూ , మొగ్గలనూ వదులు కొంటావా ? "

ఎందుకు వదులు కొంటాను ?
వదులుకోను , ఎన్నటికీ వదులుకోను !
మరి — నాలుగు రోజులుగా చేసిం దేమిటి ?

చేతులు మోడ్చి , పైకి చూశాను —
తెగిపోయిన తీగలు ఎండిపోగా ,
బ్రతికివున్న మ్రోడులు మళ్ళీ చిగురిస్తూ ,
విషాదంగా చూసింది చిక్కుడు పాదు !

కళ్ళెత్తుకొని , క్రిందికి చూశాను —
కోళ్ళు కెక్కరించిన దూళి క్రింద

ఉక్కిరి బిక్కిరై మూల్గుతున్నై
ఏదో ఒక చేదోడు కోసం వంగ మొక్కలు !

వెంటనే లేచాను
గాలి తుపాకీ , తొళ్ళికా , కత్తి చేతపట్టి
మళ్ళీ ప్రవేశించాను తోటలో !
స్వ రక్షణ , స్వజన రక్షణ , స్వజాతి రక్షణ
ఇదే కదా లక్ష్యం -- పరమార్థం --
భగవంతు డెన్ని అవతారా లెత్తినా ?
మానవు డెన్ని వేషాలు మార్చినా ?

చిక్కుడు పాదు చెప్పితేనే కాని ఆ మాత్రం
నైసర్గిక సత్యం నీకు తెలీదా — అంటావు కదూ ?
ప్రతిరోజూ సుప్రభాతం పాడితేనే కాని
దేవుడికే మెలకువరాని ఈ దేశంలో
ఎంతటి ప్రసిద్ధ సత్యం కానీ — ఎవరో
అనుక్షణం జ్ఞాపకం చేస్తూనే వుండాలి మనిషికి !

తన స్వభావాన్ని అదుపులో పెట్టుకోవడం సంస్కారం ,
పర స్వభావాన్ని స్వానుకూల పరుచుకోవడం మనుజత్వం ,
స్వస్వభావాన్ని విశ్వశ్రేయస్సు కోసం మార్చుకోవడం
జీవ పరిణామ పథంలో మనిషి మరో మెట్టెక్కడం !

తోట మన దైనప్పుడు
దాని రక్షణ బాధ్యత కూడ మనదే !

113. జీవన వేదార్థం

సర్వ మానవ సమతను
సోషలిజం అంటున్నాం ,
విశ్వ జీవన సమతనే
సాధించిన వాడు శివుడు !

నేడు మన పెద్దలు చేస్తున్న ఉపదేశాలు , నినాదాలు
పూర్వ ఋషు లంతా చేసినవే కదా !

మరి , మానవు డెందుకు అనుసరించడు ?
ఆశపోతుల స్వప్రయోజ నాలకు
అవేవీ పనికి రావు కనుక !
సమాజాన్ని పాలించేది వాళ్ళే కనుక !

సత్యం , ధర్మం అంటూనే
ఆ రెంటినీ వదిలేసి కదా
ధర్మరాజు యుద్ధం గెలిచింది ?

సంసారం సాగరం అనే వాడు
హృదయ పూర్వకంగానే అంటున్నాడా ?
రాజ్య పాలన పూలపాన్పు కా దంటూనే
దాని కోసం ఎందుకు పీకలు కోస్తాడు ?

మానవ జాతిని సంఘటితంగా వుంచుతున్నవి
నీతులూ , ధర్మోపదేశాలూ కాదు —
ప్రతీకార భయమూ , సహకార సుఖమూ నూ !

మానవుడు సహజంగా స్వార్థపరుడు !
మానవుడే కాదు , ప్రతి జీవి అంతే !
దేవుడు , దయ్యం , స్వర్గం , నరకం ఏవీ
అతణ్ని లక్ష్యంనుంచి మరల్చలేవు !

ధీ మంతుడు మూర్ఖుణ్ని
ఆర్జన పరుడు నిరర్థకుణ్ని
పని మంతుడు సోమరిని
బలవంతుడు బలహీనుణ్ని
తనతో సమానంగా ఎన్నడూ చూడడు ,
మోసంచేసి దోచుకోడానికీ వెనుదీయడు !

ఎదిగే వాణ్ని ఎదగనీ !
ముందుకు పోయేవాణ్ని పోనీ !
అలసటతో , అశక్తితో పడివున్న వాడ్ని
అవసరాలు తీర్చి , ఆనందంగా బ్రతకనీ !
ఇదే నేను ఆవిష్కరిస్తున్న జీవన వేదార్థం ,
ఇదే నేను కోరుకొంటున్న సోషలిజం !
దీని కోసం ఎంత కృషైనా చెయ్యాలి ,
అందుకు నీవు వీలైనంత త్వరగా వచ్చెయ్యాలి !

సూచిక

అంకితం	పేజీ నం.
ఆముఖం	1-24
విలాసం ఒకటి	
1. నిదిధ్యాసం	1
2. ప్రాల్మాలిక	2
3. వట్టి శూన్యాన్ని	3
4. నా పుణ్యక్షేత్రాలు	4
5. చిరునామా	5
6. తుపాను పై స్వారీ	6
7. ముసురుపట్టిన మనసు	7
8. చీకటి వెలుగులు	9
9. ఆనంద క్షేత్రం	11
10. దీర్ఘ రాత్రులు	12
11. భావోత్సేకం	14
12. ఎవరి చుట్టూ ఎవరు	15
13. మన మధ్య దూరం	18
14. ముద్దులతో అద్దరికి	19
15. అలసిపోయిన దైవం	20
16. ఈ ప్రతిమ లన్నీ	22
17. మనం ఇద్దరం	23
విలాసం రెండు	
18. సృష్టి-కళా సృష్టి	24
19. తలుపుతట్టిన ఉదయం	27
20. చుట్టూవున్న లోకం	32
21. ప్రగతిస్వభావం	34
22. సౌఖ్యమేనా	35
23. నాతోస్నేహం	37
24. ఒక్క పేజీ కోసం	38
25. శిల్పలేఖ	41
26. అన్నీ అద్దాలే	43
27. నిత్యకాష్ఠం	45
28. నరకం నుంచి	47
29. మరొకరితో పోలిక	50
30. పాపం రాముడు	54
31. దారిలో వేపచెట్టు	57
32. మంచికి మంచి రోజులు	62
33. క్షేత్రజ్ఞత	65
34. చిత్రకళా ప్రదర్శన	67
35. నిస్సహాయత	70
విలాసం మూడు	
36 ఆరని కొలిమి	71
37. గంగా బొండం	74
38. ఎంత ప్రయాణమైనా	78
39. ఎవ రంటే	80
40. జ్యోత్స్న స్నానం	83
41. పాత ఉత్తరాల కట్ట	85
42. నా [illegible]	87
43. నాగులు [illegible]	89
44. ఆశకు [illegible]	90
45. ఎవరిని తిరస్కరించను	94
46 నిష్క్రియ	96
47. బీజ భవిష్యం	98
48. పేరేదైనా	99
49. మనస్సులో మెరుపులు	100
50. వెతుకుతూనే వుండేవి	102
51. పరాధీన స్వర్గం	104
52. ప్రేమలేఖ—శివాలక	105
విలాసం నాలుగు	
53. హృల్లేఖం	107
54. మహా మాయ	109
55. సహస్ర ముఖ	111

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

		పేజీ నం.
56.	ఇహపర సాధనం	113
57.	నేనే లేఖ నైతే	115
58.	జీవితానికి లక్ష్యం	117
59.	భ్రాంతికి బానిసలు	120
60.	ప్రకృతి మహాసర్పం	122
61.	నిండుగాపూచిన గున్న	123
62.	గోరింక పిల్ల	124
63.	ఆత్మీయులైన వాళ్లు	127
64.	రోజూ ఒక ఉగాది	129
65.	రస రమ	132
66.	పరమ ధూర్తుడు	133
67.	మురికి కవరులో మోహనలేఖ	135
68.	తీరని కోరికలు	136

విలాసం అయిదు

69.	దారి ఎటు	137
70.	దీప లక్ష్యం	139
71.	ఎవరి లక్ష్యమైనా	141
72.	సంపూర్ణ స్త్రీత్వం	143
73.	ఎండమావులలో ఎలనీరు	145
74.	అన్నీ వుండీ ఏమీ లేనివాణ్ని	146
75.	ఆదర్శం	147
76.	విరహశయ్య	151
77.	పులి-నక్క-గొర్రె	153
78.	వాంఛా క్షేత్రాలు	155
79.	హేమంతంలో వసంతాన్వేషణ	159
80.	నా పుట్టిన రోజు	162
81.	నాయకశక్తి	163
82.	అవ్వ భక్తి	165
83.	హరిహరాద్వైతం	167
84.	మనిషి మారడా	169
85.	సృష్టి పథకం	171
86.	గంగా గోదావరులు	173
87.	హంస పిల్లలు	175
88.	సుఖ సంపదలు	177

విలాసం ఆరు

89.	శివ సోషలిజం	179
90.	కామం కారుదున్న	182
91.	వట్టి ఊహలు	184
92.	మరమ్మత్తా, పునస్సృష్టా	186
93.	వెలిగినంత సేపే	188
94.	చచ్చిపోయిన వెనుక	192
95.	అవతలి తీరం	198
96.	చావుకు విరుగుడు	201
97.	మనిషి-దేవుడు	203
98.	మతంపెట్టిన శాపం	205
99.	విప్లవ చక్రం	209
100.	అవతారాల నిర్వాకం	212
101.	పూర్ణిమనుంచిపూర్ణిమకు	215
102.	బేంకులలో నిల్వలు	2 6
103.	నిరంతర వర్తమానం	217
104	ప్రసవ వేదన	219
105.	శిల-శివం	220
106.	పూర్ణమదః పూర్ణమిదం	223
107.	అవ్వ—ప్రేమ	227
108.	బహుముఖాలు	230
109.	మృత్యువు లేదు	231
110.	సెంటిమెంటు	235
111.	గుడిసెలు-గృహాలు	238
112.	స్వభావం-సంస్కారం	241
113.	జీవన వేదార్థం	245

BCI

AOUA10113101

BC

SIVAALAKALU

(The Love Locks of Siva)

By

Maha Kavi, Kala Prapoorna,
Padma Shri,

Dr. Boyi Bhimanna

: *For Copies* :

SUKHELA NIKETAN
I. C. 85, I. M. Colony, Hyderabad-4.

Price : Rs. **12/-**

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA101B101
పుస్తకం పేరు	శివాలంకలు
తారీఖు	31 December 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	277
పిర్జ పైజా పేజీలు	no
ఖాళీ పేజీలు	CI, BCI
లేని పేజీలు	no
తయారు చేసినది	Jayalakshmi
పేజీలు విదలీసినది	Jayalakshmi
స్కాన్ చేసినది	MADHU MATHI
పరీక్ష చేసినది	MADHU MATHI
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good